భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు:

శివలెంక శంభుప్రసాద్

★

జూన్ 1969

★

సంపుటము : 46 : సంచిక : 6

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1969

రేపటి నీ జీవితం

శ్రీ నూతలపాటి గంగాధరం

మంచినీ, చెడునూ వేర్పరచే
పరమహంసల్ని గురించి చెప్పాను
రాత్రింబవళ్లను కలిపి విడదీసే
ఉదయసంధ్యల్నిగురించి చెప్పాను
అందని ఆకాశంలో అన్నితారకలు
ఎందుకలా ఊరిస్తున్నాయో అదీ చెప్పాను
నేల నలుమూలల నిండిన పూలబాలలు
మరుక్షణంలో నీ ఆనందా న్నెందుకలా
మంట గలిపి మాసిపోతున్నాయో అదీ చెప్పాను
ఇంకేం చెప్పలేదంటావు?

అసత్యాన్ని సత్యంచేసే జననాన్ని గురించీ
సత్యాన్ని అసత్యంగా మార్చేసే మరణాన్నిగురించీ
ఎప్పుడో చెప్పాను.
జననానికిముందు నీవెక్కడ, ఎలా ఉన్నావో
మరణానికి పిమ్మట నీవెక్కడికి పోతావో
ఏమవుతావో—ఇంతవరకే చెప్పాను.

జనన మరణాలకి మధ్య ఉవ్వెత్తుగా లేచిన
నీ జీవితాన్నిగురించీ,
రేపటి నీ జీవితం—
తినే వెన్ననిగురించీ, పంచుకునే వెన్నెల్నిగురించీ
ఇప్పుడు చెబుతున్నాను!
ఇంకా ఏం చెప్పమంటావు?

భూమిమీద చితికిన బ్రతుకులు సుఖించడానికి
స్వప్నభూము లున్నాయనీ,

వేణ్ణీళ్లని చల్లగా, చన్నీళ్లని వేడిగా భావించి
కన్నీళ్లని తాగేసి కలకలా నవ్వే మనిషికి
కాంతిలోకం ఎదురుచూస్తున్నదనీ,
ఎరువు తెచ్చుకున్న కృత్రిమశాస్త్ర సూత్రాలతో
బ్రతుకులను కట్టిపడేస్తే వ్యక్తిత్వం మిగలదనీ,
ప్రేమ. జాలి, కరుణ కరువైన మరుభూముల్లో
నిలబెట్టిన యూపస్తంభానికి మానవత్వం కలుగదనీ—
నేడేనా? ఏనాడో చెప్పాను!
ఇంకా అసత్కారంగా, ఇంకా రసవత్తరంగానే చెప్పాను
నువ్వెప్పుడు విన్నావు గనుక?
ఇప్పుడు వింటావని ఎదురుచూడ్డానికి!

మొహం కాలినప్పుడూ,
గుండెవెనుక భూమి చీలినప్పుడూ,
మెదడులోని అణుబాంబు ప్రేలినప్పుడూ
కళ్లలోని వసంతానికి నిప్పంటుకున్నప్పుడూ
అప్పుడు నన్ను వెతుక్కుంటావు!
అప్పుడేకాదు ఎప్పుడూ నీ వెన్నంటే ఉంటాను
నా గుండెల్లో తలదూర్చి కుళ్లికుళ్లి ఏడుస్తావు
తల్లిలా, పెళ్లాంలా — ఆప్తంగా, గుప్తంగా ఓదారుస్తాను
నీలో కరడుగట్టిన పిరికితనాన్ని
ఊచముట్టుగా లాగేసి
గుండెనిండా కొత్తనెత్తురు నింపుతాను
ప్రాణం పుంజుకోగానే బాణంలా ఎదురుతిరుగుతావు
అప్పుడు నేనూ, నా మంటలూ, నా పాటూ
ఏవీ రుచించవు నీకు!
మళ్లీ కథ మొదటికి వస్తుంది!

రాచూరు, ఇర్విన్ శిలాశాసనములు

శ్రీ బి. ఎన్. శాస్త్రి

1. నల్లపయ్య నాయకరు రాచూరు శిలాశాసనము

మహబూబునగర మండలము కల్వకుర్తి తాలూకా లోని రాచూరు గ్రామమున కేశవదేవర ఆలయ సమీపమున నున్న ఇంటిగోడ ప్రక్క ఒక శిలాశాసన మున్నది. పశ్చిమ చాళుక్యరాజగు మూడవ తైలపుని కాలమున ప్రెగ్గడ నల్లపయ్యనాయకరు రావితొంబుత శ్రీ మల్లికార్జునదేవరకు నందాదీయలు పెట్టించు సందర్భమును పురస్కరించుకొని వేయించిన శాసనమిది. రాచూరు కేశవదేవర ఆలయమునగల మల్లిసెట్టి వేయించిన శాసనములు ఇదివరలో ప్రకటింపబడినవి[1]

ఆకారాదికములు :

ఈ శాసన శిలాఫలకము పొడవు 3.5 అడుగులు. వెడల్పు 3 అడుగులు. శాసన శిలాఫలకము క్రింది భాగమున కొంత విరిగిపోయినది. శాసనము తెల్లరాతిపై చెక్కబడినది రాయిగరుకుగా నుండుట వలనను అక్షరములు లోతుగా చెక్కబడియుండకుండుట వలనను, శాసన ప్రతిబింబము పేపరుపై తీసికొనుట కనుకూలముగా లేనందున రెండు మూడు ఛాయా ప్రతిబింబములు తీయుట తటస్థించినది.

ఈ శాసనశిల గరుకుగా నున్నది. శాసన భాగమున్నంతవరకైనను రాతిని నునుపుగా చెక్కియుండలేదు అంచులవరకు అక్షరములు చెక్కబడినవి. శాసనారంభమున శైవమత చిహ్నములైన చంద్రుడు, వృషభము, శివలింగము, నంది, సూర్యుని ప్రతిబింబము చెక్కబడినవి.

ఈ శాసనము మొత్తము 17 పంక్తులలో వ్రాయబడినది. కాని 16, 17 పంక్తులు చదువుటకు వీలులేకుండ నున్నవి శాసనశిల క్రింది భాగము విరిగిపోవుటవలన కొన్ని అక్షరములు సగము, సగము మాత్రమే కనుపించుచున్నవి.

లిపి :

ఈ శాసనమున, ఆంధ్రదేశమున పండ్రెండవ శతాబ్దిలో వాడుకలోనున్న తెలుగు—కన్నడ లిపి వాడబడినది. తెలుగు కర్ణాట భాషలకొకే లిపి, కాకతీయ రాజన్యులలో గణపతిదేవ మహారాజు పరిపాలనాకాలము వరకుగల శాసనములలో కనిపించుచున్నది. కాని రుద్రమదేవి కాలమునాటికి తెలుగు లిపి మారిపోయినది. తెలుగుభాషా స్వరూపముమారి, ఆంధ్ర గ్రంథములందున్న తెలుగు పదములు విరివిగా నుపయోగింపబడినవి.* రుద్రమదేవి పరిపాలనాకాలము నాటికి తెలుగు లిపి నేటి లిపికి సన్నిహితముగా మారినదనుటకు బొల్లేపల్లిలో లభించిన రెండు శిలాశాసనములలోని[2] లిపిని పరిశీలించిన మనకీ విషయము స్పష్టమగును. ఈ శాసనమున కొన్ని అక్షరములు స్పష్టాస్పష్టముగ నుండి చదువుటకు వీలులేకుండ నున్నవి.

భాష :

ఈ శాసనము కన్నడభాషలో వేయింపబడినది కల్యాణీచాళుక్యుల శాసనములు, వారి సామంత మాండలికుల శాసనములు కన్నడభాషలోనే వేయింపబడినవి. కాకతి ప్రోలరాజు శాసనములుకూడ కన్నడ భాషలో వేయింపబడినవి. ఇందుకొన్ని సంస్కృత భాషలోను కలవు శాసనారంభమునుండి 9 పంక్తుల వరకు చాళుక్య ప్రశస్తి, శాసనమిచ్చిన సంవత్సరము

---

1. ఆంధ్రపత్రిక 'సౌమ్య' ఉగాది సంచిక, మార్చి 1969.

2. భారతి మార్చి 1969.

తిథి వారములు, పర్వదినము పేర్కొనబడినవి. 'ఱ' వాడబడినది. 'ర'కారమునకు పూర్వాక్షరము ద్విత్వము గను, అనుస్వారమునకు బదులు అనునాసికాక్షరములును వ్రాయబడినవి. మల్లికార్జున-బదులు మల్లికార్జ్జున; ప్రవర్ధమాన బదులు, ప్రవర్ద్ధమాన; అనియు, సంక్రాంతి బదులు సంక్రాన్తి వ్రాయబడినది.

శాసన విషయము :

ఈ శాసనము కల్యాణి చాళుక్య ప్రభువగు మూఁడవ తైలపదేవుని కాలమున ప్రెగ్గడ నల్లపయ్య నాయకరు వేయించినది. శాసనమున తైలపదేవునికి చాళుక్య ప్రశస్తి చేర్చబడినది. తైలపదేవు డీ శాసనమున 'సమస్త భువనాశ్రయ శ్రీ ప్రిథ్వీ వల్లభ మహారాజాధిరాజపరమేశ్వర, పరమభట్టారక, సత్యాశ్రయకులతిలక చాళుక్యాభరణ శ్రీ మత్తైలప దేవర' అని వర్ణింపబడినాఁడు. ఈ తైలపదేవుఁడు రెండవ జగదేకమల్లుని సోదరుఁడు మూఁడవ సోమేశ్వరుని రెండవ కుమారుఁడు. త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుని మనుమఁడు. ఇతనికి త్రైలోక్య మల్లనూర్మ్మడి తైలపుఁడని పేరు. ఇతని పరిపాలనా కాలము క్రీ. శ. 1155—1161.

ఈ శాసనమును తైలపదేవుని సమస్త ప్రధాని, బణ్ణిగెయధికారియు నగు, ప్రెగ్గడ నల్లపయ్య నాయకరు రావితొఱుతి శ్రీ మల్లికార్జున దేవరకు నన్దాదివియలు పెట్టించిన సందర్భమున వేయించెను. శాసనాంతమున 'స్వదత్తాం పరదత్తాం' శ్లోకమున్నది.

కా ల ని ర్ణ య ము :

ఈ శాసనము త్రైలోక్య మల్లనూర్మ్మడి తైలపుని కాలమున చాళుక్య విక్రమవర్షము 80 ప్రమోదూత సంవత్సర ఫాల్గుణ బహుళ అమావాస్య బుధవారము, విషు సంక్రాంతినాడు ఈయబడినది.

కాకతి రెండవ ప్రోలరాజు పరిపాలనా కాలము క్రీ. శ 1115—1158; శకసంవత్సరము 1070 లో వేయింపబడిన సిరికొండ శాసనము[3] ప్రకారము, కందుకూరి ఉదయనచోడ మహారాజు కల్యాణి చాళుక్య ప్రభువగు రెండవ జగదేకమల్లుని సామంతుడని తెలియుచున్నది అనగా క్రీ శ. 1148 వరకు ఉదయన చోడుడు జగదేకమల్లుని సామంతుడే. కాకతి రెండవ ప్రోలరాజు శ సం. 1071 అనగా క్రీ. శ. 1149 వరకు రెండవ జగదేకమల్లుని సామంతుడుగా నున్నట్లు తెలియుచున్నది[4].

కాకతి రెండవ ప్రోలరాజు, కందూరి ఉదయన చోడమహారాజు ఇద్దరును, రెండవ జగదేకమల్లుని సామంతులు. రెండవ జగదేకమల్లుని మరణానంతరము కాకతి ప్రోలరాజు విజృంభించి, అనేకమాండలికుల జయించెను. కల్యాణి చాళుక్య తైలపు నోడించి గౌరవముగా విడిచిపుచ్చెను. చాళుక్య సామ్రాజ్యాంతర్గతమైయున్న కొలనుపాక మండలమును తన సామ్రాజ్యమున చేర్చెను. అప్పటికి కందూరు మండలము తైలపుని స్వాధీనమందుండెను ఉదయనచోడ మహారాజు కందూరునాటిని తైలపుని సామంతుడుగా పాలించుచుండెను కాకతి ప్రోలరాజు. దేశ రాజకీయముల నవగతము చేసికొని, కుంశోరి దేశాధిపతి నవలీలగా జయించినట్టి గోవిందరాజును యుద్ధమునం దోడించి, అతడు పరిపాలించు వేలకొండపల్లి ప్రాంతమును ఉదయనచోడున కొసంగెను. ఉదయనచోడుడు మహామండలేశ్వరుడు, కల్యాణి చాళుక్యుల సామంతుడు, బలపరాక్రమసంపన్నుడు. చాళుక్యరాజ్యపు సరిహద్దులందుగల కందూరునాడును పాలించువాడు. కావున ప్రోలరాజు ఉదయనచోడుని చేరదీసెను.

క్రీ. శ. 1157 నాటి రాచూరు శాసన[5]మందును, క్రీ. శ. 1162 నాటి జడ్చర్ల శాసన[6]మందును. ఉదయనచోడమహారాజు, స్వతంత్రుడుగా నున్నట్లు శాసనములోని ప్రశస్తినిబట్టి తెలియుచున్నది. ఈ శాసనములలో శక సంవత్సరము వాడ

3. అప్రకటితము.

4. శనిగరం శిలాశాసనము—అప్రకటితము.

5. ఆంధ్రపత్రిక—సౌమ్య ఉగాది సంచిక.

6 Hyderabad Archaeological Series No. 19 Mn 12 & 13.

బడినది. ఉదయనచోడమహారాజు, కల్యాణీ చాళుక్య ప్రభువునకుగాని, కాకతిప్రోలరాజు లేక రుద్రదేవునకు గాని సామంతుడైనట్లు పేర్కొనబడలేదు. ఉదయన చోడునికి పూర్వులైన కందూరి చోడరాజుల శాసనములందు చాళుక్య విక్రమశకము వాడబడినది.

కాకతిప్రోలరాజు తైలపదేవుని, గోవిందరాజును జయించినపిమ్మట, మంత్రకూటప్రభువగు గుండ రాజును, తన నగరమును ముట్టడింపవచ్చిన జగద్దేవు నోడించినతరువాత వెలనాటిని జయింపదలచెను. వెలనాటి ప్రభువగు రెండవ కుళోత్తుంగచోడునితో జరిగిన ఒకానొక యుద్ధమున కాకతిప్రోలరాజు మరణించెను. ఈ వెలనాటిరాజునకు 'కాకతిప్రోల నిర్దహన' అను బిరుదమున్నట్లు ద్రాక్షారామ శాసనమువలన తెలియుచున్నది.


ప్రోలరాజు మరణానంతరము కందూరి ఉదయన చోడమహారాజు విజృంభించి, తన కుమారులగు భీమ గోకర్ణుల ప్రోత్సాహమున స్వాతంత్ర్యము ప్రకటించి విశాలసామ్రాజ్యనిర్మాణ ప్రయత్నమందుండెను. మూడవ తైలపుడు క్రీ శ 1161 ప్రాంతమున మరణింప, ఉదయనచోడుని జ్యేష్ఠకుమారుడు భీమ దేవచోడుడు కల్యాణీరాజ్యభాగము లాక్రమించి, కాకతి ప్రతాపరుద్రునిచే ఓడింపబడి, కాకతీయ సామంతుడుగా నుండ నంగీకరించెను

మూడవ తైలపదేవుడు క్రీ. శ 1155 ప్రాంతమున చాళుక్య సింహాసనాసీనుడయ్యెను. ఈ శాసనము చాళుక్య విక్రమవర్షము 80 ప్రమోదూత నామ సంవత్సరము ఫాల్గుణ బహుళ అమావాస బుధవారము విషుసంక్రాంతి దినమున నీయబడినది. కావున ఈ శాసనకాలము క్రీ శ. 1156-1157; శక సంవత్సరము 1079 నాటికి కల్యాణీ చాళుక్యుల పరిపాలనము కందూరి మండలమున అంతరించినది.

రావితొఱుతిగ్రామము పూర్వము ప్రసిద్ధమైన నగరము. మల్లిసెట్టి వేయించిన రాచూరు శాసనము అందును రావితొఱుతి పేర్కొనబడినది. రావితొఱుతి నేటి రాచూరు. ఇచట కల్యాణి చాళుక్యుల పాలనము లోను, కందూరి చోడుల పాలించునాడును 'సవదర' నివసించుచుండెనని తెలియుచున్నది. కోడూరి మున్నూటిని పాలించు 'సవదర' రావితొఱ్తి పోతి నాయకుని ప్రశంస శక సంవత్సరము 1079 లో వేయింపబడిన రాచూరుశాసనమున నున్నది. కాకతి ప్రోలరాజు తైలపదేవుని క్రీ. శ. 1156 లో ఓడించియుండును, నేలకొండపల్లిప్రాంతము ఉదయన చోడుని కదే సంవత్సరమున నిచ్చియుండును. ఉదయన చోడమహారాజు తైలపదేవుని మాండలికుడుగానుండ నంగీకరింపక క్రీ. శ. 1157 లో స్వతంత్రుడయ్యెను.

శాసనము—మూలము

1. స్వస్తి సమస్త భువనాశ్రయ శ్రీ ప్రిథ్వీవల్ల
2. భ మహారాజాధిరాజ పరమేశ్వర పరమ భ
3. ట్టారక సత్యాశ్రయకులతిలక చాలుక్యాభరణ శ్రీ
4. మత్తైలపదేవర విజయరాజ్య ముత్తరోత్తరాభి వ్రి
5. ద్ధిప్రవద్ధమాన మాచంద్రార్కతారంబరం కల్యాణపురదనె
6. లెవిడినోల్ సుఖసంకథావినోదదిం రాజ్యం గెయ్యుత్తమి
7. రె శ్రీమచ్చాళుక్య విక్రమ వర్షద (80 ప్రమోదూత) సంవత్సరద ఫా
8. ల్గుణ బహుళ దమవాసె బుధవార విషుసంక్రాన్తి నిమి



9. త్తద శ్రీమత్త్రైలపదేవన ధమ్మ్రఁవాగి సమస్త ప్రధాని ద
10. హెదెయ సాద బణ్ణిగె యధికారి పెగ్గడె నల్లపయ్య నా
11. యకరు రావితొఱతియ శ్రీ మల్లికాజ్జుఁనదేవరిగె న
12. న్నాదివిగె గద్దె మఱయోకలు మ—క—తెనివెదవగా
13. దె—కుదొయనెన్డిగ సాశనవాగి—శ్రీ బల్లవరసర ధమ్మ్ర
14. వాగి బిట్టెయా। స్వదత్తం పరదత్తం వా యోహరేతి వ
15 సుంధరా షష్టిర్వషఁ సహస్రాణి విష్ఠాయాంజాయతే
16. క్రిమి॥ ఈ ధమ్మ్రఁ వ................
17. రణాసియం...................

2. వావిలాల రుద్రయరెడ్డి ఇర్విన్ శిలాశాసనము

మహబూబునగర మండలము కల్వకుర్తి తాలూకాలోని ఇర్విన్ లేక ఇరువెంటి గ్రామమున కాకతి రుద్రమదేవి ఓరుగల్లు రాజధానిగా తెలుగు దేశమును పాలించుకాలమున, మహాసామంత వావిలాల రుద్రయరెడ్డి తమ అప్ప రుద్రసానిగారికి పుణ్యముగా శ్రీ ఇంద్రేశ్వరదేవర పాత్రభోగానకు, భూమిని దానమిచ్చు సందర్భమున వేయించిన శాసనమున్నది.

హైద్రాబాదు — కల్వకుర్తి రోడ్డుపైనున్న ఆమనగల్లు గ్రామమునుండి పదిమైళ్ల దూరమున నున్న ఇర్విన్ గ్రామమువరకు జిల్లాపరిషత్తు రోడ్డు కలదు.

ఇంద్రేశ్వరాలయము :

ఇర్విన్ గ్రామము నంటి చిన్నఏరు ప్రవహించుచున్నది. ఏటియొడ్డున బ్రాహ్మణపల్లిరోడ్డు కుడి ప్రక్క, శిథిలరూపమున నున్న ఇంద్రేశ్వరాలయమున్నది. ఈ ఆలయ సమీపమున శిథిల దేవాలయ చిహ్నములు కనిపించుచున్నవి. నంది విగ్రహములు, శక్తి విగ్రహములు, మహానాగములు, చెక్కిన శిలాఫలకములు, వీరభద్రుని విగ్రహములు విశేషముగ నున్నవి.

ఇంద్రేశ్వరాలయ గోపురము పడిపోయినది. గ్రామీణులు గర్భగుడి బాగుచేయించి ఒక గది కట్టించినారు. గ్రామప్రజలు ఇంద్రేశ్వరాలయమునకు వచ్చి పూజలు చేయుచుందురు. ప్రతిసంవత్సరము శివరాత్రి ఉత్సవము లిచట జరుగును.

ఇంద్రేశ్వరాలయ శిథిల ముఖద్వారముముందు ఎత్తైన నంది విగ్రహమున్నది. అది నల్లసరపు రాతితో నిర్మించినట్టిది. చూచుట కందముగ నున్నది.

ఇర్విన్ గ్రామమున అచ్చటచ్చట శిథిల రూపముననున్న శివాలయములు, హనుమదాలయములు, భైరవుని విగ్రహములు కనిపించుచున్నవి. ఈ శిథిల ప్రాంతమున పూర్వము ఇరువెంటి పట్టణ ముండియుండును.

ఇరువెంటి గ్రామమునకు రెండు మైళ్ల దూరమున గిరికొత్తపల్లి గ్రామమున్నది. ఇచట ఎత్తైన గోపురముగల చెన్నకేశవాలయమున్నది.

శాసనము — ఆకారాదికములు :

ఈ శాసనమును కాకతి రుద్రమ పాలించు కాలమున, మహాసామంత చెఱకు ఇనమ్మడి బొల్లయ రెడ్డిగారి వియ్యము మహాసామంత వావిలాల రుద్రయ రెడ్డి తమ అప్ప రుద్రసానిగారికి పుణ్యముగా ఇంద్రేశ్వరదేవరకు భూమి దానమిచ్చు సందర్భమున వేయించెను. శాసనము తెల్లరాతిపై చెక్కబడినది. శాసనశిల ఎత్తు నాలుగు అడుగుల మూడు అంగుళములు; వెడల్పు ఒక అడుగు ఒక అంగుళము.

శాసనారంభమున సూర్యచంద్రుల ప్రతిమలును పానవట్టముతో కూడిన శివలింగమును చెక్కబడియున్నవి. ఇవి శైవమత చిహ్నములు. రెండవప్రక్క వృషభమ్ము, డాలు, కత్తి చెక్కబడినవి. మూడవవైపు నంది చెక్కబడినదికాని శాసనము రెండవ ప్రక్కతోనే అంతమైనది ఇది తెలుగు శాసనము శాసనమున మొదటిప్రక్క 19 పంక్తులు, రెండవప్రక్క 16 పంక్తులు మొత్తము 35 పంక్తులున్నవి.

లిపి :

ఆంధ్రదేశమున 13 వ శతాబ్దిలో వాడుకలో నున్న తెలుగు లిపి ఈ శాసనమున వాడబడినది. శాసనాక్షరములు ఈ కాలమున వెలసిన కాకతీయుల ఇతర తెలుగు శాసనములలోని అక్షరములను పోలియున్నవి. ఆధునిక తెలుగు లిపికి సన్నిహితముగా ఈ శాసనలిపి ఉన్నది. శాసనారంభమున శుభప్రతిపాదకమైన 'స్వస్తిశ్రీ' వాడబడినది. శాసనాంతమున మంగళమహాశ్రీశ్రీశ్రీ వ్రాయబడినది.

భాష :

శాసనమంతయు తెలుగుభాషలో వ్రాయబడినది. శాసనము చివర వ్యాసగీతాశ్లోకములుగాని, దానఫలమును తెలుపు శ్లోకములుగాని లేవు. చేయుచునుండగాను—బదులు సేయుచూనుండాగాను అనియు, శకవర్షాలు — బదులు శకవషాలు అనియు; చెఱకు ఇనమ్మడి బదులు చిఱకుయనమ్మ అనియు వ్రాయబడినవి.

శాసన విషయము :

శ్రీ మన్మహామండలేశ్వర కాకతీయరుద్రదేవ మహారాజు పృథ్వీరాజ్యము చేయుచున్నకాలమున శక సంవత్సరము 1173, ప్రజాపతి సంవత్సరము పుష్య బహుళ అష్టమీ శనివారము మకరసంక్రమణ కాలమున మహాసామంత చెఱకుయనమ్మ బొల్లయరెడ్డి వారి వియ్యము మహాసామంత వావిలాల రుద్రయరెడ్డి తమ అప్ప రుద్రసానిగారికి పుణ్యముగాను ఇరువెంటి ఇంద్రేశ్వరదేవర స్వాత్రభోగానకు కంభలంమ కాల్వ సుఱాడ్లకాల్వక్రింద అడ్డాను, మడ్లకాల్వను పాతికాను, కార్తీకవైశాఖాలు సూర్యచంద్రులు కలంత కాలము వృత్తిగా నిచ్చెను. కార్తీక వైశాఖాలు—అనగా కార్తీక వైశాఖమాసములందువచ్చు పంటలని అర్థము. కార్తీకమాసమువచ్చు పంటను వానకాలపు పంట లేక ఆబీపంట అందురు. వైశాఖమాసములో వచ్చు పంటను యాసంగి లేక వేసంగి, తాబీపంట అందురు.

శాసనకాలము :

ఈ శాసనము శాలివాహన శకవర్షము 1173 ప్రజాపతి సంవత్సరము పుష్య బహుళ అష్టమీ శనివారము మకరసంక్రమణ కాలమున వేయింపబడినది. శక సంవత్సరము 1173 పుష్య బహుళ అష్టమీ శనివారము మకరసంక్రాంతి క్రీ. శ. 1252 జనవరి 5 వ తేదీకి సమానమగును. కాకతి గణపతిదేవ మహారాజు జీవించియున్నపుడే రుద్రమదేవి రాజ్యభారము వహించియుండును క్రీ. శ. 1250 ప్రాంతమునుండి రుద్రమదేవి, రుద్రదేవమహారాజను పేర రాజ్య మేలుచుండెనని భావింపవచ్చును. రుద్రమదేవి సామంతులుగా, చెఱకుయిసమ్మడి, వావిలాల వంశీయులు, వ్యవహరించినారు. అమరాబాదుప్రాంతము చెఱకుఇనమ్మడి వంశపురెడ్ల అధీనమందుండెనని అచటి శాసనములవలన తెలియుచున్నది. రుద్రమదేవి పాలించు నాటికి కందూరి చోడవంశ మంతరించినది. వర్ధమానుపురము రాజధానిగా కందూరునాడును గోనవంశీయులు పాలించుచుండిరి చెఱకుఇనమ్మడి వంశీయులు, వావిలాల వంశీయులు, గోనవంశీయుల బంధువర్గములోనివారు. వావిలాల వంశీయులగు రెడ్లకు, చెఱకుఇనమ్మడివంశపురెడ్లతో సంబంధబాంధవ్యము లున్నట్లు శాసనమువలన తెలియుచున్నది. చెఱకు ఇనమ్మడి వంశీయులతో బొల్లయరెడ్డి ప్రసిద్ధుడు ఇతని వంశీయుడగు చెఱకుయినమ్మడి విశ్వనాథదేవర వేరొక శాసనమున[7] కనిపించుచున్నది. బొల్లయరెడ్డిని పేర్కొను రెండు శాసనములు[8] అమరాబాదులో లభించినవి. ఇందు శక సంవత్సరము 1186 రక్తాక్షి సంవత్సరమున చెఱకుయినమ్మడి విశ్వనాథదేవర ఆయురారోగ్యాభివృద్ధికి "శ్రీ సిద్ధమహాలక్ష్మి ప్రతిష్ఠచేసి శుకదేవరలు కీర్తికుంట వెనుక కాలువ ఇంమడిదేవర ఇచ్చినది. ఒక మర్తురు, నకరలపల్లి పడుమటి వెనుక పాతికడు. ఆ యూరి తూర్పున గణేశ్వరదేవరకు ఉత్తరాన వెలిపొలమునం పెద్దగద్దంటి తూర్పుదెసగ కేతనేనికుంట వెనక ఒక మర్తురు. తాడికొలన పడుమటి కాలవ మంచిరాజు పాదిక – మాదేవి–నేలగాను పాటకాలువ పొలమునకు పాదిక – పెలయమత్తి పడమటి వల్ల శంకరుడు (5) ఏందుము—రేవనపెద్దిచేని తూర్పున తేకులచేను ఖ 1 – సుఖ దేవరలు లక్ష్మిదేవికి త్రికాలముం పూజ ధూప దీప నివేద్యాలు నడుపుమని నారజియకొడుకు అంసజియకు ఇచ్చిరి–."

శక సంవత్సరము 1208 లో ఇమ్మడి బొల్లయరెడ్డి ఆయురారోగ్యాభివృద్ధిని గోరి వేయించిన శాసనమున 'అమరావతి యిమ్మడిదేవరకు గుడి వెనుక పాతికభూమి నిచ్చెను. పెద్దబొల్లిశెట్టి కొడుకు మాదిశెట్టి ఈ పురమును వాకిలి చవికెను చేయించెను ఇమ్మడిజెట్టి బొల్లయరెడ్డివారికి రాజ్యాభివృద్ధిగాను యిమ్మడిదేవరకు పుణ్యముగాను ఇచ్చిన పతిచూరుగుండాల కాలువ నీరునేలపాతిక. ఆ దిక్కుననే వెలివాలము అయిదుంబావు బొల్లయరడ్డి ఇమ్మడిదేవరకు పుణ్యముగాను కీర్తికుంటవెనుక మల్లినాథదేవుని చేద పడుమట అర్ధనేల ఇచ్చెను' అని కలదు.

శక సంవత్సరము 1212 లో వేయించిన శాసనమున 'బొల్లయరెడ్డికి పుణ్యముగాను, అగటు నాయుడు బొప్పెరిపోచె మైలారదేవరకు, సోగసిరి

---

7. Hyderabad Archaeological Series No. 19. Mn. 5.

8. ,, ,, Mn. 4 & Mn. 6.


కాలువ వృత్తిగా నిచ్చెను. కోమటి నరసింహశెట్టి పోచెంగారిచే ఈ కాలువ దేవర కిప్పించి పరచి చెల్లించెను. బొల్లయరెడ్డిగారు వీరి ఈవి తన ఈవిగా చెల్లించెను' అని యున్నది.

బొల్లయరెడ్డి సుమారు నలుబది సంవత్సరములు మహాసామంతపదవి నిర్వహించినట్లు శ. సం. 1173 నాటి ఇర్విన్, శ. సం. 1212 నాటి అమరాబాదు శాసనములబట్టి భావింపవచ్చును.


ఇర్విన్ శిలాశాసనము

మొదటిప్రక్క

1. స్వస్తి శ్రీ జయ
2. శ్చా భ్యుదయశ్చ
3. శక వర్షాలు.
4. 1173 అగు ప్రజా
5. పతి సంవత్సర పు
6. ష్య బహుళ 8 శని
7. వారమునాడు
8. మకర సంక్రమణ
9. కాలమందు స్వస్తి
10. శ్రీమన్మహామండ
11. లేశ్వర కాకతియ్యు
12. రుద్రదేవ మహా
13. రాజులు పృథ్వీ
14. రాజ్యము సేయు
15. చూ నుండా(డం)గాను
16. శ్రీమన్మహాసామ
17. ంత చిఱకుయన్మ బొ
18. ల్లయరడ్డివారి వి
19. య్యను.



రెండవ ప్రక్క



1. శ్రీమన్మహా సాహ
2. ంత వావిలాల రుద్ర
3. య రడ్డివారు తమ
4. అప్ప రుద్రసానిగార్కి
5. బుణ్యముగాను
6. ఇరువెంటి ఇంద్రే
7. శ్వరదేవర పాత్రభో
8. గానకు కంబలంవు
9. కాల్వను సుఖాడ్డ కాల్వ
10. ను అడ్డాను—మడ్లకా
11. ల్వను పాడికాను కా
12. ర్తీక వైశాఖాలు సూ
13. ర్యా చంద్రుల కల
14. ంత గాలమూ ప్రవి
15. త్తిగా నిచ్చిరి మంగ
16. ళ మహా శ్రీ శ్రీ శ్రీ.

భాష - వ్యాకరణం

శ్రీ కాశూరి హనుమంతరావు

నేను చదివిన ఒక తెనుగు నవలలో ఒకాయన భార్య అతని తమ్ముడితో లేచిపోయిన ఒక సన్నివేశం ఉంది. ఈ సన్నివేశాన్ని ఆధారంగా రచయిత ప్రేమ గురించిన సుదీర్ఘచర్చ చేశారు. ఈ నవల కొన్ని దశాబ్దుల క్రితం మన దేశంలో వెలువడిన ప్రేమ సాహిత్యంమీద తిరుగుబాటుగా వచ్చినటువంటిది. ప్రేమ మనిషిలో కలిగే అత్యుదాత్తమైన దివ్యానుభూతిఅనీ ఈ మొదలైన అనాటి ప్రేమ గురించిన ఉద్విగ్నభావాలని వ్యతిరేకిస్తూ రచింపబడిన ఈ నవలలో ప్రేమశబ్దవ్యుత్పత్తిని ప్రదర్శించి ప్రేమను గురించి చర్చించడం జరిగింది. ప్రేమ అన్న శబ్దం ప్రీఞ్ ధాతువునుండి పుట్టినది. ప్రీఞ్ తర్పణే, కాంతౌచ; ప్రీఞ్ ధాతువుకి సంతోషించు, తృప్తిపడు, ఇష్టపడు అని అర్థాలు, కనుక ప్రేమఅంటే సంతోషించుట, తృప్తిపడుట, ఇష్టపడుట అని మాత్రమే; ప్రేమ దివ్యానుభూతికాదు అని ప్రతిపాదించబడింది ఆ చర్చలో.

పాణినీయ వ్యాకరణంలో తద్ధితప్రకరణంలో వైయాకరణాగ్రేసరుడైన పాణినిమహాశయుడు రెండు గొప్పసూత్రాలను చెప్పాడు. వాటిలో ఒకటి 'తదశిష్యం సంజ్ఞాప్రమాణత్వాత్' అన్నది. కళింగులు నివసించే ప్రదేశం అన్న అర్థంలో 'కళింగాః' అన్న శబ్దం మీద విధింపబడిన చాతురర్థికప్రత్యయం లోపించగా, ప్రకృతివత్ లింగవచనాలు ఉంటాయని కళింగులు నివసించే దేశంపేరు 'కళింగాః' అవుతుందంటూ తనకు పూర్వులైన వ్యాకర్తలు చెప్పిన 'లుపి యుక్తవద్ వ్యక్తివచనే' అన్న సూత్రాన్ని పాణిని 'తదశిష్యం సంజ్ఞాప్రమాణత్వాత్' అన్న సూత్రంచేత ప్రత్యాఖ్యానం చేశాడు. కళింగాః, వంగాః, మొదలైనవి సంజ్ఞాపదాలు. ఇటువంటి పదాలకు లింగ వచనాలు ప్రజల వ్యవహారాన్నీ సాహిత్యప్రయోగాలనూ బట్టి తెలుస్తాయి. వాటిని వ్యాకరణసూత్రాల ద్వారా విధించ నవసరంలేదుఅని ఆ సూత్రార్థం. ఆపః, దారాః, సికతాః, వర్షాః మొదలైన పదాలు కూడా ఇటువంటివే

కళింగులు నివసించే ప్రదేశం అన్న అర్థంలో కళింగులతో యోగంవల్లనే 'కళింగాః' అన్న పదం నిష్పన్నమయినప్పటికీ, తర్వాత ఆ పేరు ఆ ప్రదేశానికి జనవ్యవహారంచేత రూఢమైపోతుంది. అందుచేత తర్వాత ఆ కళింగులు ఆ ప్రదేశంనుండి వెళ్లిపోయినా, ప్రదేశంపేరు కళింగాః అనే నిలిచిపోతుంది ఇటువంటి పదాలకు అర్థనిర్ణయంలో ప్రజావ్యవహారమే ప్రమాణమంటూ; పూర్వ వైయాకరణులు ప్రకృత్యర్థం ప్రధానమా? లేక ప్రత్యయార్థం ప్రధానమా? అని చర్చించి ప్రత్యయార్థమే ప్రధానమంటూ చేసిన నిర్ణయాన్ని కూడా పాణిని 'ప్రధాన ప్రత్యయార్థ వచన మర్థ స్యాన్య ప్రమాణత్వాత్' అన్న సూత్రంతో త్రోసిపుచ్చాడు.

'పాచకః' అన్న శబ్దం పచ్ ధాతువుకు కర్తరి ణ్వుల్ ప్రత్యయం చేయగా సిద్ధించుతుంది. పచ్ ధాతువుచేత 'పాక' అన్న ప్రతీతిమాత్రమే కలుగుతుంది కర్తరివిహితమైన ణ్వుల్ ప్రత్యయం చేత కర్తృప్రతీతి కలుగుతోంది. పాకానికీ, కర్తకీ అధికారాధికారిరూపసంబంధం ఉంది. పాచకః అన్న శబ్దంచేత పాకాధికారవంతుడైన కర్త అని తెలుస్తున్నది. ఇక్కడ విశేష్యతచే అవస్థితమైన 'కర్త' అన్నది ప్రత్యయం (ణ్వుల్)యొక్క అర్థం 'కర్త'కి విశేషణతచే అవసితమై ఉన్న పాకము

ప్రకృతి (పచ్ ధాతువు) అర్థం. కనుక ప్రత్యయార్థం ప్రధానం, ప్రకృత్యర్థం అప్రధానం. ఇది పూర్వవైయాకరణులమతం. కాని సర్వపదాలకూ అర్థాలు వ్యాకరణశాస్త్రం ప్రకారం ప్రకృతి ప్రత్యయ విభాగంచేసి నిర్ణయించతగదు. లోకవ్యవహారంవల్ల కూడా అర్థప్రతీతి కలుగుతుంది. అనధీతశాస్త్రుడైన పామరుడు కూడా శబ్దంయొక్క అర్థాన్ని తెలుసుకొంటున్నాడు. కనుక పూర్వాచార్యులు చెప్పినది గ్రాహ్యంకాదు లోకంలో బాగా వాడుకలోఉన్న మాటలకి అర్థనిర్ణయం చెయ్యవలసివచ్చినప్పుడు ఆ మాటలను ఉపయోగించే లోకులవ్యవహారాన్ని ప్రమాణీకరించాలే తప్ప వ్యాకరణశాస్త్రం పుటలు తిరగవేసి ప్రయోజనంలేదు. ఇది పాణిని ప్రతిపాదించినది.

పదములు రూఢములు, యౌగికములు, యోగరూఢములు అని మూడు విధాలు. పుస్తకమ్, మండపమ్, గౌః, అలు మొదలైనవి రూఢములు. ఆయాఅర్థాలలో ఆయాపదాలు అనాదిగా ఉంటున్నాయి. ప్రకృతి ప్రత్యయ విభాగాపేక్ష లేకుండానే అర్థబోధను కలిగించేవి రూఢపదాలు. యౌగికములు వ్యాకరణశాస్త్రం ప్రకారం తత్తదర్థాలలో ప్రకృతి ప్రత్యయ సంయోగంచేత ఏర్పడినట్టివీ, ఆ అర్థాలలోనే నేటికీ నిలిచినట్టివీను. పాచకః, లేఖనమ్, ఆదితేయః మొదలైనవి. ప్రకృతి ప్రత్యయ సంయోగంచేతనే ఉద్భవించినా, తర్వాత ఆ అర్థాలనుంచి కొద్దిగానో, గొప్పగానో జరిగిపోయి అన్యార్థాలలో రూఢమైనట్టివి, అవయవార్థంకన్నా విశేషించి సముదాయార్థాన్ని బోధించేవి యోగరూఢములు. పంకజము, అబ్ధి, అపాయము, ప్రేమఅన్న శబ్దాలను ఈ తెగకు చెందినవిగా ఉదాహరించవచ్చును

అపాయముఅన్న మాటను వినగానే మనకి దాని అర్థం స్ఫురించిపోతుంది. Danger అన్న అర్థంలో ఇప్పుడు అందరం ఈ మాటని ఉపయోగిస్తున్నాం. వ్యాకరణశాస్త్రాన్నిబట్టిచూస్తే దీని అర్థం తొలగిపోవడంఅని వస్తుంది. అప ఉపసర్గ పూర్వకమైన ఇణ్ ధాతువుకి భావార్థంలో అచ్ ప్రత్యయంపరంకాగా విశ్లేషముఅన్న అర్థంలో అపాయః అన్న శబ్దం ఏర్పడింది. ఈ అర్థంలోకూడా ఇప్పటికీ పదాన్ని నిరభ్యంతరంగా ఉపయోగించవచ్చును. ప్రమాదకరమైనదానినుండి మనం తొలగిపోతాం కనుక విశ్లేషముఅన్న యౌగికార్థంనుండి కొంచెం జరిగి ప్రస్తుతార్థంలోకూడా ఈ పదం రూఢమైంది.

ప్రీఞ్ ధాతువునుండి ప్రీణాతీతి ప్రియః అని కప్రత్యయంచేత ప్రియశబ్దం, ప్రియశబ్దంనుండి భావార్థంలో ఇమనిచ్ ప్రత్యయంవల్ల ప్రేమన్అనీ ఏర్పడుతాయి దీని యౌగికార్థం స్నేహము, తర్పణము, ఇష్టము అని. కాని ప్రేమ అన్నమాట ఈనాడు ఎంతో ప్రచారంలో ఉన్నట్టిది. Love అన్న అర్థంలో దీనిని నేడు అందరూ ప్రయోగిస్తున్నారు, అర్థం చేసుకొంటున్నారు. కనుక ప్రేమ అన్నమాటకి నేడు అర్థం చెప్పడానికి వ్యాకరణ సూత్రాలనుచూడనవసరంలేదు. జనవ్యవహారాన్నిబట్టే తెలుసుకోవలసిఉంటుంది. ఈ అర్థంలో ఈ మాట ఇటీవలమాత్రమే రూఢమయింది. ప్రాచీన సాహిత్యంలో ప్రేమ అంటే ఇష్టం, ప్రీతి అన్న అర్థాలే కనిపిస్తాయి నా ప్రియసఖియైన కౌసల్య క్షేమమా? అని ఉత్తరరామచరిత నాటకంలో జనకుడు ప్రశ్నిస్తాడు స్నేహితురాలు అని ఆనాటికి ఆ మాటకి అర్థం. నా ప్రియుడైన లక్ష్మణుడు కుశలమా? అన్ని రామాయణంలో సీత హనుమంతుడిని ప్రశ్నిస్తుంది. ఇష్టుడు అని అర్థం కాని ప్రియ, ప్రేమ శబ్దాలను ఇప్పుడు ఈ అర్థాలలో ఉపయోగించకూడదు. సాహిత్యంలో మాటలను ఆనాటి జనవ్యవహృతినిబట్టి ఉపయోగించవలసిఉంటుంది.

పాణిని కాలంనాటికే ఎన్నో రూఢపదాలు ఉన్నట్లు పై సూత్రాలవల్ల స్పష్టమవుతుంది. భాష అనాది. దాని పుట్టుక దురూహ్యం. పాణినికి ఇంకా వెనక్కు వెనక్కు వేదకాలంనాటివరకూపోయి పరిశీలించినా, అప్పటికీ భాషలో రూఢపదాలూ, వ్యుత్పన్న పదాలూ రెండూ ఉన్నట్లు కనిపిస్తుంది. అయినా సంస్కృతభాషలో చాలావరకూ పదాలు యౌగికాల్యూ యోగరూఢాలూ కనిపిస్తాయి. రూఢపదాలు తక్కువ.

చాలాకాలంనుంచీ సంస్కృత వ్యాకర్తలు రూఢపదాలని కూడా ఏవో ధాతువులను మెలిపెట్టి నిష్పన్నం చెయ్యడం దీనికి ఒక కారణం కావచ్చును. అయినా మొత్తంమీద సంస్కృతభాషలో రూఢపదాలసంఖ్య యౌగిక, యోగరూఢపదాల సంఖ్యకన్నా బహు స్వల్పతరమని చెప్పకతప్పదు సంస్కృతం చాలా గొప్ప భాష కావడమే దీనికి హేతువు.

భాష మొదట్లో కొన్ని రూఢపదాలతో ఆరంభిస్తుంది. కాని మానవుని బుద్ధి వికసించి, విజ్ఞానం పెరిగినకొద్దీ అతని భావవ్యక్తీకరణ కా రూఢపదాలు చాలక క్రొత్తమాటలను కల్పించుకొంటాడు. ఇటీవల విజ్ఞాన శాస్త్రజ్ఞులు ఎన్నో పారిభాషిక పదాలను సృష్టించుకొన్నారు. ఉదాహరణకి Sodium sulphite, Sodium bisulphite, Sodium metabisulphite, Sodium bisulphate, Sodium thiosulphate, Sodium sulphate - ఇలా అర్థవంతమైన మాటలు వెన్నో శాస్త్రజ్ఞులు కల్పించారు. ఈ మాటల వెనుక ఒక సౌష్ఠవం, అభిప్రాయం, విజ్ఞానం ఉన్నాయి. అలాగే ప్రాచీన కాలంలో తమ కళలకూ, శాస్త్రాలకూ ఆవశ్యకములైన పదాలను ప్రాచీనవిజ్ఞానులు కల్పించుకొనిఉంటారు. భాషాసాహితీవేత్తలైన విజ్ఞానులు కల్పించిన పదములగుటచేత ఇవి నిర్మాణసౌష్ఠవం కలిగి ఉపసర్గ ప్రకృతి ప్రత్యయ విభాగయోగ్యములుగా ఉంటున్నాయి. కనుకనే సంస్కృతభాష యావత్తూ ధాతుజన్యమన్న భ్రాంతిని కలిగించడం, శాకటాయనుడన్నవ్యాకర్త భాషఅంతా ధాతుజాతమని అనడం జరిగింది.

తెలుగుభాషలో ఈ గుణం ఇంత పెల్లుగా లేదు. తెనుగుతో సంస్కృతం కలిసిపోవడం దీనికి ఒక కారణం కావచ్చును. సువిశాలమైన సంస్కృత భాష తెలుగుతో కలిసిపోయి, ఏ అర్థం కావలసినా ఆ అర్థాన్ని ఇచ్చే సంస్కృతపదం చేతికి దొరికి పోవడంవల్ల తెలుగుకు తనంత తను పెరగవలసిన ఆవశ్యకత లేకపోయి ఉండవచ్చును, లాటరీలో రెండు లక్షలు బహుమానం వచ్చినవాడు జీవితంలో ఇంక ధనార్జనకు అంతగా తిప్పలుపడనవసరం లేకపోయినట్లు. ఇంతేకాక, తర్కవేదాంతజ్యోతిషాదిశాస్త్ర గ్రంథరచన సంస్కృతంలోనేతప్ప తెనుగులో జరగక పోవడంవలన కూడా ఆ పారిభాషికపదా లెన్నో తెనుగులో వ్యుత్పన్నం కాలేదు.

కనుక తెనుగుపదాలకి సంస్కృతపదాలవలె ప్రకృతి ప్రత్యయవిభాగం చెయ్యడం కష్టం. వండు ధాతువునుంచి వండుట, వంట; మండు నుంచి మండుట, మంట ఈ విధంగా కొంత ధాతుజన్య భాష కనిపించినా సంస్కృతపదా లంతగా విశాలమైన, బహుళమైన వ్యుత్పత్తి కనిపించదు. ఉదాహరణకు 'నేల' అన్నమాటని 'నిలు' ధాతువునుంచి ఘఞ్ వంటి ప్రత్యయాన్ని ఆధారార్థంలో విధించి నిష్పన్నం చేశామనుకొందాం. కాని ఈ ప్రక్రియ ఒక్క ఈ మాటకే పరిమితమై ఉండిపోతోంది. ఎగురు, ఉండు, కూర్చొను, పండుకొను మొదలైన ధాతువులనుండి ఆయాక్రియల కాధారములైన నేల వంటిమాట లేవీ కనిపించడంలేదు. పచ్, దహ్ ధాతువులనుండి సంస్కృతంలో నిష్పన్నములైనన్ని పదాలు వండు, మండు ధాతువులనుండి తెనుగులో నిష్పన్నం కాలేదు. సమగ్రమైన సంస్కృతభాషలో ధాతువులనుంచి ఉత్పన్నములైనన్ని పదములు తెనుగులో ధాతువులనుంచి ఉత్పన్నం కాలేదు.

ఇది యౌగికపదాల సంగతి. ఇక రూఢపదాలు ఎట్లా పుట్టాయి అని ప్రశ్నిస్తే ఆ ప్రశ్నకు జవాబులేదు. భాష ఎలాగ పుట్టింది అని ప్రశ్నించడమన్నమాట. భాషోత్పత్తిని గురించిన సిద్ధాంతాలలో ముమ్మొదటిది ధ్వన్యనుకరణసిద్ధాంతం. బెకబెకమంటుంది కనుక భేకః, ఘూ అంటుంది కనుక ఘూకః, కా అనేది కాకః; ఇలాగ భాష పుట్టి తర్వాత అభివృద్ధి చెందిఉంటుందన్నది మొదటి ఊహ. కాని దీనివల్ల అన్నిభాషలలోనూ ఈ పదాలు ఒకేవిధంగా ఉండవలసిఉంది. అట్లా లేవు. భౌ అని అరిచే జంతువుని తెనుగులో కుక్క అనీ, కన్నడంలో నాయిఅనీ, ఇంగ్లీషులో Dog అనీ వివిధంగా అంటున్నారు. ఇట్లా భాష పుట్టుకను

వివిధంగా ఊహించి ఒక సిద్ధాంతాన్ని చెప్పలేక భాషా శాస్త్రజ్ఞులు (Linguists) చివరకి భాష సంకేతితం అని అభిప్రాయపడ్డారు.

మన ప్రాచీనతార్కికులు కూడా శక్తంపదమ్ అనే అన్నారు. ఫలానిమాటకి ఫలానిఅర్థం ఉండాలని ఈశ్వరేచ్ఛ లేదా బహుజనులసామూహికేచ్ఛ అని తార్కికులమతం. కాని ఇక్కడ సందేహం కలుగుతుంది. పదిమంది మనుష్యులు చేరి ఒక వస్తువుకి ఒక పేరు పెట్టినప్పుడు ఆ పేరే దానికి పెట్టడానికి ఏదో నిమిత్తం ఉండకుండా ఉండదుకదా! ఆ వస్తువుకి వారు పెట్టే పేరుకీ, ఆ వస్తువు ఉత్పన్నమైన కారణాలకీ, లేదా ఆ వస్తువు లక్షణాలకీ ఏదో సంబంధం, కనీసం బాదరాయణసంబంధమైనా ఉండేఉంటుంది. ఉదాహరణకి కోడలు=కొడుకు+ఆలు అని, చేగోడి=చేయితోచేసే గోళాకారపు భక్ష్యవిశేషమని నైఘంటికుల ఊహ. అయితే ఇలా అన్నిమాటలకీ వ్యుత్పత్తులు ఊహించడం దుస్సాధ్యం కొంకు, కీచి ఈ మాట లెట్లా వచ్చాయి? అంటే మనకి తెలియకపోవచ్చును. కాని మనకి దురూహ్యమైపోయిన మాత్రాన ఈ మాటలు నిర్నిమిత్తంగా పుట్టాయనుకొనడం, భాష సంకేతిత మనడం మానవుని హేతువాదాన్నీ, బుద్ధినీ హీనపరచడ మవుతుంది. పదిమందిచేరి 'కొంకు' అనే ఎందుకు పేరుపెట్టారు? అంతకన్నా సులభంగా కక అని, లేదా కిక అని ఎందుకు పేరుపెట్టి ఉండరు? కొంకు అని ఇంత వక్రంగా మాటని సృష్టించడానికి ఏదో కారణం ఉండకుండా ఉంటుందా? కనుక రూఢపదాలు కూడా ఏవో నిమిత్తాల నాధారం చేసుకొనే పుట్టిఉంటాయి. ఆ నిమిత్తాలని ఇప్పుడు మనం తెలుసుకోగలగడం మాత్రం చాలాకష్టం. తెలుగు మాటల విషయంలో ఇంకొక చిక్కుకూడా ఉంది. ఇవి నిజంగా దేశ్యపదాలో లేక సంస్కృతపదములకు తద్భవములో చెప్పడం కష్టం. మంట, గోడ, చేట, చోటు, ఓడ మొదలైన అతిపరిచితములైన తెనుగుమాటలు కూడా సంస్కృతపదజన్యములని కొందరు చెబుతారు.

భాష పెరిగినపిమ్మట వ్యాకరణం వస్తుంది. వ్యాకర్తలు పదాలను ప్రకృతి ప్రత్యయ విభాగంచేసి విశ్లేషించి చూపుతారు కాని ఈ ప్రక్రియ అంతా ఒక మిథ్య. వ్యాకరణ తత్వాన్నిగురించి వాక్యపదీయకర్త ఇలా అన్నాడు—

'ఉపాయాః శిక్ష్యమాణానాం
బాలానా ముపలాలనాః
అసత్యే వర్త్మని స్థిత్వా
తతస్సత్యం సమీహతే.'

చదువుకొనే బాలురను విద్యాభ్యాసోన్ముఖులనుచేసే లాలనోపాయాలు వ్యాకరణం. పిల్లలను బుజ్జగించి బెల్లంముక్కో, చాకలేటో ఇచ్చి బడికి పంపడం వంటిది. అసత్యమార్గంలో నిల్చొని అచ్చటినుండి సత్యాన్ని సమీక్షిస్తున్నాడు అని.

పాణిని అష్టాధ్యాయిలో లౌకిక వైదికపదాలను వ్యాకరించాడు వైదికపదముల అర్థస్వరూపాదులు వేదములనుండి, లౌకికపదముల అర్థస్వరూపాదులు లోకవ్యవహారాన్నిబట్టి తెలుస్తూనేఉండగా, ఇక వ్యాకరణం వ్రాయవలసిన ఆవశ్యకత ఏమి? అని ప్రశ్నించుకొని పతంజలి మహాభాష్యంలో ఇలా అన్నాడు.

కుమ్మరివానివద్దకు వెళ్లి నాకు కుండలుచేసి ఇయ్యి అని అడిగినట్లు వైయాకరణునివద్దకు వెళ్లి ఎవరూ మాటలు చేసిఇమ్మని అడగలేరు. జనవ్యవహారంలోనూ, సాహిత్యంలోనూ, వేదాలలోనూ ఉన్నమాటలనే వ్యాకరించడం. అయినా, 'సిద్ధే శబ్దార్థ సంబంధే శాస్త్రేణ ధర్మనియమః'. లోకంలో శబ్దములు, అపశబ్దములు రెండూ ఉన్నాయి. సుశబ్దములకన్నా అపశబ్దములే కొల్లలుగా ఉంటున్నాయి. వ్యాకరణం శబ్దములను అపశబ్దములనుండి వేరుచేసి, జనులు అపశబ్దములను పరిహరించి సుశబ్దములను ఉపయోగించునట్లు ధర్మనియమం చేస్తుంది. జల్లెడ పిండి నుండి పొట్టును జల్లించివేసేటట్లు వ్యాకరణం అపశబ్దాలను తొలగించివేస్తుంది. వ్యాకరణ జ్ఞానం లేనివాడు శబ్దస్వరూపాన్ని తెలియజాలడు. సువస్త్రధారిణియై కామయమాన అయిన జాయ భర్తకు

స్వాత్మను ప్రకటించినట్లు వ్యాకరణవేత్తకు భాష తన స్వరూపాన్ని ప్రదర్శిస్తుంది. రక్షోహాగమలఘ్వ సందేహాలు వ్యాకరణ ప్రయోజనాలు. కొన్ని పదముల స్వరూపములని చెప్పడంద్వారా తక్కినవి ఊహింప జేయడం, అనంతమైన శబ్దరాశిని లఘూపాయం చేత తెలిసికొనడం మొదలైనవి వ్యాకరణ ప్రయోజనాలు — అని.

కాలగతిచే మారుతూ ప్రవాహంవలె పురోగమిస్తున్న భాషకు వివిధకాలాలలో వివిధవ్యాకరణాలు వెలువడుతాయి. ప్రతివ్యాకరణం ఆకాలంలో ప్రచారంలోఉన్న భాష స్వరూపాన్ని వివరిస్తుంది. ఇట్లా వ్యాకరణం భాషను వివరించి తెలియజెప్పడానికి ఎప్పటి కప్పుడు ప్రయత్నిస్తూ, క్రొత్తరూపాలను కలుపుకొంటూ భర్తను భార్యవలె భాషను అనుసరిస్తూ ఉంటుంది. వ్యాకరణం భాషను శాసించ లేదుకాని చక్క బరుస్తుంది. భాష చీకుగా చిట్టడవివలె పెరిగి ముళ్లతోనూ, పాములతోనూ నిండి దుర్గమమైపోకుండా పార్కువలె తీర్చిదిద్ది సుగమం చేస్తుంది వ్యాకరణం. భాషను దైనికవ్యవహారానికి మాత్రమే కాక రచనావ్యాసంగానికి ఉపయోగించేవారికి చాలినంత లక్ష్యలక్షణజ్ఞానం ఆవశ్యకం. లేకపోతే భాషను సక్రమంగా అభివృద్ధిపరచడానికి మారుగా వారు కలగాపులగం చేసివేసే ప్రమాదం ఉన్నది.

ఉదాహరణకి నేటి తెనుగు భాషలో శబ్ద స్వరూపాన్నీ భాషాలక్షణాన్నీ సరిగా గమనించక విశృంఖలంగా ప్రయోగించే ధోరణి కొంత కనిపిస్తున్నది. శుద్ధతప్పు, ప్రాణగొడ్డము మొదలైన ప్రసిద్ధవైరి సమాసాల ననుకరించి శాశ్వత విలువలు, రక్తకన్నీరు ఇట్లా ఎన్నో నేడు ప్రయుక్తములవుతున్నాయి. అంతటితో ఆగక అఖిలభారత చేనేత సహకారసంఘము, ఆంధ్ర రాష్ట్ర గీత పరివారల సంఘము, ఆంధ్ర రాష్ట్ర పాల ఉత్పత్తిదారుల సంఘము ఇత్యాది మిశ్ర సమాసాలు శాస్త్రాద్ రూఢిర్బలీయసీ అన్నట్లు భాషలో స్థిరపడుతున్నాయి. శాస్త్రాద్ రూఢిర్బలీయసీ అన్న వైయాకరణోక్తి ఇష్టంతో అన్నదికాదు, గత్యంతరంలేక కష్టంతో అన్నది. పదుగురాడుమాట పాటియై ధరజెల్లు అన్నట్లు ఓట్లబలంతో అవాంఛనీయమైన తీర్మానం నెగ్గినట్లు ఇటువంటివి భాషలో చోటుని ఆక్రమించుకొంటూ ఉంటాయి. ఇట్లా కొన్నాళ్లయాక పాల+ఉత్పత్తి; శాశ్వత విలువ+అధికత, ఇక్షరము; రక్తకన్నీరు+ఉదధి, ఓఘము అన్నచోట్లలో కొందరు రచయితలు సంస్కృతాచ్ సంధిని, కొందరు తెనుగు అచ్సంధిని చెయ్యవచ్చును. అప్పుడు అచ్సంధికి ఒకవ్యవస్థ లేకపోయి ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు వ్రాసుకొనగా ఒకదశ వచ్చేసరికి అయోమయస్థితి రావచ్చును.

భాషలో ప్రజావ్యవహారంలోని మాటలను వ్యాకరణ విరుద్ధములైనా గ్రహించి ఎట్లో గతి కల్పించడం పరిపాటే. ప్రజలు ఉపయోగించే మాటలను శిరసావహించడానికి వ్యాకరణం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. శుద్ధతప్పు, ప్రాణగొడ్డము మొదలైనవి ఎన్నాళ్లో ప్రజల వ్యవహారంలో ఉండి సాహిత్యంలో ప్రవేశించాయి. కాని శాశ్వత విలువలు, ఆంధ్రరాష్ట్ర పాల ఉత్పత్తి మొదలైనవి ఏనాడూ ఆంధ్ర ప్రజల వ్యవహారంలో ఉన్నట్టివికావు.

భాషలో ఒక విశ్లేషణమైన ప్రయోగంచేసే రచయిత చాలా సమర్థుడై ఉండాలి 'తం పాత్రయాం ప్రథమమాస పపాత పశ్చాత్' అనీ, 'త్రియంబకం సంయమినం దదర్శ' అనీ కాళిదాసు పాణినీయాన్ని బట్టికాక వైదికవ్యాకరణాన్నిబట్టి ప్రయోగించాడు. మురారి సమాసాంతవిధి అనిత్యమన్న మహాభాష్య వచనాన్నిబట్టి 'ధృతధనుషి' అని ప్రయోగించాడు. మంచిలక్ష్యలక్షణజ్ఞానంకల కవి పొరపాటుచేసినా దానిలో ప్రమాదం ఏమీ ఉండదు. 'ఆమోదగ్రహ యాళువుల్ పొలసె దక్షారామ మధ్యంబునన్' అన్న శ్రీనాథుని రచనలో '[1]గ్రహయాళువు' అన్న ప్రయోగం, 'ఉదయగ్రావము పానవట్టమభిషేకోద ప్రవాహంబు వార్ధి'అన్న ధూర్జటి రచనలో '[2]ఉద

1. గృహయాళువు.
2. ఉదక ప్రవాహము.

ప్రవాహము'అన్న ప్రయోగం ఖచ్చితంగా చూస్తే వ్యాకరణ విరుద్ధాలు. అయినా ఇవి ఏమంత గణనీయ దోషాలు కావు. ఇవి భాషాలక్షణాన్ని పాడుచెయ్యడం లేదు శ్రీ శ్రీగారి

'చూర్ణమాన
ఘూర్ణమాన
దీర్ణమాన గిరిశిఖరాల్.'

అన్న వాక్యంలో '3చూర్ణమాన' అన్న అలాక్షణిక ప్రయోగాన్ని సహించుకోవడమే కష్టంగా ఉండగా '4దీర్ణమాన'అన్న ప్రయోగం భాషా స్వభావానికే ముప్పుతెస్తూ దుస్సాహసమవుతున్నది. ఇటువంటి ప్రయోగాలున్న రచన 'మణినాభూషితః సర్పః కిమసౌ న భయంకరః?' అన్నట్లు వర్జింపబడడం భాషకి మంచిది.

వ్యాకరణం సదా భాషను సంస్కరించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. ప్రజలు ఉచ్చారణ సౌలభ్యాన్ని చూస్తారేతప్ప భాషాతత్వాన్నీ, సంప్రదాయాన్నీ చూడరు. వీరభద్రరావు, జాగ్రత్త మొదలైన మాటలని ప్రజలు వీరభద్దర్రావు, జాగర్త అని ఉచ్చరించి వేస్తారు. కాని భాష తెలిసినవారు, మాట్లాడేటప్పు డెలా మాట్లాడినా, వ్రాసేటప్పుడు సరిగా వ్రాస్తూ ఉంటారు. మాట్లాడినట్లే వ్రాయడమైతే జాగర్త అనీ, జాగత్త, జాత్త అనీ ఇలా ఆ పదం అనేక రూపాలు దాల్చి క్షీణిస్తుంది. 'ఏం చేస్తున్నావేంటి ?' అన్న వాక్యాన్ని కొందరు శిష్టులు కూడా 'ఏం చేత్తున్నవేంటి ?' అని ఉచ్చరిస్తూ ఉండడం చూస్తున్నాము కాని వ్రాతలో మాత్రం 'చేస్తున్నావు' అనే వ్యావహారిక భాషారచయిత లందరూ వ్రాస్తున్నారు.

కనుక ఉచ్చారణకీ వ్రాతకీ కొంత అంతరం ఉండక తప్పదు. గ్రాంథిక భాషావాదాన్ని ఖండిస్తూ గిడుగు రామమూర్తిగారు ప్రాచీనకవులలో బాల వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలని చూపించినట్లే వ్యావహారిక భాషా విరుద్ధ ప్రయోగాల నెన్నిటినో గురజాడవారి కవితలలోనూ ఇతర ప్రజాకవుల కవితల లోనూ చూపించ వచ్చును స్థాలీ పులాక న్యాయంగా రెండు ఉదాహరణలు ఇస్తున్నాను.

"మతము లన్నియు మాసిపోవును
జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును;
అంత స్వర్గ సుఖంబు లన్నవి
యవని విలసిల్లున్." (గురజాడ)

"మానవ కోటి సామ్రాజ్య దూతలు, కళా
యజ్ఞాశ్వముల్ గాలులై, తరగలై, తావులై,
పుష్పాళ్లు, కుంకుమల్, పొగలై సాగిరి !"
(శ్రీ శ్రీ)

తీవ్ర వ్యావహారిక భాషావాది అయిన గురజాడ వారి ముత్యాలసరాల్లో భాష చాలావరకూ గ్రాంథిక భాష.

ఒకొక్కచోట గ్రాంథికభాషలో ఉండే ఇంపు వ్యావహారికభాషలో లేకపోవడం కూడా కనిపిస్తుంది. ఉదాహరణకి 'పిలిచిన బిగువటరా' అన్న పాట చరణాన్ని వ్యావహారిక భాషలోకి మారుస్తే 'పిలుస్తే బిగువట్రా' అని కటువుగా అవుతుంది కనుక వ్యవహారంలో ఉన్నట్లే వ్రాయడం అన్నివేళ్లా శక్యంకాదు రచనాభాష. వాడుకభాషకన్నా ఎప్పుడూ హెచ్చుస్థాయిలో, కొన్నికట్టుబాట్లకి లొంగుతూ, ఒక వ్యవస్థని కలిగిఉండకతప్పదు. భాషను తెలిసిన రచయితలు దాని పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి సాధ్యమైనంతవరకూ ప్రయత్నిస్తూ ఉంటారు. సామాన్యజనులు ఉచ్చారణ సౌలభ్యాన్నిమాత్రం చూసు


---

3. చూర్ణధాతువు చౌరాదిం. చూర్ణయమాన అవుతుంది. కాని అర్థం కుదరదు. చూర్ణ్యమానలంటే అర్థం కుదురుతుంది. ఎలా చూసినా చూర్ణమాన అన్న శబ్దం సిద్ధించదు.

4. దీర్ణ ధాతువుకాదు, కనుక దీర్ణమానఅన్న రూపం ఉండదు.

కొని భాష స్థాయిని క్రిందికి లాగుతూఉంటారు. భాషావేత్తలు ఎంత వద్దనుకున్నా కొన్నిచోట్ల ప్రజల మెజారిటీకి లొంగక తప్పదు. లేఖనభాష ప్రజలకు ఒక ఒరవడి. సాధ్యమైనంతవరకూ ఆ విధంగా తమ ఉచ్చారణని సరిదిద్దుకొనడం, భాషాలక్షణాన్ని తెలిసికొనడం ప్రజల కర్తవ్యం. కొన్నిచోట్ల ప్రజల బలం చాలా ఎక్కువైపోయినప్పుడు వాళ్ళ ఉచ్చారణనుబట్టి లేఖనభాషకూడా మారక తప్పదు ప్రజావ్యవహారానికి బొత్తిగా విరుద్ధంగా ఉండడంచేత తెనుగు గ్రాంథికభాష వ్యావహారికభాషచేత ఆక్రాంత మవుతున్నది. ఈ విధంగా భాషావేత్తలూ, ప్రజలూ పరస్పరం ఇచ్చిపుచ్చుకొంటూ భాషాపరిణామాన్ని కొనసాగిస్తూ ఉంటారు.

భాషాశ్వానికి వ్యాకరణం కళ్ళెం వంటిది. కళ్ళెం మరీ బిగువుగాఉంటే గుర్రం కదలలేదు. అసలు కళ్ళెమే లేకపోతే గుర్రం తన ఇష్టం వచ్చినట్లు దౌడుతీసి బండిని విసరివేయవచ్చును. సమ్యక్ప్రగ్రహనియతికల భాషాశ్వం చక్కగా పురోగమించజాలుతుంది. వ్యాకరణనియతిలేనిభాష పెరుగుదల కేన్సరు పెరుగుదలవంటిది. పురుషునికి జాయవలె భాషకి వ్యాకరణం అవశ్యకం. భర్త భార్యను ఒకప్పుడు ప్రేమిస్తూ, ఒకప్పుడు గౌరవిస్తూ, ఒకప్పుడు ఆమె ఆజ్ఞలను తలదాల్చుతూ, ఒకప్పుడు ఆమెను ఆజ్ఞాపించేటట్లు భాష చాలావరకూ వ్యాకరణానికి లొంగుతూ, ఒకొక్కప్పుడు ఉల్లంఘిస్తూ పయనించి ముందుకుసాగుతూ ఉంటుంది.



నిరంతర శ్రుతి

శ్రీ కె. శివారెడ్డి

వేదనా స్థగిత జీవితం
రత్నఖచిత సింహాసనం
రేపు పూవుకు పొంగటంకాని
నేడు మొట్టినపుడు క్రుంగటంగాని
ఉండదు.

వజ్రపుటుంగరం
వరిపరక ఒకటే.
వెన్నెల్లో సముద్రం అలలకి
వేసవిలో చండాంశు ఉగ్రతకి
ఒక్కటిగానే హసిస్తుంది
ఒకమాదిరిగానే చలిస్తుంది.

‘బ్రతుకు రాతి ఆము’లో
కాలిన తర్వాత మనసు
ఖేదానికి, మోదానికి
భేదం అంతగా పాటించదు.

వ్యథ, మథనతో పరిపక్వం
చేయబడ్డ బ్రతుకు నోట్లోంచి
వచ్చే ప్రతిమాట ఆణిముత్యం,
మరిగి, ఆవిరయ్యే నీటిలో
ఎంతశక్తి పుడుతుంది—మరి !

కాలంచెట్టు
ఆకులను విడిచివేయటం

చిగురుచొక్కాలను తొడుక్కోవటం
దాని కొక మామూలుపని.

కాని
పంచభూతాల్లోంచి
దాని వేళ్ళలోంచి
కాండం దేహంలోకి
ఎప్పుడూ ప్రవహించే ప్రాణం —
ఏదన్నా ఒక అనంత
అదృశ్యశక్తి ఉందనుకుంటే—

అది నిర్విరామంగా
ఆద్యంత రహితంగా
చేస్తున్న రాగాలాపన.
(అది ఈ జీవితం)



మధ్య ద్రావిడభాషలు

డా. పి. ఎస్. సుబ్రహ్మణ్యం

ఇప్పటివరకూ తెలిసిన ఆటవిక భాషలతో సహా ద్రావిడభాషలు మొత్తం ఇరవై ఒక్కటి ఉన్నాయి అవి 1. తమిళం, 2. మలయాళం, 3. కోత, 4. తొద, 5. కొడగు, 6. కన్నడం (మాండలికం : బడగ), 7. తుళు, 8. తెలుగు, 9. గోండీ (మాండలికం : కోయ), 10. కొండ, 11. పెంగొ, 12. మండ, 13. కూయి, 14. కువి, 15. కోలామీ (మాండలికం : నాయక్డీ), 16. నాయకీ, 17. పర్జీ, 18. గదబ (ఒల్లారీ, సాలూరు మాండలికాలు), 19. కూడుఖ్, 20. మాల్తో, 21. బ్రాహుయీ. ఈ భాషలన్నిటినీ మూడు ఉపభాషాకుటుంబాలుగా విభజించవచ్చు. తమిళం నించి తుళు దాకా ఉన్నవి దక్షిణ ద్రావిడ భాషలనీ, తెలుగునించి గదబ దాకా ఉన్నవి మధ్య ద్రావిడభాషలనీ, కూడుఖ్, మాల్తో, బ్రాహుయీలని ఉత్తరద్రావిడభాషలనీ వ్యవహరిస్తారు. తెలుగు మధ్యద్రావిడఉపకుటుంబానికి చెందినది కాబట్టి ఈ మధ్యద్రావిడభాషల ప్రత్యేకతలు ఈ వ్యాసంలో చర్చిద్దాం.

I. మధ్య ద్రావిడభాషలలో నూతన పరిణామాలు

1. తెలుగు తప్ప మిగిలిన మధ్య ద్రావిడ భాషలన్నిటిలో లింగభేదం విశిష్టమైనది. ఈ భాషల్లో పురుషవాచక శబ్దాలన్నీ ఒకలింగంగానూ, పురుషేతరవాచక శబ్దాలన్నీ (స్త్రీలతోసహా) ఇంకొక లింగంగానూ పరిగణించ బడతాయి, ఉదాహరణకి గోండీలో వోర్ అంటే 'వాడు', వూర్ అంటే 'వాళ్ళు' (పురుషులుమాత్రం కాని స్త్రీపురుషులు కాని)', అద్ అంటే 'అది, ఆమె', అవ్ అంటే 'అవి, ఆ స్త్రీలు' (తెలుగులో అవి అంటే 'ఆ స్త్రీలు' అనే అర్థం రాదని గమనించాలి.) ఇక మిగిలిన ద్రావిడ భాషల్లో లింగభేదం ఎట్లా ఉంది అంటే—తొద, బ్రాహుయీలు రెండింటిలో లింగభేదమేలేదు తొద కాక మిగిలిన దక్షిణద్రావిడభాషల్లో ఏకవచనంలో పుంలింగం, స్త్రీలింగం, అమనుష్యలింగం, బహువచనంలో మనుష్యలింగం, అమనుష్యలింగం ఉన్నాయి. వీటిలో స్త్రీలింగవాచియైన ప్రత్యయం-ఆళ్. ఇది మొదట్లో 'స్త్రీ' అనే అర్థంగల ప్రత్యేక శబ్దమే. (త. ఇల్లాళ్, తె. ఇల్లాలు - వీటిలో చివర ఉన్నది ఈ శబ్దమే.) కాబట్టి దక్షిణద్రావిడభాషల్లో స్త్రీలింగం ఆళ్ అనే శబ్దాన్ని ప్రత్యయంగా ఉపయోగించడంవల్ల సృష్టించబడిందని ఊహించవచ్చు. ఇక కూడుఖ్, మాల్తోలలో పురుషైకవచనం, అపురుషైకవచనం, మనుష్య బహువచనం— ఈ విధమైన భేదం ఉంది. ఈ రెండు భాషల్లో అమనుష్యవాచకాల్లో ఏకవచన బహువచన భేదంలేదు. ఈ విషయం తప్పిస్తే, కూడుఖ్ మాల్తోలలో లింగభేదం తెలుగులో లింగభేదాన్ని పోలిఉంది. తెలుగు కాక మిగిలిన మధ్యద్రావిడభాషల్లోకూడా స్త్రీ పురుషుల సముదాయాన్ని ఉద్దేశించినపుడు పురుష బహువచన రూపమే వాడతారు. కాబట్టి మనుష్య బహువచన లింగం మూడు ఉపకుటుంబాలల్లోనూ ఉన్నట్లు తెలుతుంది. ఏదైనా ఒక అంశం రెండుకాని అంతకన్న ఎక్కువకాని ఉపకుటుంబాల్లోఉంటే అది మూల భాషకి చెందినదని నిర్ణయించడం తులనాత్మక పునర్నిర్మాణ పద్ధతిలో మూలసూత్రం. కాబట్టి మనుష్యబహువచనలింగం మూలద్రావిడభాషలో

ఉండేదని మనం నిశ్చయంగా చెప్పవచ్చు. ఇక ఏక వచనంలో మధ్యద్రావిడభాషలన్నిటిలోనూ, ఉత్తర ద్రావిడభాషలైన కూడుఖ్, మాల్తోలలోనూ లింగ భేదం (పురుష—పురుషేతరభేదం) సమానంగా ఉంది. కాబట్టి పై సూత్రాన్ని అనుసరించి ఏకవచనంలో పురుష—పురుషేతరభేదం మూలద్రావిడంలో ఉండేదని మనం నిర్ణయించాలి. దీనివలన తేలినది ఏమి టంటే మూలద్రావిడంలో ఏకవచనంలో పురుష—పురుషేతరభేదం, బహువచనంలో మనుష్య బహు వచనం మాత్రమే ఉండేవి. మూలద్రావిడంనించి దక్షిణద్రావిడభాషలు పరిణామం చెందేటప్పుడు ఏకవచనంలో స్త్రీలింగరూపాల్ని కొత్తగా సృష్టించు కున్నాయి. (తొదలో మాత్రం లింగభేదం తరవాత నశించింది) ఇక తెలుగుకాక మిగిలిన మధ్యద్రావిడ భాషలు పొందిన మార్పు ఏమిటంటే—వాటిలో ఏక వచనంలో పురుష పురుషేతర భేదం మూలద్రావిడ కాలంనించిఉండగా ఈ విభజనని అనుసరించి బహువచనంలో కూడా మనుష్యబహువచనంలోనించి స్త్రీలింగాన్ని తీసేసి అమనుష్యబహువచనంతో కలిపివేశాయి. అంటే ఏకవచనంలో మల్లే బహు వచనంలో కూడా పురుష—పురుషేతర భేదాన్ని ఏర్పరుచుకున్నాయి. ఇది తెలుగు తప్ప మిగిలిన మధ్య ద్రావిడ భాష లన్నిటినీ ఒక ఉపకుటుంబంగా ఏర్పరచడానికి ఉపయోగించే నూతన పరిణామం (Innovation).

2. మధ్యద్రావిడభాషలన్నిటిలోనూ చుట్టా లైన ఆడవాళ్లని సూచించే పదాలు చాలా వాటిల్లో ఒక విశిష్టత ఉంది. ఇటువంటిపదాల్లో చివర *-అళ్ అనే ప్రత్యయం నించి వచ్చిన రూపాలు ఉంటాయి. (దీనిలో ళకారం నాయక్డీలో అలాగే ఉండగా, అది గోండీలో ఈషత్స్పృష్ట ళ కారం గానూ, మిగిలినభాషల్లో ల కారంగానూ ధ్వని సూత్రానుసారంగా మారుతుంది తెలుగు మొదలైన కొన్ని భాషల్లో ఇందులో అ కారం అపదాద్యక్షరంలో ఉండడంవల్ల హ్రస్వంగా మారుతుంది.) ఈ ప్రత్యయం దక్షిణద్రావిడభాషల్లో ప్రథమపురుష సర్వనామాల్లోనూ, వాటికి సంబంధించిన సమాపక క్రియల్లోనూ ఉండే —అళ్/అళ్ అనే స్త్రీలింగ ప్రత్యయంతో సాజాత్యంగలదే. ఈ రెండూ అళ్ 'స్త్రీ' అనే శబ్దాన్నించి పుట్టినవే. ఈ కింద ఇచ్చిన ఉదాహరణలు చూడండి :

(1) తె. కోడలు; కో. కొరల్ 'తమ్ముడి భార్య'; నా. కొరళ్ 'కోడలు, పెళ్లికూతురు'; ప. కొఢొల్ 'పెళ్లికూతురు'; గ. కొఢల్ 'కోడలు, తమ్ముడిభార్య', గోం. కోర్యాడ్ 'కోడలు' (DED 1787). వీటిఅన్నిటికీ మూలరూపం *కోటాళ్. దీని అసలు అర్థం 'చిన్నపిల్ల' అని. కోద్—/ కొయ్—అనే ధాతువు 'చిన్న'అనే అర్థంలో తమిళం కుటంతై 'కుర్రవాడు'; కొటంతు 'లేత'; తెలుగు కొడుకు మొదలైన పదాల్లో ఉంది. మొదట్లో 'చిన్నపిల్ల'అనే అర్థం ఇచ్చే యీ పదం పైభాషల్లో కోడలు, పెళ్లికూతురు, తమ్ముడిభార్యఅనే అర్థాల్లో స్థిరపడింది అన్నమాట

(2) తె. చెల్లియలు, చెల్లెలు; ప చాలల్ 'అక్క, చెల్లెలు'; గ. సేలల్, చెల్లాల్ 'అక్క, చెల్లెలు'. గోం. షేలాఢ్ (కోయ ఏలాడ్) 'చెల్లెలు'. (DED 2288)—వీటి మూలరూపం * చేలాళ్.

(3) తె. మఱఁదలు; కో. మర్ందాళ్; గోం. మర్ండాఢ్; కూ. మ్రీగలి (DED 3899)— వీటి మూలరూపం * మఱందాళ్.

ఇటువంటి *—అళ్ ప్రత్యయంఉన్న పదాలు మధ్యద్రావిడభాషలలోనే తప్ప దక్షిణోత్తరద్రావిడ భాషల్లో మచ్చుకికూడా లేవు. వీటిలో ధాతువుమాత్రం మిగిలినభాషల్లోకూడా ఇతరప్రత్యయాలతో కూడి కనిపిస్తూ ఉంటుంది. కాబట్టి యీ పదాలు మధ్య ద్రావిడభాషల మూలభాష కాలంలో వీటిలో ధాతువుకి *—అళ్ అనేపదం చేర్చడంవల్ల పుట్టాయని మనం ఊహించవచ్చు. ఇది యీ భాష అన్నిటిలోనూ ఇంకొక నూతనపరిణామం.

3. మధ్యద్రావిడభాషలన్నింటిలోనూ అమనుష్య వాచకశబ్దాల్లో బహువచనప్రత్యయం నిత్య మైనది (Obligatory). అంటే బహువచనం ఉద్దేశించినప్పుడు వీటికి తప్పకుండా బహువచనప్రత్యయం చేర్చాలి. కాని దక్షిణద్రావిడభాషల్లోనూ ఉత్తర ద్రావిడభాషల్లోనూ అలా కాదు. వీటిలో బహువచనప్రత్యయం వైభాషికమైనది (Optional). అంటే తమిళం, మలయాళం, కోత, కన్నడం, కొడగు భాషల్లో అమనుష్యవాచక బహువచనప్రత్యయం — కళ్ —ఉన్నా దానిని సాధారణంగా వాడరు. ఇక ఉత్తర ద్రావిడభాషలకిపోతే, కూడుఖ్, మాల్తోలలో అమనుష్యవాచకశబ్దాలలో బహువచన ప్రత్యయం అనేదేలేదు. బ్రాహుయీలో క్/ఆక్ అనే బహువచన ప్రత్యయం ఉన్నా దీనిని ఉద్దేశించినది ఏకవచనమా బహువచనమా అని సందేహం వచ్చేచోట్ల తప్ప మిగిలినచోట్ల వాడరు. ఉదాహరణకి బ్రాహుయీలో దహ్ బందగ్/దహ్ బందగాక్ 'పదిమంది మనుష్యులు'; ఇరామార్/ఇరామాక్ 'ఇద్దరు కొడుకులు'— ఈ విధంగా బహువచనం చేర్చి, చేర్చకుండా కూడా వాడవచ్చు. కాబట్టి ఈ అమనుష్య బహువచన ప్రత్యయ వైభాషిక ప్రయోగం దక్షిణోత్తర ఉప కుటుంబాలు రెంటింటిలోనూ ఉన్నట్టు స్పష్టం. కాబట్టి మూలద్రావిడంలోకూడా ఈ ప్రత్యయం వైభాషికమైనదని మనం దీనివల్ల ఊహించవచ్చు. మధ్య ద్రావిడభాషలన్నీ ఈ ప్రత్యయాన్ని నిత్యం చేశాయి. దక్షిణ మధ్య ద్రావిడభాషల్లో ఈ భేదం ఈ కింద ఉదాహరణవల్ల స్పష్టమవుతుంది: తె. రెండుచెట్లు; గోం. రండ్ మరాక్; కో. రెండ్ మాకూల్ (వీటన్నిటిలో బహువచన ప్రత్యయం నిత్యం) — త. ఇరంటు మరం; క. ఎరడు మర; తు రడ్డు మరొ (వీటన్నిటిలో బహువచనప్రత్యయం లేదు). తమిళ, కన్నడాలలో మల్లే తెలుగులో 'రెండు చెట్టు' అని బహువచన ప్రత్యయ రహితంగా ప్రయోగిస్తే అది వ్యాకరణదోషం అవుతుంది. మధ్య ద్రావిడభాషలలో ఈ నూతనపరిణామం వాటి అన్నిటినీ ఒక ఉపకుటుంబంగా నిర్ణయించడానికి ఆధారమవుతుంది

4. మధ్యద్రావిడభాషల్లో యుష్మదస్మదర్థక సర్వనామాల ఔపవిభక్తికరూపాలు ఈ కింది మూలరూపాలనించి పుట్టినట్టు చెప్పవచ్చు.

అస్మత్ ఏకవచనం * అన్–(< మూ. ద్రా. * యన్–DED 4234)

అస్మత్ బహువచనం * అమ్–(< మూ. ద్రా. * యమ్–DED 4231)

యుష్మత్ ఏకవచనం * ఇన్–(< మూ. ద్రా. * నిన్–DED 3051)

యుష్మత్ బహువచనం * ఇమ్–(< మూ. ద్రా. * నిమ్–DED 3055)

మూలద్రావిడభాషలో పదాది యకారం తరవాత హ్రస్వ అకారం ఉండదు కాబట్టి యన్ –, యమ్–లు మధ్యద్రావిడభాషల్లో యకారంపోయి అన్–, అమ్ — లుగా మారాయి కాని దక్షిణోత్తరద్రావిడ భాషల్లో య–ఎ – గా మారి ఇవి ఎన్–, ఎమ్–లుగా మారాయి మధ్యద్రావిడభాషల్లో జరిగిన మార్పు దక్షిణోత్తరద్రావిడభాషల్లో జరిగిన మార్పుకన్న విలక్షణమైనదనే విషయం మనం గమనించాలి.

యుష్మదర్థకరూపాల్లో కూడా పదాది నకారం మిగిలిన అన్నిభాషల్లో మిగిలిఉండగా మధ్యద్రావిడ భాషల్లో అది నశించింది. ఈ నకారలోపం ఔప విభక్తికరూపాలలోనేకాకుండా వాటి ప్రథమా విభక్తిరూపాల్లో కూడా మధ్యద్రావిడభాషల్లో కనపడు తుంది. మూలమధ్యద్రావిడభాషలో *అన్—, *అమ్—, *ఇన్—, *ఇమ్—లు తెలుగు — కూయి భాషల్లో నా, మా, నీ, మీ లుగా వర్ణవ్యత్యయంవల్ల మారాయి. (చూడండి: కింద — 13) ఆ తరవాత ఈ రూపాల ప్రభావంవల్ల వీటి ప్రథమావిభక్తిరూపాలు (తె. ఏను, ఏము, ఈవు, ఈరు) నకార నుకారాలని మొదట చేర్చుకుని (తె. నేను, మేము, నీవు,

వీారు)గా కొన్నిభాషల్లో మారాయి. ఈ విషయంపై పూర్తిచర్చకి 'తెలుగులో యుష్మదస్మదర్థక సర్వనామాల చరిత్ర' అనే నా వ్యాసం (భారతి, ఫిబ్రవరి 1969) చూడవచ్చు.

5. తెలుగులో 'వాఁడు' అనే సర్వనామం దానికి మిగిలిన మధ్యద్రావిడభాషలలోఉన్న సమాన పదాలూ మూలమధ్యద్రావిడం *అఁన్ట్‌నించి వచ్చినవి. అవి తె. వాఁడు; కో. అమ్/అమ్డ్; నా అవ్‌న్‌ద్; ప. ఓద్/ఓడ్; గ. ఓండ్; (గోం. ఓల్/ఓర్); కొండ వాన్టు, కూయి. అఅంజు; కువి ఆ అసి, దీనిని దక్షిణద్రావిడరూపమైన * అవన్‌తో పోలిస్తే దీని చివర ఒక త కారం చేరినట్లు తెలుస్తుంది. (ద్రావిడభాషల్లో న కారం తరవాత వచ్చే త కారం ఱ గా మారుతుంది). పురుషేతరవాచియైన *అత్ సర్వనామంలో చివర తకారం ఉండడంవల్ల మధ్య ద్రావిడభాషలలో *అవన్‌కికూడా చివర తకారంచేరి *అవన్ట్‌ఏర్పడిఉండవచ్చునని ప్రొఫెసర్ ఎం బి. ఎమెనో సూచించారు (Ḳolami, a Dravidian Language, 10. 15).

6. కోలామి తప్ప మిగిలిన మధ్యద్రావిడ భాషల్లో క్త్వార్థక క్రియానిర్మాణంలో ఒక విశిష్టత ఉంది. వీటిలో చాలావాటిలో క్త్వార్థక ప్రత్యయానికి రెండు సపదాలు (Allomorphs) ఇ, చి అనేవి ఉన్నాయి. గోండీ, కొండలలోమాత్రం ఇ లేక చి నించి జన్మించిన రూపాలే ఉన్నాయి. కోయభాష గోండీకి మాండలికమే అయినా ఇందులో కూడా గోండికి మల్లే కాక ఇ, చి లు రెండూ ఉన్నాయి. (చూ. పి ఎస్. సుబ్రహ్మణ్యం, A Descriptive Grammar of Gondi 7. 4. 19., Appendix 41, అన్నామలై యూనివర్శిటీ, 1968.), కాబట్టి మిగిలిన గోండీ మాండలికాలలోనూ కొండలోనూ ఇ నశించి దాని స్థానాన్ని చి ఆక్రమించుకున్నట్టు మనం ఊహించాలి. కూయి—కువి లలో ఈ రూపం చివర అకారం ఉన్నా చాలా సందర్భాలలో ఇది ఇ గా మారుతుందని కూయి వ్యాకరణం వ్రాసిన డబ్ల్యు. డబ్ల్యు. విన్‌ఫీల్డ్ (Grammar, పేజీ 130) చెప్పారు. తెలుగులో వర్ణనాత్మకవ్యాకరణదృష్ట్యా క్త్వార్థక ప్రత్యయం ఇ కారమే అయినా కొన్ని క్రియల క్త్వార్థక రూపాల్ని మిగిలిన మధ్యద్రావిడభాషలరూపాలతో పోలిస్తే ముందుతెలుగు (Pre-Telugu) లో అటువంటి క్రియలలో చి ఉండేదనీ, వాటితో చ కారం తరవాత అనుచితవిభాగంవల్ల క్రియలో చేరిపోయిందనీ స్పష్టమవుతుంది. (భ. కృష్ణమూర్తి. Telugu Verbal Bases, 2. 42–46; 85–87.)

ఉదాహరణలు :

తెలుగు	గోండి	కోయ	కొండ	కూయి	కువి	పర్జి	గదబ
వచ్చి	వాసీ	వాసి	—	వాజ	వాహ	వెరి	వరి
తెచ్చి	తచ్చీ	తచ్చి	తాసు	తస	—	—	—
ఇచ్చి	సీసీ	ఈసి	—	సీఅ	హీహా	—	—
చూచి	సూఢ్‌సీ	ఊడి	—	సూడ	—	హూడి	సూడి
చేసి	కీసీ	—	కిజా	కిఅ	—	—	—

ఇక్కడ మనం రెండు విషయాలు గమనించాలి. దక్షిణద్రావిడభాషల్లో క్రియలన్నీ భూతప్రాతిపదికని త్, ంత్, త్త్, ఇ(న్) అనే నాలిగింటిలో ఒక దానితో ఏర్పరుచుకుంటాయి. వాటిలో ఒకే భూత ప్రాతిపదిక సమాపకక్రియ, క్త్వార్థకం, భూత ధాతుజ విశేషణం—ఈ మూడింటి నిర్మాణానికీ మూలంగా ఉంటుంది. మధ్యద్రావిడభాషల్లో సమాపక క్రియలోనూ, భూతధాతుజ విశేషణం లోనూ త కారం ఉన్నా క్త్వార్థకంలో మట్టుకు లదిలేదు. ఉత్తరద్రావిడభాషల్లో కూడా క్త్వార్థక క్రియానిర్మాణం దక్షిణద్రావిడభాషల్లోకి మల్లేనే ఒకానొక కాలంలో ఉండేదని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. ఇక రెండోవిషయమేమిటంటే చ కారం భూతకాలప్రత్యయంగా ప్రాచీనతమిళం, కోత, తోద, ఉత్తరద్రావిడభాషల్లో కూడా కొన్నిరూపాల్లో ఉన్నా అది క్త్వార్థక రూపంలో మధ్యద్రావిడభాషల్లోనే ఉంది. కాబట్టి ఈ భాషల్లో క్త్వార్థక

ఇ కారం మూలద్రావిడంనించి వచ్చిందే అయినా చి మాత్రం నూతనపరిణామం అని చెప్పకతప్పదు.

7 కోలామీ, నాయకీ, కూయి, కువి, కొండ లలో వర్తమాన భవిష్య ద్వ్యతిరేకక్రియతో పాటు ప్రత్యయనిర్మితమైన భూతవ్యతిరేకక్రియ కూడా ఉంది. దీని నిర్మాణం — క్రియాప్రాతిపదిక—వ్యతిరేక ప్రత్యయం—భూతప్రత్యయం—పురుష ప్రత్యయం — ఇలా ఉంటుంది. ఉదాహరణ :

కోలామీ	సీ ఎతన్	'ఇవ్వలేదు'
నాయకీ	ఆడెతన్	'ఆడలేదు'
కూయి	తిన్ ?నతెను	'తినలేదు'
కువి	హీ ?అతె ?ఎఁ	'ఇవ్వలేదు'
కొండ	సూడెత	'చూడలేదు'

ఈ అయిదు భాషల్లో దీని నిర్మాణం సమానంగా ఉంది. అంతేకాక దీనిలో ప్రత్యయాలు కూడా ఒకదానినొకటి పరిపోలి ఉండడంవల్ల వాటి మూలరూపాలు నిర్ణయించడం చాలా తేలిక. వాటిలో వ్యతిరేకప్రత్యయం * — (?) అ —, భూతప్రత్యయం *—త్—. పర్జీలో భూతవ్యతిరేక క్రియ వ్యతిరేకక్రియకి చివర భూతప్రత్యయమైన ఇ కారం చేర్చడంవల్ల ఏర్పడుతుంది. దీనికీ పై భాషల్లో వ్యతిరేకక్రియలకీ నిర్మాణంలో సాదృశ్యం లేకపోవడం వల్ల ఈ పర్జీ రూపానికీ పైవాటికీ జన్మ సంబంధం లేదనుకోవాలి. ఇటువంటి భూతవ్యతిరేక క్రియ మరే ద్రావిడభాషలోనూలేదు. బ్రాహుయీలో ఉన్న భూతవ్యతిరేకక్రియని రెండు ప్రత్యేక శబ్దాల సముదాయమని చెప్పవచ్చు. కాబట్టి పై మధ్య ద్రావిడభాషల్లో భూతవ్యతిరేకక్రియ మూల మధ్య ద్రావిడకాలంలోనే సృష్టింపబడిందని మనం ఊహించ వచ్చు. తెలుగు, గోండీ, పర్జీ, గదబల్లో ఇది లేక పోవడంవల్ల ఆయా భాషలు దీనిని తరవాతకాలంలో పోగొట్టుకున్నాయని మనం ఊహించవచ్చు.

8. తెలుగు, గోండీ, పర్జీలలో వ్యతిరేక క్త్వార్థకప్రత్యయం సమానంగా ఉంది. అది తెలుగు పర్జీలలో—అక, గోండీలో—వాక్, ఉదా.

తెలుగు	పర్జీ	గోండీ
చూడక	చూడక	సూఢ్వాక్
రాక	వరక	వాయ్వాక్
ఈయక	చియక	సియ్వాక్
తినక	తినక	తిన్వాక్

మూలద్రావిడంలో వ్యతిరేక క్త్వార్థకంలో ధాతు ప్రాతిపదిక, వ్యతిరేక ప్రత్యయమైన—ఆ—ఈ రెండే ఉండేవని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. కాబట్టి తెలుగు, పర్జీలలో—అక లోని అ కారం మూ. ద్రా. *ఆ నించి వచ్చిందనవచ్చు. గోండీ—వాక్‌లో వా ఆభాషలో ఉన్న—వ్—అనే వ్యతిరేక ప్రత్యయం సపదం అనుకోవచ్చు. ఇక మిగిలిన క ఎక్కడనించి వచ్చింది? దక్షిణద్రావిడభాషల్లో వ్యతిరేక క్త్వార్థకం మొదట్లో అ అనే వ్యతిరేక ప్రత్యయంతోటే ఉండగా తరవాత దీనికి భూత ప్రత్యయమైన త కారం చేర్చారు. ఉదా. తమిళం. చెయ్యా/చెయ్యాతు 'చెయ్యకుండా'. ఈ భూత ప్రత్యయాన్ని చేర్చడానికికారణం ఆయా రూపం సాధారణంగా భూతకాలంలో వ్యతిరేకాన్ని సూచించడం కావచ్చు. తమిళం చెయ్యాతు వంటి రూపాలతో తెలుగు, పర్జీ, గోండీ రూపాల్ని పోలిస్తే వీటిలో చివరి క కారం మొదట్లో భూతప్రత్యయమేమో అనే ఊహ కలగక మానదు. ఉత్తరద్రావిడభాషలు మూడింటిలో క కారం భూతప్రత్యయంగా ఉండడంవల్ల ఆయా ఊహ సరియైనదే కావచ్చు.

9. చాలా మధ్యద్రావిడభాషల్లో కొన్నిపదాలు సూచించే అర్థం నాటికి దక్షిణద్రావిడభాషల్లో ఉండే అర్థంకన్న వేరుగా ఉంటుంది. ఇటువంటి చోట్ల మధ్యద్రావిడభాషల్లో ఉన్న అర్థమే అర్వాచీనంగాను, మిగిలినభాషల్లో అర్థమే ప్రాచీనంగానూ కనపడుతుంది. కాబట్టి యిటువంటి అర్థ విపరిణామం కూడా మధ్యద్రావిడభాషల్ని ఒక ఉప

కుటుంబంగా పరిగణించడానికి సహాయపడుతుంది. ఉదాహరణలు : (చివర ఇచ్చిన సంఖ్యలు DED లో ఆ పదాలు ఉండే సముదాయాల్ని సూచిస్తాయి).

(1) కో. నా. గోం. కరు 'ఆకలి': త. కరుప్పు; తె. కఱవు (1081).

(2) తె కొను, కొండ. కొఢ్—, కూయి. కొడ్ –, పె. కొఢ్ –, మండ ర్ఢగ్ –, కువి కొడ్— 'కొను'. త. మ క. కొళ్ 'తీసుకును' (1788)

(3) కో. నా. తోరెన్, ప తొలెద్/తొలెడ్, గ తొఢొన్/తోండోండ్, కొం తొఢన్, పె. టొండెన్ 'తమ్ముడు'. త. తోఴన్, మ. తోఴన్, తె తోడు, కూయి. తోఢి 'స్నేహితుడు' (2939)

(4) తె. పనుచు, కో. నా. పన్క్–, కూయి. పండ్–: త. మ పణి 'మాట్లాడు, ఆజ్ఞాపించు', తె పలుకు, బ్రా. పాన్–'మాట్లాడు'. (3212)

(5) గోం. పేన్, కూయి. కువి. పేను, ప. వేదిద్/వేదిఢ్, గ. వేంిట్. కూయి. వేను, పె. పెన్ 'దేవుడు'; త పేయ్, మ. పేయి, కో. పేయ్, క. పేతు, తు. పేయి 'దయ్యం' (3635 & 4550)

10. మధ్యద్రావిడభాషల్లో కొన్ని పదాల్లో మిగిలినభాషల్లో లేని 'ప్రాతిపదిక ప్రత్యయాలు (Derivative Suffixes) ఉన్నాయి. ఇవికూడా మధ్యద్రావిడభాషల మూలభాష కాలంలో చేరినవే కావచ్చు. ఉదాహరణలు :

(1) తె. దుప్పి, కో. దుప్పి, ప ఉఘుఫ్, గోం. దుప్పాల్, కొం. దుపి: త. ఉఱై (598)

(2) ప. నెలిఞ్, గ నెల్లొంగ్, గోం. లెల్లోంజ్, నెల్లోంజ్, కొండ. లేంజు, కూయి. డాంజు, కువి. లేంజు, పెంగో. మండ. లేంజ్: త నిలా, నిలవు, తె. నెల 'నెల, చంద్రుడు' (3113)

(3) కో పర్స్–, ప. పర్చ్–, గ. పార్చ్–, కొండ పస్–, పె. మండ. పచ్–, కూయి పచ్–: త. పరంటు 'బరుకు' (3313).

(4) తె. త్రాచు, గోం. తరాస్, కొం. సరస్, పెంగో. రాచ్, మండ. త్రెహె, కూయి. ప్రాసు, కువి. రాచు (<*చరచ్): త. అరవు అరవం, అర, అరా 'పాము' (1949)

(5) తె. కఱచు, కో. కర్స్–, నా. కరప్–, గోం. కరి–, పెంగో మండ. జవ–, కూయి గ్రాంబ్– (<మూ. మ. ద్రా. *కఱ్—): త. మ క కల్ 'నేర్చుకును' (1090). (ఇందులో కూయి క్రియలో 'ంబ్' ప్రత్యయం దీని ప్రేరణరూపంలో 'ప్' ప్రత్యయం (కూయి గ్రావ్–, తె. కఱపు) ఉండడం వల్ల, సామ్యంవల్ల సృష్టించబడింది.)

(6) అన్నిమధ్యద్రావిడభాషలూ నాకు, నాక్: త మ. క తు. నక్కు (క్రియ) (2945)

(7) తె. నిండు, కో. నా. నిండ్–, గోం. నింఢ్–, కొండ నిన్ట్–, పెంగో నెంజ్–, కూయి. కువి. నెంజ్...(<మూ. మ. ద్రా. * నిన్ట్–): త. మ., నిఱై, క నెఱె (3049)

(8) తె. పండు, కో. నా. పండ్–, పఢ్ఙ్–, గ. పఢంగ్–, గోం. కొండ. పండ్ –: త. మ. పఴు 'పండు (క్రియ) (3299)

పై వాటికి తోడు మధ్యద్రావిడభాషలలో మాత్రమేఉన్న కొన్నిపదాలుకూడా ఆ భాషల సన్నిహితత్వాన్ని బలపరుస్తాయి. ఉదా. తె. డప్పి (కో. అడ్డ్–, 'దాహంవేయు', నా. అడ్–, 'దాహం', ప. గ. అండ్–, ('దాహం, ఆకలి) వేయు', 95), తె. రాలు (కో. నా. రాల్–, గోం. కొండ అర్–, 197), తె. ఉసుము (కో. ఉస్మ్–, ప. గ. ఉయ్క్–, గోం. ఉసూవ్–, 493), కో. నా. ప. గ. గోం. కొర్, కొండకొఱు, కూయి కొజు 'కోడి' (1768), ప. చర్పి, గ. సడ్పి, గోం. సడాపీ,

కొండ ధాపి (1986). తె. ఉతుకు (కో. నా. సుత్క్–, గోం. సుక్క్–, 2196). తె. త్రవ్వు (గోం. తర్–, కూయి తాశ్– 2547), తె. మఱంది, మఱందలు (కో. మరన్, మర్ందల్, గోం. మర్ండాఢ్ 'మఱందలు', 3899).

II తెలుగు—కూయి భాషలలో నూతన పరిణామాలు

11. మనం ఇంతవరకూ మధ్యద్రావిడ భాషల్లో అన్నింటిలో ఏర్పడిన నూతనపరిణామాలు పరిశీలించాం. ఈ భాషల్ని ఇంకా సూక్ష్మంగా పరిశీలిస్తే వీటి అన్నింటినీ రెండు శాఖలుగా విభజించవచ్చునని తెలుతుంది. అందులో కోలామీ, నాయకీ, పర్జీ, గదబ—ఈ నాలుగు భాషలూ ఒక సముదాయం. దీనికి కోలామీ–పర్జీ భాషాసముదాయమని ప్రొఫెసర్ ఎమెనో పేరు పెట్టారు. ఈ నాలుగు భాషలూ అతిసన్నిహిత సంబంధం గలవని మొదట చెప్పినవారు ప్రొఫెసర్ టి. బరో, భట్టాచార్య (The Parji Language (1953) పేజీ XI) ఈ నాలుగుభాషల సన్నిహిత సంబంధానికీ ఆధారాలు సేకరించి ఎమెనో తమ Kolami, a Dravidian Language (1955, Reprinted by Annamalai University) లో చూపారు కాబట్టి దీనిపై విశేష చర్చ మనం ఇప్పుడు చెయ్యక్కరలేదు. ఇక గోండి, కొండ, కూయి, కువి భాషలమధ్య కూడా విశేష సంబంధం ఉందనికూడా బరో, భట్టాచార్యలైన పేర్కొన్న తమ గ్రంథంలో మొట్టమొదటగా సూచించారు. తరవాత ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణమూర్తి తమ Telugu Verbal Bases (1961, Chapter IV) లో తెలుగు, మధ్యద్రావిడభాష అనీ దానికి గోండ్, కొండ, కూయి, కువి భాషలతో అతి సన్నిహిత సంబంధం ఉందనీ మొట్టమొదటగా చెప్పారు. (పెంగో, మండలు కూడా ఈ శాఖకే చెందుతాయి గాని వీటినిగురించిన వివరాలు చాలా ఇటీవలనే తెలిశాయి). ఈ భాషల్లో ముఖ్యమైన నూతన పరిణామాలు ముందు చర్చించి ఆ తరవాత తెలుగుకి వీటితోగల సంబంధం నిర్ణయిద్దాం (వీటిని సంగ్రహంగా తెలుగు–కూయి భాషలనీ, తెలుగు చేరకపోతే గోండి-కూయి భాషలనీ వ్యవహరించ వచ్చు.)

12. తెలుగు – కూయి భాషల్లో ఒక ముఖ్యమైన పరిణామం వర్ణవ్యత్యయం. దీనివల్ల ధాతువులో అచ్చూ, దాని తరవాత ఉండే హల్లూ పరస్పరం స్థానాలు మార్చుకుంటాయి. తెలుగులో రోలు (త. ఉరల్), మ్రాను (త. మరం), ప్రొద్దు (త. పొఱుతు), వ్రేలు (త. విరల్). క్రింద (త. కీఴ్), మ్రింగు (త. విఴుంగు) మొదలైన శబ్దాల్లో వర్ణవ్యత్యయం ఏర్పడింది. ఇదేవిధంగా కూయిలో (గ్రాంబ్–'కఱచు', మ్రహ్న 'మ్రాను', మ్డాడు 'కుందేలు' మొ.), కువిలో (మ్డాను 'మ్రాను' మ్డాలు 'కుందేలు' మొ). పెంగోలో (క్డో–'క్రొవ్వు', మ్రోల్ 'కుందేలు' మొ.), మండలో (కుఽఅ 'క్రొవ్వు', ప్డేన్ 'ఎముక' మొ.) వర్ణవ్యత్యయం ఉంది. పై భాషల్లో వర్ణవ్యత్యయంవల్ల . పదాది సంయుక్తాక్షరాలు ఏర్పడ్డాయి కాని గోండి, కొండల్లో పదాదిని హల్లులేనప్పుడే వర్ణవ్యత్యయం జరుగుతుంది. గోండీలో ర్యెయోల్/లెయోంగ్ 'యువకుడు' (< * ఇళ), రోన్/ల్లోన్ 'ఇల్లు' (< * ఉళన్) మొదలైనవి, కొండలో ఆల్–'లాగు' (గోండీ ఎరీ–'లాగు'), ఢు – 'దున్ను' (<* ఉఴు), లేంజ 'చంద్రుడు' మొదలైనవి వర్ణవ్యత్యయానికి ఉదాహరణలు. దీనివల్ల ఈ భాషలన్నీ ఒకేభాషగా ఉన్న ప్రాచీనకాలంలో వర్ణవ్యత్యయం ప్రారంభమైనదని మనం ఊహించవచ్చు. కొలామీ—పర్జీ భాషలలో ఇలా వర్ణవ్యత్యయమనేది ఒక్కమాటలో కూడా లేక పోవడం మనం గమనించాలి.

13 తెలుగు—కూయిభాషల్లో యుష్మదస్మదర్థక సర్వనామాల పరిణామంలోకూడా చాలా ఐక్యం ఉంది. వీటి ఔపవిభక్తికరూపాలు మూల మధ్యద్రావిడంలో *ఆన్–, *అమ్–, ఇన్–,

*ఇవ్–, ఇవి ఇలాగే నేటికీ కోలామీ–పర్జీ భాషల్లో నిలిచిఉండగా తెలుగు–కూయి భాషల్లో ఇవి వర్ణ వ్యత్యయం పొంది నా, మా, నీ, మీ లుగా మారి పోయాయి (చూడండి : ఈ వ్యాసం నాలుగో పేరా.) తెలుగులో అది ఔపవిభక్తికరూపం దాని–; అవి ఔపవిభక్తికరూపం (ప్రాచీనం) వాని–, (వ్యావహారికం) వాటి–వీటిలో వర వ్యత్యయం స్పష్టంగా కనపడుతూ ఉండడంవల్ల పై రూపాల్లో కూడా వర్ణవ్యత్యయం ఏర్పడిందని చెప్పడంలో ఏమీ తప్పు లేదు. వీటికి మూలద్రావిడరూపాలతో ఏమీ సంబంధంలేదనేవాదం ఒకటి ఉందిగాని వీటి ప్రథమావిభక్తి రూపాలు మూలద్రావిడరూపాలనించే వచ్చాయని అందరూ ఒప్పుకుంటారు కాబట్టి ఈ ఔపవిభక్తి రూపాలుకూడా మూలద్రావిడరూపాలనించే వర వ్యత్యయంవల్ల ఏర్పడ్డాయని చెప్పడమే సమంజసమని తోస్తుంది.

14. మధ్యద్రావిడభాషల్లో పురుషేతర వాచకాల బహువచనప్రత్యయం పరిశీలిస్తే అవి గోండీ–కూయి, కోలామీ–పర్జీ అనే రెండు శాఖలుగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. తెలుగులో బహువచన ప్రత్యయ పరిణామం మిగిలిన అన్నిద్రావిడభాషలలోకంటె విలక్షణమైనది. కోలామీ–పర్జీ శాఖలో ఈ ప్రత్యయానికి *–కళ్, *–ళ్, *–చిళ్, *–వ్ అనే నాలుగు సపదాలు ఉన్నాయి. గోండీ–కూయి శాఖలో దీనికి *–క్, –ంక్ అనే రెండు సపదాలుమాత్రమే ఉన్నాయి. వీటిలో *–క్ హలంతాల తరవాత, *–ంక్ అజంతాల తరవాత సాధారణంగా వస్తాయి, ఉదాహరణలు

మూలద్రావిడంలో *–కళ్, *ళ్ అనే రెండు సపదాలు ఉండేవి. ఇవి తుళు, కోలామీ–పర్జీ శాఖలలో నేటికీ నిలిచిఉన్నాయి. గోండీ–కూయి శాఖలో *–క్ మూ. ద్రా. *–కళ్ నించి వచ్చింది అనుకుంటే అజంత పదాల తరవాత ఇది ఈ శాఖలో *–ంక్ గా అనునాసికాన్ని ముందు చేర్చుకుని మారింది అనుకోవాలి. ఈ మార్పు గోండీ–కూయి శాఖలో భాషలు ఒకటిగా ఉన్నప్పుడు జరిగిఉండాలి గనక ఇది వీటి పరస్పరసన్నిహితత్వాన్ని సుస్పష్టం చేస్తుంది.

15. మూలద్రావిడంలో హ్రస్వాచ్చు కలిగి న, ణ, ల, ళ లతో అంతమయ్యే క్రియల తరవాత భూతప్రత్యయమైన తకారం చేరేటప్పుడు ఆ తకారం న, ల, ల తరవాత ఱ గానూ, ణ, ళ ల తరవాత ట గానూ మారేది. (ల, ళ లు కూడా అప్పుడు న, ణ లుగా మారేవి). ఉదా. త. ఎన్–, (భూ. ప్రా. (భూత ప్రాతిపదిక) ఎన్ఱ్–), 'అను', తిన్–(తిన్ఱ్–), 'తిను', ఉణ్–(ఉంట్–) 'తిను, తాగు', చెల్–(చెన్ఱ్—) 'వెళ్ళు'. ఇటువంటి క్రియల భూత ప్రాతిపదికల్లో అనునాసికం మూలగోండీ – కూయి భాషలో దాని తరువాత వచ్చే స్పర్శం రూపాన్నే పొందేది. అంటే మూ. ద్రా. *ఎన్ఱ్–మూలగోండీ–కూయిలో *ఎఱ్ఱ్–గానూ, మూ. ద్రా. *తిన్ఱ్-మూలగోండీ కూయిలో *తిఱ్ఱ్–గానూ, మూ. ద్రా. *ఉంట్ — మూలగోండీ — కూయిలో *ఉట్ట్ — గానూ, మూ. ద్రా. *చెన్ఱ్—మూలగోండీ–కూయిలో *చఱ్ఱ్ గానూ మారాయి. ఇప్పటి గోండి–కూయి భాషల్లో ఈ క్రియల భూతప్రాతిపదికలు పైన ఇచ్చిన మూల

గోండీ	కొండ	కూయి	కువి	పెంగో	మండ	
తరాస్క్	సరస్కు	ప్రాస్క	రాస్క	—	—	* చరచ్క్ 'పాములు'
నహ్క్	నాఱ్కు	నాస్క	నాస్క	నాస్కు	—	నాళ్క్ 'ఊళ్ళు'
కఢ్క్	కణ్కు	కన్గ	కన్క	కణ్కు	కన్కె	* కణ్క్ 'కళ్ళు'
మర్కాఙ్	మర్కెఙ్	మహంగ	—	—	—	! మఱ్కాంక్ 'మామిడిపళ్ళు'
పుత్తీఙ్	పుట్టిఙ్	పుసింగ	—	—	—	* పుఱ్ఱింక్ 'పుట్టలు'
సుక్కాఙ్	సుకెఙ్	సుకంగ	—	హుకఙ్	—	* చుక్కాంక్ 'చుక్కలు'

గోండీ-కూయి రూపాలనించి ధ్వనిపరిణామానుసారం జనించినవే. *ఙ్ట్ గోండీలో త్ గానూ, కూయిలో స్ గానూ మారుతుంది కాబట్టి *ఇఙ్ట్ గోండీలో ఇత్—గానూ, కూయిలో ఇస్—గానూ, *తిఙ్ట్ గోండీలో తిత్—గానూ, కూయిలో తిస్-గానూ మారాయి. మిగిలిన పెంగో, కొండ మొదలైన భాషల్లో కూడా ఇదేరకమైన మార్పు కనపడు తుంది. ఈ భూతప్రాతిపదికలో అనునాసికం స్పర్శంగా మారడం కూడా గోండీ-కూయి భాషలు ఒక శాఖ అనే విషయాన్ని ధ్రువపరుస్తుంది.

16. గోండీ	నింద్ – 'నిండు'	నిహ్ – 'నింపు'	—	వెహ్ – 'చెప్పు'
కొండ	నిన్ట్ – ,,	నిఙ్ట్ – ,,	వెన్–'విను'	వెఙ్ట్ – ,,
పెంగో	నెంజ్ – ,,	నెచ్ – ,,	వెన్– ,,	వెచ్ – ,,
మండ	— ,,	నెహ్ – ,,	వెన్– ,,	వెహ్ – ,,
కూయి	నెంజ్ – ,,	నెస్ – ,,	వెన్– ,,	వెస్ – ,,
కువి	నెంజ్ – ,,	నెస్ – ,,	వెన్– ,,	వెస్ – ,,
	మూ మద్రా *నిన్ట్–	మూ.గోం.కూ.*నిఙ్ట్–	మూ ద్రా.*వెన్–	మూ.గోం-కూ.*వెఙ్ట్–

పైన గోండీ — కూయి భాషల్లో రెండు క్రియల ప్రేరణాప్రేరణరూపాలు ఉన్నాయి. వాటిలో *నిన్ట్–,*వెన్–అనే అప్రేరణ రూపాలు ఈ భాషల్లోనేకాక మిగిలినద్రావిడభాషల్లోకూడా ఉండగా (DED 3049, 4472 చూడండి), *నిఙ్ట్–, *వెఙ్ట్–అనే ప్రేరణరూపాలు మాత్రం గోండీ–కూయి భాషల్లో మాత్రమే ఉన్నాయి. ఈ రెండు ప్రేరణరూపాలు గోండీ — కూయిభాషల మూలభాషకాలంలో *తోన్ట్ 'కనపడు'! ప్రేరణ *తోఙ్ట్ 'చూపించు', *తిన్ 'తిను': ప్రేరణ*తిఙ్ట్ మొదలైన క్రియల్లో ఉన్న పద్ధతి ననుసరించి సామ్యతవల్ల ఏర్పడ్డాయని చెప్పవచ్చు కాబట్టి ఈ విషయం కూడా ఈ భాషల పరస్పర సన్నిహిత సంబంధాన్ని ధ్రువపరుస్తుంది.

17. తెలుగు, గోండీ (కోయతో సహా)లలో విధ్యర్థక మధ్యమపురుష రూపాల నిర్మాణంలో ఒక ప్రత్యేకత ఉంది. తెలుగు, గోండీ, కోయ, కొండ, కూయి, కువిలలో విధ్యర్థక ప్రత్యయాలు కింద ఇవ్వబడ్డాయి.


	ఏకవచనం	బహువచనం
తెలుగు	—ఉ(ము)	ఉండు
గోండీ	— అ(~ –వ్)	— అ (~వ్–) +ట్
కోయ	—అ(~ –ము)	ఆ–(~–మూ–) +టి (~ –టు)
కొండ	— ?	— దు (~–డు ~ – ఉ(
కూయి	—ము(~ – అము ~ ఉము–	అటు ~ — దు (~ – దు ~ – జా)
కువి	— ము(~ – అము)	అదు ~ – దు(~–జా)

ఈ భాషల్లో విధ్యర్థకంలో ఏకవచన ప్రత్యయం మకారమనీ, బహువచనప్రత్యయం త/ట అనీ పై పట్టిక వలన తెలుస్తుంది. కాని మిగిలిన ద్రావిడభాషల్ని పరిశీలిస్తే వాటిలో మ కారం బహువచన ప్రత్యయమని తెలుస్తుంది మ కారం బహువచన ప్రత్యయంగా తమిళం, కోత, కన్నడాలలో కనపడు తుంది. బ్రాహుయీలో విధ్యర్థక బహువచన ప్రత్యయం -బొ కూడా ఈ మకారంనించే వచ్చింది కావచ్చు సర్వనామాలలో మకారం బహువచం ప్రత్యయంగా ఉండడంకూడా విధ్యర్థకంలో మకారం మొదట్లో బహువచన ప్రత్యయమే అయిఉండాలనే ఊహని బలపరుస్తుంది. అందుచేత మొదట్లో బహువచన ప్రత్యయంగాఉన్న మకారం ఏకవచన

ప్రత్యయంగా పై భాషల్లో మారిందని మనం ఊహించక తప్పదు ఈ మార్పుకి ఈ భాషల్లో త్/ట్ అనే వేరొక కొత్త బహువచన ప్రత్యయం రావడమే కారణమై యుండవచ్చు. దీని తరవాత గోండీ, (కోయ) తెలుగులు ఈ మకారాన్ని మళ్లీ బహువచన రూపంలోకూడా చేర్చుకున్నాయి. ఈ క్రింది ఉదాహరణలవల్ల తెలుగు విధ్యర్థక బహువచన ప్రత్యయం - ఉండు అనేది --ఉమ్-- + -ట్ అనే రెండిటి సంయోగంవల్ల ఏర్పడిందని స్పష్టమవుతుంది. (దీనిలో మకారం టకారం సన్నికర్షంవల్ల ణ గా మారగా టకారం నాదమైందని ఊహించాలి.)

(1)	గోండీ	సీమ్	సీమ్‌ట్
	కోయ	ఈము	ఈమూటు
	తెలుగు	ఇమ్ము	ఇండు
(2)	గోండీ	కీమ్	కీమ్‌ట్
	తెలుగు	చేయుము	చేయుండు

18. ఈ వ్యాసం రెండోభాగంలో ఇచ్చిన ఆధారాలవల్ల తెలుగు, గోండీ, కొండ, కూయి, కువి, పెంగో, మండలు మధ్యద్రావిడఉపకుటుంబంలో ఒకశాఖగా పరిగణించవచ్చునని తేలుతుంది. కాని ఈ శాఖలో తెలుగుస్థానం కొంత ప్రత్యేకమైనదిగా కనపడుతుంది ఎందుచేతనంటే తెలుగు ఈ మిగిలిన ఆరు భాషలతో 12, 13 పేరాలలో చర్చించిన రెండు నూతన పరిణామాలనిమాత్రమే పంచుకుంటుంది కాని మిగిలిన ఆరు భాషలు కలిసి పొందిన ఇతర నూతన పరిణామాలతో (14–16 లో చర్చించినవి) తెలుగుకి ఏవిధా సంబంధంలేదు. కాబట్టి మొదటి రెండు పరిణామాలూ జరిగిన తరవాత తెలుగు ఈ భాషలనించి విడిపోయిందనీ, ఆ తరవాత కొంతకాలం మిగిలినఆరుభాషలూ విడిపోకుండా ఉండగా ఆ కాలంలో మిగిలిన పరిణామాలు ఏర్పడ్డాయనీ ఊహించడం యుక్తియుక్తం. తెలుగు గోండీలలో విధ్యర్థకరూపనిర్మాణంలో సామ్యం ఈ రెండు భాషలూ విడిపోయినా అవి ఒకే ప్రదేశంలో ఉండడంవల్ల తరవాతకాలంలో సంభవించినదని ఊహించవచ్చు. మూలమధ్యద్రావిడభాష నించి ఇప్పటి మధ్యద్రావిడభాషలు వివిధకాలాల్లో ఎలా పరిణామం చెందాయో ఈ కిందఉన్న భాషా కుటుంబ వృక్షపటం సూచిస్తుంది.



మధ్య ద్రావిడ భాషల కుటుంబ వృక్షపటం

ఉమరు ఖయాము

శ్రీ కర్ణ రాజశేషగిరిరావు

సాహిత్యము మానవుని చిరంతన వస్తువు. ఇయ్యది సంస్కృతి కాధారము. చింతనానుభూతులను బట్టి సంస్కృతి, సాహిత్యము పరిఢవిల్లుచుండును. ఆ యా ప్రవృత్తులను బట్టి సాహిత్య ప్రకృతులు, వికృతులు పరిఢవిల్లుచుండును. విదేశ సాహిత్య ప్రభావము భారతీయసాహిత్యముపై బడవచ్చును. కాని యిది రాజకీయప్రభావముపై నెక్కువగా నాధారపడియుండును. రాజ్యపరిపాలనమునుబట్టి రాజ్య పద్ధతులు మారుచుండును. ముస్లిమురాజ్య పరిపాలనమునందు భారతీయులు అరబీ, పారసీ, తుర్కీ, ఉర్దూ భాషల నభ్యసించిరి. ఆయా భాషలలో వ్రాయుట, మాటలాడుట రాజకీయావశ్యకతను సూచించును. భాషను నేర్చుకొనిన తర్వాత సాహిత్యాభిరుచియు పెంపొందుట సహజము. పారసీ సాహిత్యము నందు 'ఉమరు ఖయాము' రుబాయీలు భారతీయుల నాకర్షించినవి

తెలుగు పాఠకులకు 'ఉమరు ఖయాము' రుబాయిలు క్రొత్తవిగావు నవ్యాంధ్ర సాహిత్యమందు ఉమారుఖయాము రుబాయిల కనువాదము లనేకములు వెల్వడినవి. దాదాపు పదేను గురు అనువాదకవులు గలరు. వారిలో పెక్కురు ఫిట్జురాల్డు ననుసరించిరి. ఆ యనువాదములలో కొన్ని భావానువాదములు; కొన్ని యథామాతృకములు; కొన్ని స్వతంత్రానువాదములు. ఇందువానిలోని సొగసులను, భావవీచికలను దెలిపి యున్నారు.

జీవిత విశేషములు :

ఉమరు సూర్యారాధకుడనియు, కాశ్మీర బ్రాహ్మణుడనియు, నొకానొక జోరాస్ట్రియను చక్రవర్తి యాహ్వానముపై నితని పూర్వీకులు పర్షియాలో స్థిరనివాస మేర్పఱచుకొనిరని ఆదిభట్ల నారాయణదాసుగారి యభిమతము. కాని దీనికి ప్రబలాధారము లేమియు లేవు ఉమరు పయి వారికున్న గౌరవాదరాభిమానము లీ వాక్యములవలన సూచితములు.

ఉమరుఖయాము పారసీదేశమునకు జెందిన కవి. ఆయన పూర్తి పేరు 'గయాసుద్దీను అబుల్ ఫతహ ఉమర ఇబ్న ఇబ్రహీమ్ అలఖ్యామీ.' అనగా డేరాలువేయుకుటుంబమునకు జెందిన ఇబ్రహీం పుత్రుడు దీనినిబట్టి 'ఉమరు' వంశములోని పూర్వీకులు డేరాలువేసెడివారని యూహింపదగును. ఉమరు ఖయామునకు, కుటుంబవృత్తికి సంబంధములేదని కొందఱు పండితు లభిప్రాయపడిరి. 'ఖయాము' కవి పెట్టుకొనిన ఉపనామమని వీరి యూహ. ఇటి యుపనామమును బెట్టుకొనుట పారసీకవుల కాచారముగా నున్నట్లు కాన్పించుచున్నది. 'అత్తారు' అను కవి గలడు. శబ్దార్థమునబట్టి అత్తరు చేయువాడని దీని యర్థము. అనగా వాణీపుష్పములనుండి కవితాసారము నందించు కవి యని భావము ఇటులనే శబ్దములను డేరావేసి రుబాయిలనెడి నాలుగు పాదములను కఱ్ఱలతో భావములను తెలుపువాడని యర్థము కానోపు! ఉమరు జీవిత విశేషము లధికముగా దెలియవు ఆయన 11 వ శతాబ్దమునకు జెందినవాడు. దాదాపు 80 లేక 85 వర్షములు జీవించియుండవచ్చును ఉమరు గొప్ప జ్యోతిషశాస్త్రజ్ఞుడు; భావుకుడు; స్వాంతః సుఖాయ కవిత నల్లినవాడు. మలిక్‌శాహ్‌సుల్తాను ఆజ్ఞ ననుసరించి పంచాంగమును సరిదిద్దినాడు. ఆనాటినుండి 'తారీఖే — మలిక్ — శాహీ — జలాలీ' సంవత్సర మారంభమాయెను. ఉమరు కావ్య సంగ్రహమంతయు నేడు దొరకుటలేదు. ఆయన మరణా

నంతరము 75 ఏండ్లకు ఉమరు కవితాసంగ్రహ మొకటి వెల్వడినది. ఇందు 250 రుబాయి లున్నవి. వేయి రుబాయిల నుండి కూర్చిన సంగ్రహ మిది. ఉమరు అభ్యుదయకవి; సనాతనధర్మము నెదుర్కొని నాడు; మతబోధకుల పద్ధతులను ఖండించినాడు; సూఫీల వేషాడంబరమును తిరస్కరించినాడు అందు వలన గొప్ప పేరును బడయలేకపోయెను. పారసీదేశము నందు జ్యోతిషశాస్త్రవేత్తగాను, గణితశాస్త్రజ్ఞుడుగాను ప్రసిద్ధి కెక్కినాడు.

'రుబాయి'లు :

రుబాఇయాత్–ఏ–ఉమరఖైయామ్ – అనగా ఉమరుఖయామునయొక్క రుబాయి అని యర్థము. 'రుబాఈ' శబ్దమునకు పారసీభాషలో బహువచన రూపము 'రుబాఇయాత్'. రుబాఈ అనగా చతుష్పది ఇదియొక ఛందోవిశేషము. ముక్తక కావ్యములందు దీనిని విశేషించి వాడుదురు. దీనిలో నాలుగు పాదము లుండును ఇది మాత్రాఛందస్సు ఇందు ప్రాసనియమము గలదు. మొదటి, రెండవ, నాలుగవ పాదములందు ప్రాస నియమ ముండును. మూడవపాదము పై పాదములకు భిన్నముగా నుండును. ఒక్కొక్కసారి నాలుగు పాదములందు ప్రాస రావచ్చును. పారసీభాషయందిది విశేషప్రచారము నందున్న ఛందస్సు. రుబాయిలో భావమును విపులీకరించి చెప్పుటకు వీలున్నది. ఇందు కవి మొదటి రెండు పాదములందు భావనాలోకమున విహరించును మూడవపాదము ప్రాస రహితము. అందు వలన భావము పరాకాష్ఠ నందును. నాల్గవపాదము భావవిపులీకరణమునకు దోడ్పడును. మొదటి రెండు పంక్తులలో స్వేచ్ఛావిహార మొనర్చిన భావము ప్రాసరహితతృతీయపాదమునందలి సంఘర్షణమును ఢీకొని నాల్గవపాదమునందు విరమించును. నాల్గవ పంక్తి భావసంతులనమునకు దోడ్పడును.

దార్శనిక తత్త్వము :

ఈ గీతములందు ప్రకృతి తత్త్వదర్శనము నిగూఢము మనుష్యుడు పుట్టును; పెరుగును; లోకము నవలోకించును; అనుభూతుల నొందును; లోకానుభవమును పురస్కరించుకొని జీవితమునం దమందానందము ననుభవించును; నిజతృష్ణను దీర్చుకొన ప్రయత్నించును; ప్రబల ప్రవృత్తులకు లోనగును; ఇటనుండి సంఘర్షణ మారంభమగును. మనుజుడు సంతృప్తి నొందడు; ప్రకృతి పరివర్తనశీల. సౌందర్యము శాశ్వతము గాదు; ప్రేమ శాశ్వతము గాదు. మరణము తలుపులు దెఱచుకొని వేచియుండును ఇది జీవిత ప్రశ్న. జీవిత మననేమి? తృష్ణయననేమి ? తృప్తి యననేమి ? ఈ జగన్నాటకమందు సంఘర్షణకు కారణమేమి ? దీనికి సమాధానము చిక్కక పలాయనము చిత్తగించు వారు కలరు. రుబాయిలు భోగవాదులకు దగిన వేదాంతసారముగాదు; దుఃఖవాదుల వేదాంతసార మనవచ్చును.

అనువాద సాహిత్యము :

ఉమరు రచనల కనువాదమునకు నాంది 19 వ శతాబ్దము ప్రొఫెసరు కోవెల్ ఆక్సుఫర్డు లోని గ్రంథాలయములో పారసీ భాషలోనున్న వ్రాతప్రతిని జూచినాడు అందు 158 ఉమరు రుబాయి లున్నవి వీని భావ గాంభీర్యమునకు, వ్యంగ్య ధోరణికి ముగ్ధుడయినాడు. విశ్వసాహిత్యాకాశములో మెఱుగుపడిన నక్షత్రము ... వెలుగొందినట్లు మురిసిపోయినాడు దాని నాయన తన మిత్రుడగు ఫిట్జురాల్డున కంపినాడు. ఈయనయే ఫిట్జురాల్డును పారసీభాషను చదువవలసినదిగా ప్రోత్సహించినాడు. శ్రీ 'కోవెలు' మఱల ఏషియాటిక్ సొసైటీనుండి మఱియొక వ్రాతప్రతిని పంపెను. దానిలో 516 రుబాయి లుండెను సమయానుకూలముగా ఫిట్జురాల్డు మానసిక పరిస్థితియు పరిణతినుండి ఆయా భావముల నర్థము జేసికొను పరిపక్వదశకు వచ్చినది. రుబాయిల ననువదించి, వాని కావ్యగౌరవము నినుమడింపజేసినాడు ఫిట్జురాల్డునంటి అనువాదకుడు మఱల పుట్టడను ప్రతీతి వెల్వడినది కాని దాని నచ్చొత్తించుట కే ప్రకాశకుడు ముందుకు రాలేదు. రెండేళ్ల వఱకు వ్రాతప్రతి యొక ప్రకాశకునికడ పడియుండెను. 1850 లో 250 కాపీ లచ్చొత్తింపబడినవి. ఇందు 75 రుబా

యాలు గలవు. అనువాదకునకు తన పేరు నుటకించుకొను సాహసము లేకపోయెను. వెల 5 షిల్లింగులు. ఎవరు కొనలేదు. ధర తగ్గింపబడెను. కాని ఎవరు కొనలేదు. చిత్తు పుస్తకములలోబడ వేసిరి. ప్రసిద్ధాంగ్ల కవులు దానిని జూచిరి. వారికి దానిని జూడగానే బురదలో కమలము వికసించినట్లుండెను. దానిని వారు బాగుగా ప్రశంసించిరి పుస్తకమునకు మంచి పేరు వచ్చినది. నేడు ప్రాత ప్రతిని లక్షల రూపాయలకు గొనుటకు అమెరికా గ్రంథములు సిద్ధముగా నున్నవి రెండవ ముద్రణము 1868 లోను, 3 వ ముద్రణము 1872 లోను, నాల్గవ ముద్రణము 1879 లో వెల్వడెను. తర్వాత ఉమరు రుబాయిల అనువాదము లయిదాలు వెల్వడినవి. కాని అవి ఫిట్జురాల్డు అనువాదమునకు సాటిగాదు చిత్రకారులు చిత్రములను గీసిరి ఉమరు ఖయాము జీవితగాథను సినిమాలో చిత్రించిరి. నిజముగా పిట్జురాల్డు రతనాల నేరి సానబెట్టినాడు; అన్నింటి నేర్చి, కూర్చి భావ సూత్రమున కనుగుణముగా పూసల దండను గుచ్చినాడు క్రమమునుబట్టి కథ యొకటి ఏర్పడియుండునట్లు రాయెను ఇది 75 రుబాయిల సంకలనము గాదు. ఇది 75 పదముల కూర్పు; ప్రక్షిప్త బంధనము గల టీనల 'రాబర్టు గ్రేవ్' సూఫీ మతమును దృష్టిలో బెట్టుకొని రుబాయిల ననువదించెను.

ఆంధ్రానువాదములు :

(1) శ్రీ ఆకిలి శ్రీరామశర్మ: వీరు ఉమరుఖయాము రుబాయిలను 'సురాలయ'మను పేర సంస్కృతీకరించిన యాంధ్రులు.

(2) శ్రీ ఆదిభట్ల నారాయణదాసు : ఉమరు ఖయామునకు శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారి యనువాదము తెలుగురచనలలో తలమానికము వంటిది మూలమును సాకల్యముగా జదివి, భావము నర్థముజేసికొని, చేయబడిన యనువాదమిది విజయనగర మహారాణి శ్రీమతి లలితాకుమారి ప్రోత్సాహ బలముతో దాసుగారీ మహాకార్యమునకు పూనుకొనిరి. శ్రీ దాసు వేదాంతి; పండితుడు. వీరు గీర్వాణ దేశ్యాంధ్రానువాదమును గావించిరి. వీరు ఫిట్జురాల్డు ఆంగ్లానువాదము ననుసరించినారు. పర్షియనుమూలమునకు సంస్కృతములో గీతిలోను, అచ్చతెలుగులో భుజంగగీతిలోను; ఫిట్జురాల్డు ఆంగ్లానువాదమును తెలుగులో కందములోను, సంస్కృతములో అనుష్టుపులోను జేసిరి. అనగా ఒక్కొక్క రుబాయికి నాలు గనువాదముల నిచ్చిరి. అనువాదము నీ క్రింది కొలుపుతో ప్రారంభించిరి.

యామా హోషి బేచహోర్ దహాన్
హేమాతః సంస్తవామహే త్వాం దుర్గే!
(Oh, my noble goddess) ఓ మై నోబుల్ గాడెస్
మాహిమ్రదను కనికరించు – మా యిలువేల్పా!

శ్రీ దాసు అచ్చతెనుగులో వాడిన మారు మూలపదములకు వివరణ మిచ్చినారు. ఉమరు ఖయాము పద్యముల నుడుల వివరణ (191 నుండి 322) పేజీలలో నిచ్చినారు. రాధాకృష్ణ పండితులు దాసుగారి మహత్తర కృషిని వేనోళ్ల కొనియాడినారు.

"I have glanced through Mr. A. Narayanadas' Telugu and Sanskrit Translations of Omar Khaiyam" and was greatly struck by his varied talents, remarkable linguistic equipment and technical power of versification." బార్డ్వెల్ దొర 1939 ఫిబ్రవరి 2 వ తేది వ్రాసిన లేఖలో నోబెలు బహుమానమును బొందుటకు దాసుగారు అర్హులని వ్రాసినాడు.

లోక ప్రసిద్ధమైన ఉమరు రుబాయి అనువాదమునిట పొందుపఱచుచున్నాడను.

'తంగీ ఈ మై లాల్ ఖాహమ్ వాదివానీ
సద్దీ రమాకీ బాయద్ వానస్ఫీ నాని
వాంగహ్ మన్ వా తూనిషస్తే దర్ వీరానీ
కుష్తర్ బూద్ అజ్ మమ్లుకటి సుల్తానీ॥

Here with a loaf of Bread beneath
the Bough,
A Flask of wine: a Book of Verse
and Thou

Besides me singing in the wilderness—
And wilderness is paradise enow!
(ఫిట్జురాల్డు)

మూలానువాదము : సంస్కృతము

ఇక్షుచ్ఛాయే కదుష్ణాన్న
మభీష్టం మధు పుస్తకమ్ ।
త్వమత్ర దిగాయన్తీ
నూనం స్వర్గాయతే మహీ ॥

ఫిట్జురాల్డు అనువాదమున కనువాదము

గీతిః : అరుణాసవమపికాంక్షే
మహాకవి కృతాని చాటు కావ్యాని
అర్ధగ్రాస మవశ్యం
ప్రోత్సహితాం మామకాంత్య నిశ్వసితమ్
అప్యనవరత మహం త్వం
పరిరభ్య పరస్పరం వసేవ రహః ।
శతశతకోటి గుణం స్యా
దిదం వనం చక్రవర్తినః సౌధాత్ ॥

మూలానువాదము : అచ్చతెనుగు

పచ్చిక బీడచోట
న్మచ్చికతో నీవు కొలంది- మైమఱపున నె
ల్గిచ్చిన పాటలం గుల్కుట
నెచ్చెలి మన కాఱుబతుకు-నే మెచ్చందగున్ ॥

ఫిట్జురాల్డు అనువాదమున కనువాదము :

కోరుకొన్న కెంపు కోపు గంగాళముల్
మాటలల్లువాని తేటవ్రాత
యావు నేను వేడ్క నెనయం గల్గినపాడు
తోడ నీడు కాదు దొరలమేడ.

ఇటీవల రాబర్టు గ్రీవ్స్ జేసిన యనువాద మిది:

Should our day's portion be one mancel loaf,
A haunch of mutton and a gourd of wine,
Set for us two alone on the wide plain
No Sultan's bounty could evoke such joy.

శ్రీ 'బచ్చను' చేసిన హిందీ అనువాద మిది :

ఘనీ సిర్‌వర్ తరువర్ కీ డాల్
హరీ పాంవోం కే నీచే ఘాస్
బగల్ మే మధుమదిరాకా పాత్ర్
సామనే రోటీ కే దో గ్రాస్
సరసకవితా కీ పుస్తక్ హాథ్
ఔర్ సబకే ఊపర్ తుమ్ ప్రాణ్
గారహీ ఛేడ్ సురీలీతాన్,
ముఝేలు అబ్ మరు, నందన్ ఉద్యాన్ !

శ్రీ ఉమరు ఆలీషా :

పారసీకానువాదములనుబట్టి చేసిన కృతులలో బరువునుబట్టి వీరి కావ్యము పెద్దది. వీరు మహమ్మదీయులు. అయినను ఆంధ్రభాష సరసము జేసికొనిరి; మాధురీమహిమ ననుభవించిరి; కావ్య కుసుమములను గుచ్చి ఆంధ్రభారతి కంఠమున హారము నందగింపజేసిరి. వీరు పీఠికాపురవాసులు. నానావిధ కావ్య ప్రక్రియలలో రచనలు గావించి పేరొందినవారు. వీరు హిందవా మహమ్మదీయ మైత్రికి దోడ్పడిన మనీషి. వీరు కురాను ననువదించిరి. మహమ్మదీయ చరిత్రను వ్రాసిరి; సూఫీ వేదాంత ధర్మమును గుఱించి యొక గ్రంథమును వ్రాసిరి.

శ్రీ కనకమేడల వేంకటేశ్వరరావు : వీరు ఆంగ్లమూలము నాధారముగా గొని ఉమరు ఖయ్యాము రుబాయిలను పాటలలో వ్రాసిరి.

శ్రీ చిలుకూరి నారాయణరావు : మూల కావ్యము నాధారముగా గొని యనువదించినారు.

శ్రీ కాడూరి గోపాలరావు 'మధుశాల' యను కావ్యమును రచించిరి.

శ్రీ దువ్వూరి రామిరెడ్డి : విరచితమగు 'పానశాల'కు వచ్చిన పేరుప్రతిష్ఠలింకే యనువాదమునకు రాలేదు. వీరు సంస్కృత, ఆంగ్ల, పారసీ

భాషలలో గూడ పండితులు. తెలుగులో సరస మధుర కవులు. శ్రీ రెడ్డిగారు పారసీభాష నధ్యయన మొనరించి కావ్యానువాదమును గావించినారు. శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి వీరి వ్యక్తిత్వమును గురించి యిట్లు వ్రాసిరి: 'రామిరెడ్డిగారు కాకలుతీరిన వేదాంతికాదు వీరి తాత్త్వికచింతనలో నిరంజనత్వమునకంటె వేదనయే యెక్కువ. వీరి స్వభావము కుసుమకోమలమైనా, అనుభవము కష్టకంటకితమైనది. జీవితాసవము ఈయనకు తృప్తి దీరునట్లు అందలేదు. ఉమరుఖయ్యామువలెనే రామిరెడ్డిగారు విజ్ఞానమందున్నూ, సౌందర్యమునందున్నూ మమత గలవారు. ఉమరుఖయ్యాము సుందరభావములు అతని మేధాతర్కమువల్ల వాడిమై చదువరుల హృదయాలకు చుర్రుమని తాకుతాయి. జీవితకకచపు పలుగాటులు ఖయ్యామునువలెనే రామిరెడ్డిగారిని హింస పెట్టినవి. ఆయన గొంతు కోయిలగొంతు. పారసికన్న ప్రశావ్యమయి పల్లవకోమలమైన సుధారసం బూరెడు తెనుంగు నుడిలో ఖయ్యాము భావములను వీరి పానశాలగా కూర్చినారు. ఎందరేనా వ్రాసినారు, రుబాయిలను తెలుగులో. రామిరెడ్డిగారి రచనా మాధుర్యము మాత్రము తక్కిన రచనలలో లేదు. కారణము రామిరెడ్డిగారు స్వంతముగా పలికినట్లే వ్రాయడమూ, వారి కవితాకన్య విసర్గగానముతో అలంకారాల నినాదాలు పొడమై, వినబడకపోవడము. రామిరెడ్డిగారి ప్రకృతి సౌందర్య దాహమునకు ఖయ్యాము రసవాహిని సంపూర్ణ సంజీవనియైనది. వారి పానశాల తెలుగు రసికుల పానశాల.'

ఉదాహరణమునకు :

> ఎవ్వడు తప్పుసేయడిల
> నెట్టుల జీవిత సాగుసేయడేన్
> అప్పలి పాపి వీడనుచు
> నక్రమశిక్ష విధింతు వయ్యొ యీా
> రవ్వయు రచ్చ యేల యప
> రాధుల మిద్దర వఔట నీకు నా
> కెవ్విధమైన భేదము ర
> రహించున కాస్త వచింపు విశ్వరా!

శ్రీ నారపరెడి రామిరెడ్డి : మధువనము అను కావ్యమును రచించినారు. హిందీ భాషలో 'బచ్చన్' కవి వ్రాసిన మధుశాలకిది యనువాదము.

శ్రీ బూర్గుల రామకృష్ణరావు : పారసీ వాఙ్మయ సాగరమును మథించినవారు. బొంబాయిలో ఎల్. ఎల్. బి. పట్టమును జదువుచు 'అంజమన్ ఇస్లామియా' హైస్కూలులో ఉపాధ్యాయులుగా బని చేయుచున్న దినములలో రుబాయి లనువదించినారు. 1928 నాటికి శ్రీ రామిరెడ్డి, శ్రీ రాయప్రోలు యనువాదములు వెల్వడినవి. శ్రీ రామకృష్ణరావు ఉమరు రుబాయిలను పెక్కింటి ననువదించి వానితో బాటు కవిజీవితమును జోడించి రెండు వ్యాసములను 'సుజాత' పత్రికలలో 1927 లో ప్రకటించిరి. ఉమరు ఖయ్యాము హృదయమును విప్పిజెప్పిన మధుర ఖండకృతీ యనువాద కృతులు.

ఉదాహరణమునకు :

> ధర నపరాధ మెన్నడును
> తప్పియె చేయని వాడెవండు? ఆ
> నరుడెటు లిజ్జగంబున మ
> నంగలిగెన్ దురితంబు జేయకే
> దురితము లేనొనర్చెదను
> దుష్టఫలంబుల నిత్తువీవు శ్రీ
> హరీ మరి భేదమున్న నిను
> మంత వచింపుము నీకు నాకునున్.

> సరసుడు మిత్రు డిష్టుడును
> సన్నిహితుం డొకరుండు లేక యొం
> టరిగను భూమి గర్భమున
> డాగి పరుండెద వెన్నియేండ్లు నీ
> ధురసము ద్రావు మింపుగ వ
> ధూమణి తెల్పకు మీ రహస్య మె
> వ్వరికిని విచ్చబోదికను
> వాడిన పుష్పమదెన్నినాళ్లకున్.'

శ్రీ మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి కవిత్వము అతులితమాధురీమహిమ గలదని పిల్లలమర్రి

వారి యభిప్రాయము. ఈయన రసపిపాసి. ఉమరు ఖయ్యాములోని కొన్నిఘట్టములను స్వీకరించి రమణీయముగా బరివర్తించినారు. రుబాయిల సారమును గ్రహించి తెలుగున క్రొత్త వెలయించిన పద్యము లివి యని కాటూరివారి యభిప్రాయము.

ఉదాహరణమునకు :

పడిసిన యట్టి యీ యొడలు
ప్రాతవడెన్, గడుగ్రొత్త క్రొత్తదౌ
నొడలికి సంబరాలు పడు
చున్నది లోపలి యాత్మ, ఉన్న యీ
తొడుగిది గూడ నాశమయి
తోడుగ నేనును మాయమౌదునో
కడకేది ఖాయమో? ఉమరు
ఖయ్యము కెవ్వ డెఱుంగ జెప్పెడిన్.

కాబట్టి కవి ద్రాక్షారస మారగించుటకు బిలుచుచున్నాడు —

తలపై నొక్కొక పూవె రాలిపడు చుండన్
బైడి లేయెండ చు
క్కల నెమ్మేనుల గమ్మతెమ్మెరల మొల్కల్
నీటి పన్నీటి చు
క్కల జిల్కన్ సరసీతటి
న్వకుళవృక్షచ్ఛాయ లోగెంపుజా
యల ద్రాక్షారసమారగింతము
వయస్యా! భుక్తశేషమ్ముగన్.

శ్రీ మేకా రంగయ్యప్పారావు : 'రుబాయతు' పేర కావ్యమును రచించినారు. 'మహిళా పద్యములలో మహానందమును జూచి మహాజనమునకు జూపెట్టిన పారసీ కవి ఉమరుఖయ్యాము మధుర ఖండికలకు మధురానందము.'

శ్రీరామచంద్ర అప్పారావు : 'అమర' కావ్యమను పేర ఉమరుకావ్యము రుబాయి లనువదించినారు. వీరు విశ్వవేదనతో వియ్యమందినారు. విషాదచ్ఛాయల నలవఱుచుకొనినారు. అందువలన వీరిరచన 'అమర' కావ్యమయినది.

శ్రీ స్వామి శివశంకరశాస్త్రి: వీరు కాల ప్రభావమును గమనించి 'ఉమరు' రుబాయిల ననువదించినారు. ఈ పద్యములు 'కావ్యావళి' ద్వితీయ కదంబమునందు ప్రచురింపబడినవి.

'దైవ భక్తి వాదములను ధర్మవిదులతో
చేసి చేసి విసిగిపోతి చిన్నతనములో
తాళపుజెవి చిక్కలేదు ద్వారసీమకు
తెలియదాయె నేమి కలదొ? తెరమరంగున
స్వర్గవాది కోవిదులకు సాధుజనులకు
సలాంచేసి నమ్మకమ్ము సాగదోలితిన్.
స్థిరముకాదు జీవితమని తెలిసిపోయెను
విరి నశించు శాశ్వతముగ వికసమ్ముతో
పగలు రాత్రి కవాటాల ప్రాత యింటిలో
ఒకరి వెనుక నొకరు రాజు లుండిపోయిరే''

కాని యనువాదము పూర్తి జేయకుండిరి. కారణము తెలియదు.

శ్రీస్ఫూర్తి శ్రీ : 'మధుపాలిక' పేర ఉమరు రుబాయి లనువదించినారు. కావ్యపరిణామము 249 పద్యములు. ఈ కావ్యము స్వామి గోవింద తీర్థ సంకలించి యాంగ్లములోనికి గూడ ననువదించిన 'The nector of Grace' అను గ్రంథమున కనువాదము. 'దానియందు వెయ్యి రుబాయిలకు పైబడి యున్నవి విమర్శనాత్మకమయిన పెద్ద పీఠిక యున్నది. అందలి కొన్ని పద్యములనుమాత్ర మేరుకొని, కొన్ని యితర సంపుటములనుండికూడ గొన్నింటి నెన్నుకొని యనువాదము చేసితిని. ఈ యనువాద విషయమున నాకాదర్శముగా నిల్చినవారు భర్తృహరి సుభాషితముల ననువదించిన ఏనుగు లక్ష్మణకవి; కృష్ణకర్ణామృతము ననువదించిన వెలగపూడి వెంగన. మూలపద్యము అక్షరక్రమములో నుండును. నేను వానిని విషయానుగుణముగా విభాగించి వేర్వేరు శీర్షికలుంచితి'నని గ్రంథకర్త పేర్కొనిరి. మధుపాలికలో జిగిబిగి తక్కువ. పాఠకులను బారవశ్యులజేయు శక్తి లేకపోయినను సంతోషపెట్టగల రచన.

స్ఫూర్తిశ్రీగారి పద్యమొకటి తిలకింపుడు:

'రేలు బవళ్లు గళ్ల నమ
రించిన యూ చతురంగపాళి పై
లీలగు బొవులట్లు కద
లింపగ నా విధి మానవాళిచే
వీలునుబట్టి నెట్టుకొని
వియ్యముల్తై కవగూడి యంతలో
జాలి దొలంగి చంపుకొని
సందుకముందున విశ్రమించెడిన్'


శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి: పిఠాపుర సంస్థానముతో మొట్టమొదట సన్నిహిత సంబంధము గలవారు. జీవితమునందు భోగము నలవరచుకొనిన రోజులలో ఉమరుఖయాము కవితవైపు దృష్టి మరల్చినారు. శ్రీ వేంకటరత్నమునాయుడుగారి ప్రియ శిష్యులు. వీరితో సంఘసంస్కరణాభిలాష పెంపొందినది. కవి జీవితములో అతితీవ్రవేదన, ఆవేశమును గల్గించు అనుభవములను పొందినారు. ఉమరుఖయాము వ్యక్తిత్వ మిట్టిదే గేయములుగా ఉమరు రుబాయిల ననువదించినారు. ఉర్దూ పదముల నిష్టము వచ్చినట్లు వాడినారు:

'రావె సాకీ, సాకీ, రాగవీధుల నడచి
కడచి చలివేళపొలిమేర ఆమని పొడిచె!

రాగ బుల్‌బుల్ గొంతు మ్రోగించుబాకా,
సోగ విరితీగ తెగ తూగించుజూకా;
జాగా గులాబి పొద నూగును బులాకీ
ఆగకిక సాకీ....................

తళుకు జల్తార్ బుటా అల్లిన
నీల వలయ విమ్మా గుడారం
చాల సుఖద విమ్మా బిడారం
పరం అపరం తెలియజాలం
ప్రస్తుతమ్మిటనే బిచానా,
ఇంతలో ఎటకో రవానా
వౌలసరీ, జాయీ, గులాబీ
మేల్‌జుహీ, చంపా, చమేలీ
మనకు చుట్టాలీ హవేలీ!'

ఉమరుఖయాము రుబాయి సాహిత్య ప్రభావ మధికముగా తెలుగు కవులపై బడినది. ఈ ప్రయత్నము జాతీయ సమైక్యభావమునకు దోడ్పడును. పరస్పరాదానప్రదానమువలన భావసమైక్యము సిద్ధించును.



మల్లెపువ్వా!

శ్రీ పి. జాఫర్ అలీఖాన్

మల్లెపువ్వంటే నాకు మహాయిష్టం
ఎందువల్ల?

కల్లకపటంలేని దాని వికస్వర దరహాసం
తెల్లనైనదాని నిష్కల్మష హృదయం
చల్లని దాని మధురమంజుల సౌరభ లహరి
ఎల్లకాలం నా యుల్లంలో ముద్రవేసింది.

మల్లెపువ్వంటే నాకు మహాయిష్టం
ఎందువల్ల?

అది కన్నెపిల్ల నలరిస్తుందని కాదు
తుమ్మెదరాయుని కవ్విస్తుందనికాదు
యువకహృదయాన్ని కలవరపరుస్తుందని కాదు
మచ్చలేని దాని ప్రకృతి సౌందర్యం చూసి.

మల్లెపువ్వంటే నాకు మహాయిష్టం
ఎందువల్ల?

అది పువ్వే, కానీ దానివెనుక ముళ్ళులేవు
అది నవ్వే, కానీ దానివెనుక కుళ్ళులేదు
అది తెలుపే, కానీ రంగుల్ని మార్చదు
అది వలపే, కానీ హంగుల్ని వీడదు.

మల్లెపువ్వంటే నాకు మహాయిష్టం
ఎందువల్ల?

అది అందమున్నా చిందులు త్రొక్కదు
డెంటం లేకున్నా నవనీత సమం.

ఆకర్షణవున్నా గంతులు వేయదు
ఆకళింపు లేకున్నా ఆత్మీయత తొణికిస్తుంది.

మల్లెపువ్వంటే నాకు మహాయిష్టం
ఎందువల్ల?

అది అందమైనదేకానీ కృత్రిమపు టందం కాదది
అది నందనవనానికే పరిమితంకాదుకానీ ఆనందాన్నిస్తుంది
అది తన్మయత్వాన్ని కల్గిస్తుంది, తాదాత్మ్యాన్ని పొందుతుంది
అది తీయని తలపులు నింపుతుంది, తియ్యదనాన్నిస్తుంది.

మల్లెపువ్వంటే నాకు మహాయిష్టం
ఎందువల్ల?

అది ప్రకృతి సృష్టియైనా ప్రకృతికే ఆకృతి నిస్తుంది
నా మనఃప్రవృత్తికి పరిధిలేని వృత్తాన్నిస్తుంది
ఈ కృతకజగత్తుకు క్రొత్త దనా న్నాపాదిస్తుంది
మృత హృదయాలకు అమృతధారను చిలికిస్తుంది.

అందుకే—

అది నన్నెపుడు చూసినా పలకరిస్తుంది, పులకరింపజేస్తుంది,
పులకరించిన నా హృదిలో తొలకరి చినుకులను చిలకరింపజేస్తుంది;
నవ్వుతుంది, నవ్విస్తుంది !
నవ్వే నా హృదిలో తనూ నవ్వుతూ పువ్వెత్తున పొంగిపోతుంది.

అందుకే—

అది పూసేకాలంలో ప్రతిరోజూ దానివద్దకు పోతాను
అదీ నాకోసం స్నిగ్ధకాంతులు చిమ్మే చూపులతో
ఎదురుచూస్తూ వుంటుంది.
అందుకే మా మధ్యఅంతగాఢ అన్యోన్యానురాగం
పరస్పర దర్శనారాటం

అందుకే మల్లెపువ్వంటే నా కతియిష్టం
అతివలకు కూడా లేనంత యిష్టం
మితిమీరిన ఆప్యాయత.

———

'నల్లగొండ కవులు - కొన్ని చాటువులు'

శ్రీ రంగాచార్య

విభిన్న సారస్వతశాఖలలో చాటువులకు విలక్షణమైన స్థానము - ప్రత్యేక గౌరవాదరములును నున్నవి! గ్రంథములు లభ్యముగాక కవి ప్రతిభను వివరించుటకును, ఆనాటి దేశకాలపరిస్థితులను అవగాహన చేసుకొనుటకును ఈ చాటువులు ఎంతగానో ఉపకరించును. ఆశుధారాకవిత్వాడంబరప్రతిభ యున్న చాటువులు మరింతగా శోభించును. అల్లసాని పెద్దన 'పూత మెఱుంగులున్' భట్టుమూర్తి 'లొట్ట యిదేటి మాట -' మొదలగునవి యిందుకు ప్రబలోదాహరణలు! ఆధునిక యుగమున — శిష్ట్లకృష్ణమూర్తిగారు — తిరుపతి వెంకటకవులు నిట్టి రచనలయందు ప్రథమ తాంబూలమందినవారు.

చాటువులు, సాధారణముగా ముక్తకములు· ఏ పద్యమునకు ఆ పద్యమే ఒక స్వతంత్రతా కావ్య రూపమును సంతరించుకొనునట్టివి. అట్లుగానిచో 'అమరుక కవేః ఏకః శ్లోకః ప్రబంధ శతాయతే' అను నానుడి కలిగెడిదా? ఈ చాటువులలో హాస్యము, శృంగారము, రౌద్రము మొదలగునవియేగాక, శాపానుగ్రహత్వములును కలుగజేయునవిగా నుండును. వీని నన్నింటినిబట్టిచూచిన ప్రాచీనకవుల కవితా స్రవంతి కావ్యరూపమునవేగాక చాటుధారారూపముగా నెంత ప్రసిద్ధినహించెనో సువ్యక్తమగుచున్నది. కొందరు కవులు తిట్టుటలోనేగాక చాటు రచనయందును దిట్టల మనిపించుకొనినారు. 'విపుల చాటూక్తి నిర్నిద్ర వీరభద్ర' కవి గండుగదా!

చాటువులు - ఆపాతమధురమై — ఆలోచనామృతములై హృదయాహ్లాదకత్వముతోబాటు హృదయ రంజకత్వమును కలిగించును. ఇవి అచ్చున కెక్కకపోయినను లోకుల నాల్కలలో తాండవమాడుట మనకు విచిత్రపూర్వమైన విషయము. మనదేశమున అనేక ప్రాంతములలో అనేకవిధములైన చాటువులు నేటికిని వృద్ధుల జిహ్వాగ్రముల తాండవమాడుచున్నవి.

ఇట్టి చాటువుల విలువను గుర్తించి ప్రప్రథమముగా 'చాటు పద్య మణిమంజరి' యనుపేర గ్రంథ రూపముగా సంతరించిన కీర్తి, ప్రాతఃస్మరణీయులు— సాహిత్యలోకప్రభాకరులగు వేటూరి ప్రభాకరశాస్త్రి గారిది. అనంతరము - సుప్రసిద్ధులు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి 'చాటుపద్య రత్నాకరము' దీనితో నిలువకలిగినది. ఈ శాఖయందింత యభిమానముగా పట్టుదలతో కృషియొనర్చిన ఆ యిరువురు మహనీయుల కృతజ్ఞతాపాత్రులు. కాని యిట్టి పని బహువిధ శ్రమైకసాధ్యము. ఒక్కరిచేతిమీదుగా జరుగుట దుస్తరము. ఇంకను చాటు పద్యములు చాలా యున్నవి. వీని నన్నింటిని సేకరించి ప్రచురించుట సాహిత్య సంస్థల భారమై యున్నది. ముఖ్యముగా తెలంగాణా ప్రాంతమున చాటువులు హెచ్చుగా నున్నవి. ఈ ప్రాంతము తాళీదళములవలెనే చాటువులును మరుగుపడనట్లు శ్రద్ధవహించుట ఎంతేని యవసరము.

కొంత కాలమునుండి 'నల్లగొండ జిల్లాలోని కవుల'ను గూర్చిన విషయ సేకరణలోనున్న నేను. మధ్య మధ్య వారి రచనలను గూర్చియు—కృతి విశేషములను గూర్చియు 'భారతి'ద్వారా తెలియపరచుచుంటిని. పై విషయ సేకరణ సందర్భమున లభించినవి కొన్ని చాటువులు. వానిలో కొన్నిటిని మాత్రము ఈ వ్యాసముఖమున తెలుపుచున్నాను. (నా వద్ద గలవి సుమారు 200 చాటువులు). ఇందు చాటువులు—వాని సందర్భము—కవి పరిచయము చేయుచున్నాను

1. ఆసూరి మరింగంటి వెంకట నరసింహాచార్యులు:—

ఈ కవి సుప్రసిద్ధమైన కవి పండితుల కాలవాలమైన మరింగంటి వంశోద్భవుఁడు. వశౌద్గల్యగోత్రుఁడు భావనాచార్య పుత్రుఁడు 16 శతాబ్ది చివరి భాగములో నున్నాఁడు. ఈయన 'తాలాంకనందనీపరిణయము' అను ఆరాశ్వాసముల ప్రౌఢప్రబంధమును 'ఇందిరాల భాగవతము' అను యక్షగానమును రచించినాఁడు. మొదటి గ్రంథ మముద్రితము. రెండవది అలభ్యము తాలాంక నందనీ పరిణయము కొంత అసమగ్రముగానున్న ప్రతి మావద్ద నున్నది ఈయన ప్రౌఢకవి. సరస వాగ్వైఖరీవిడంబను డు. చాటువు లితనివి చాలా యుండెనట - కాని రెండే లభించినవి. అందొకటి ఆయన అంత్యదశలో సంసారబాధను గూర్చి —

శా॥ పెద్దల్లుండొక నల్లద్రాచు,
ప్రియవరౌ పెండ్లాము నా పాలికే
బిద్దాఘోరయె, కన్న తల్లెపుడు
నా చేటే నిరీక్షించు, బే
హద్దౌకాపుర, మగ్ర శిష్య జన మ
ర్థాంధుల్, దయాహీను లే
ప్రొద్దే తుచ్ఛుల గూడియున్న సుతుఁడ
ప్పప్పప్పు చింతింపఁ డ
స్మద్దోషంబుల నెన్నుచు న్వదినె నా
మాటన్న రౌద్రాకృతిన్
హుద్దా హుద్ది పెనంగు, నాత్మసుతుఁడే
యుక్తం బెరుంగండు, నే
నెద్దిం దోచక ప్రొద్దుబోక పొరుగిళ్లే
సొచ్చితే రంకులే
పిద్దంబై పెనురద్ది భాసిలెను, ఛీ! ఛీ!
యిట్టి పాపం బిలన్
గద్దా! శ్రీ కనగంటివాస నను
శీఘ్రంబే మృతుం జేయవే!

అని చెప్పి పరమదించినాఁడట. ఈ కవి యన్నగారు వేంకట రాఘవాచార్యులు. ఈయన సరసకవి. 'కేశవ స్వామి శతకము'ను అంత్యప్రాసతో రచించినాఁడు.[1]

ఈ వెంకటనరసింహాచార్యుల వారొకప్పుడు శిష్యసంచారమై బయలుదేరి వచ్చుచుండగా మార్గ మధ్యమున చోరబాధకు గురియై—తాము పోగొట్టు కొనిన వస్తువులను తెల్పి - దొంగలనంపిన కరణము— సకిలము తిమ్మయను నిందించి—శపించినాడు. ఆ శాప ప్రభావమున తిమ్మయ వంశము సమూలముగా నాశనమైనదట. అంత వాక్ప్రతిభ గలవాఁడు— ఆ పద్యమిది—దీన్ని

సీ॥ శ్రీ నీలగిరి సీమలో నొప్పు కనగంటి
పురము లోపలను కాపురము నొందు
ఘన మరింగంటి భావనగురూత్తము పు
త్రకుఁడ నృసింహాభిధాన కవిని.
యేను సంచారార్థమేగి ద్రవ్యోపార్జ
నంబొనర్చియు మహానంద లీల
మగిడి మా గృహముకై మార్గంబు గొనిరాగ
నిందుర్తి సీమలోనం దనర్చు
పెద్దాపురము జాము ప్రొద్దుండగా వచ్చి
యట నిల్వకను వేగినంతలోన
తద్గ్రామ కరణ మాతత తస్కరోద్యోగి
ఖలుఁడు సకిలము తిమ్మిగాఁడు కలఁడు—
అతఁడు నల్గుర్గు దొంగలంపఁగా వారలు
చామలపలిగుట్ట చాలుగాంచి
వెన్నాడి గనుపెట్టి తిన్నగా మముబట్టి
కన్నులు బిగగట్టి కడకునెట్టి
శుభ్రంబు లరువది, శొంఠి సవ్వాశేరు
నారి కేళంబులు నాల్గు తామ్ర
ఖండముల్ మూటలోఁగల వెన్న ముప్పది—
కుచ్చాలు నొక పెద్ద పచ్చడంబు—
మైసూరుశాలు, రుమాలు, పట్టంచు ధో

1. చూ. నా వ్యాసము. 'మరింగంటి వేంకట రాఘవాచార్యులు — కేశవస్వామి శతకము' 'భారతి' 1966 డిసెంబరు.

వతులు. మేల్కోటధోవతులు రెండు,
షకలాదు నొకటి కప్పు దేవతార్చన పెట్టె
గట్టిన ధసల్ పట్టుధోవతి,
కాళ్ల చెప్పుల జోడు, కావి దుప్పటిజోడు
మంచిచొక్కము పైడి మాసమెత్తు—
గీ॥ ఆసలేకుండ చంద్రలాటీ సమేతు
దోచుకొని పోయిన కిరాతు ధూళిచేతు —
చచ్చువెగ జూతు వానిల్లుచిచ్చుజేతు
మిత్తినెగదోతు పైన బండత్తివేతు—'

ఒక్కచిన్నవస్తువైనా మిగలనట్లు దొంగ లెట్లు గ్రహించిరో—కవియును ప్రతిచిన్నవస్తువును పద్యములో చెప్పినాడు—దీనికి సంబంధించినవే యింకను రెండు పద్యము లుండెడివవి ప్రసిద్ధి — కాని యలభ్యము.[2]

2

సూర్యాపేట తా॥లో 'నరసింహపురము' అనే గ్రామమున్నది కనగల్లునుండి వెళ్లి మరింగంటి వారిలో కొందరచట స్థిరపడినారు. వారిలో మరింగంటి వరదదేశికుల వారొకరు. ఈయననుగూర్చి అంత వివరముగా తెలియలేదు. కాని—నిరాడంబరుండనియు— కాపీన ధారియై నిరంతరము—నృసింహపుర మందలి శ్రీరామాలయములోనే ఉండెడివాడని ప్రతీతి. ఈయన తెలుగురచనలు ఉదాహరింపబోవు చాటువుదప్ప ఏమియు లభింపలేదు సంస్కృతమున మాత్రము— 'శ్రీరామ పాదుకా స్తవము'[3] 'గోదా శతకము'[4] ఈ రెండును చాలా రమణీయమైన రచనలు. ఈ కవి సుమారు 150 సం॥ క్రిందివాడు

ఆయన దేవాలయములో నుండగా నొక దినమున నెవ్వరో వచ్చి (గద్వాల ప్రభువుగారు పంపినదని?) ఈ సమస్య నిచ్చి పూరించుమనిరట— ఆ సమస్య యిది.

'రాజమరాళకుంతలకు
రాజితమత్తగజేంద్ర మధ్యకున్'

అని—

దీనిని వెంబడే యిట్లు పూరించి వారిని పంపించిరట.

'రాజితభాజనంబుగ క
రంబున సంపెగనూనె గొంటివో
రాజముఖీ! యిదేటికి? తి
రంబుగ నంతిపురంబునందు నా
రాజముఖీలలామకు. వి
రాజితధామకు, నైజయాన జి
ద్రాజ మరాళ కుంతలకు
రాజితమత్తగజేంద్ర మధ్యకున్'— అని.

(ఈ చివరి చరణమును— 'రాజమరాళకుంతలకు రా! జితమత్తగజేంద్రమధ్యకున్' అనియును గ్రహింపవచ్చును.) ఈయనవి చమత్కారమైన యీ పూరణదప్ప యింకెట్టి చాటువులు లభింపలేదు.

3

1814–'94 మధ్యకాలములో మిర్యాలగూడెం తాలూకాలోని 'కంపాలపల్లి'యను గ్రామములో కృష్ణభక్తుడగు మహాకవి చిలుమర్తి నరసింహకవి

---

2. నా వ్యాసము. 'తాలాంకనందనీ పరిణయము—ఒక పరిశీలన' (భారతి 1967 డిసెంబరు) దీనిలో కవిని—గ్రంథమును గూర్చి విపులముగా తెల్పితిని.

3. చూ. భారతి 1967 సెప్టెంబరు. దానిలో మరింగంటి అప్పలదేశికులవారి రచనగా శ్రీరామపాదుకాస్తవమును ప్రచురించితినికాని— వరద దేశికులవారు కర్త—అప్పలదేశికులవారు ఆయనగారి గురువు.

4. ఇందులోనివి 17 పద్యములు. వరంగల్లు వైదిక కళాశాలా ప్రిన్స్‌పాల్ - శ్రీమాన్ న. చ. రఘునాథాచార్యులవారను సుప్రసిద్ధ పండితుల వద్ద గలవు. ఇటీవల వరంగల్లులో మిత్రులు డా. సుప్రసన్నాచార్యులవారిద్వారా వానిని చూచుట సంభవించినది.

గారుండేవారు. ఆయన శాపానుగ్రహపటువు. అభినవ వేములవాడ భీమన యని ప్రసిద్ధినందినవాడు— ఆయన భారద్వాజగోత్రుడు. పుల్లనామాత్యపుత్రుడు— 'ఇంద్రనారదసంవాదము' (అలభ్యము), మహాభారతము (తెనుఁగు) 'లక్షణ నవరత్నమాలిక' అను గ్రంథముల రచించినవాఁడు.

ఇంద్రనారదసంవాదము ఇంతవరకు లభింపలేదు. మహాభారతము నాంధ్రీకరించి 'భువనగిరి'లో నొకవైశ్యున కంకిత మిచ్చినాఁడట. (ఇదియును లభించుట లేదు). లక్షణ నవరత్న మాలికలో యనునది— లభించినది 9 సీసమాలికలలో తెనుగు ఛందస్సును లక్ష్య లక్షణ పూర్వకముగా నిందు వివరించినాడు. కవిత్రయము తరువాత మహాభారతమును యథా మూలముగా నాంధ్రీకరించినది శ్రీపాదవారని కొందరి నమ్మిక - కాని దానికి పూర్వమే 2 యథా మూలాంధ్రీ కరణలు వచ్చినవి.

1. చిలుమఱి నరసింహకవి — భారతము.

2. త్యాగరాజ—మొదలి —భారతము.

దీనిలో త్యాగరాజ మొదిలి తమిళుడైనను ఉద్యోగరీత్యా వరంగల్లులో స్థిరపడినవాడు.(1833లో జననం). ఈయన భారతమందలి కొన్నిపద్యాలు 1918 లో 'గ్రంథాలయ సర్వస్వము'లో ప్రచురణ మైనవి. ఏతావతా తెలియునదేమనగా శ్రీపాద, త్యాగరాజ మొదిలికన్నముందే యథామూల భారతాంధ్రీకరణ మొనర్చినది, తెలంగాణకవియగు చిలుమర్రి నారసింహ కవియని. ఈయన చాటువులను కొన్నింటిని మా నాయనగారు బదిలపరచిరి. ససందర్భముగా వాని నిట పొందుపఱచుచున్నాను

నల్లగొండలో నేటికిని నీటియెద్దడి అపరిమితము. కొద్దిదూరములో 'కొండాయ చెలిమ' అను బావి గలదు. దాని నీటినే అచటి ప్రజలు నేటికిని త్రాగుట కుపయోగింతురు. ఆ 'కొండయ చెలిమ'ను గూర్చి — నరసింహకవిగారి రచనలు.

పూర్వ దిశాధినాథ! యెటుబోయెదవో!
యెద నల్లగొండకా
యుర్వి ధరంబు నేమి పనికో!
విను నారద! దావపావకా
ఖర్వవిదాహదగ్ధతరుతండము
తాండవ మంకురింప పైఁ
గుర్వగ మేఘపంక్తులను కొండయ
చెల్మెజలంబు ద్రావగన్

అండజరాజు మున్ను దివి
జాధిపు నా ఘటమున్ హరింప నా
ఖండలుఁ డా ద్విజోత్తముని
గన్గొని మిన్నున దాకనోడి భూ
మండలి నల్లగొండపురి
మాటున నొక్కటి బావి త్రవ్వి న
క్కొండయచెల్మెయ న్నమృత
కుండము నుత్కటకీర్తికాండమున్'

కొండాయ చెలిమె తీర్థము—
యెండిన వృక్షములకెల్ల నిగురుటఁ జేయన్
తిండేల మానవులకును
రెండవ యమృతంబు మాధురీయుక్తంబై

అని కొండయచెలిమపై రమ యమ్మైన పద్యాలు చెప్పినాడు. నేటికిని నల్లగొండప్రాంతమున చాలమంది కీ పద్యములు వచ్చును. ఈ కవి 'సూర్య భగవన్నవరత్నములు' చెప్పిరట. వానిలో మూడు దొరికినవి — 'భారతి'లో ప్రచురించితిని. కీ॥ శే॥ దాశరథి రఘునాథాచార్యులవారు — ఈ కవినిగూర్చి ఒక పద్యము చెప్పిరట - అది అసమగ్రముగా లభించినది. లభించినంతవరకు—ఇది.

'బాలపటాన్వయాబ్ధి సిత
భానుఁడు సింగనమంత్రివర్యుఁడు
ద్వేల........................

---

5. చూ. చిలుమర్తి నరసింహకవి—లక్షణ నవరత్న మాలిక'

'భారతి' 1967 మార్చి, దీనిలో కవిని గూర్చి విపులముగా గలదు.

నరసింహకవిగారిది ఇంకొక పద్యము.

శుభమగు విభజిద్వర స
న్నిభ విక్రమకోటి భానుదీప్త్యంచిత సౌ
రభ లిప్తవక్ష రక్షః
ప్రభువిభవ సమగ్రభంగ పతగతురంగా.

4

కంసాలి సుబ్బకవియను నొకాయన మిర్యాల గూడెం ప్రాంతములో నుండువాఁడట – ఆయన పై నరసింహకవి సమకాలీనులు. ఈయన కొన్ని ప్రబంధములు వ్రాసెనట. ఏవియును లభ్యము గాలేదు. శతకములలో సుప్రసిద్ధమై దృష్టాంతముగానున్న భాస్కర శతకములోని ఒక పద్యము నీతడు సవరించి పూరించెనట. అది యిది.

ఊరకవచ్చు పాటుపడకుండిన
నైన ఫలం బదృష్టమే
పారగ గల్గువానికి ప్ర
యాసము నొందిన దేవదానవుల్
వార లటుండగా నడుమ
వచ్చిన శౌరికి కల్గెగాదె శృం
గారపుఁ బ్రోవు లక్ష్మియును
గౌస్తుభరత్నము రెండు భాస్కరా.

(భాస్కర–17 పద్యము)

'సముద్ర మథన సమయమున శౌరి యెంత శ్రమఁజెందిననోగాని కౌస్తుభము–లక్ష్మి లభించెను గదా! భాస్కర శతకకారుఁడు పాటుపడకుండినను అదృష్టమేపారగ కల్గువానికి ఊరకవచ్చునని దృష్టాంతముగా శౌరి విషయ మొసంగుట సరిగాదు. ఏ విధముగా నుండవలయుననిన–

ఊరకవచ్చు పాటుపడ
కుండినవైన ఫలంబదృష్టమే
పారగ గల్గువానికిఁ బ్ర
యాసము నొందఁ బనేమి 'కానలో
గోరని ఋష్యశృంగుని ద
గుల్కొని కాంత లయోధ్య జేర్ప నీ
రేరుహగంధి శాంత నియ
రే యెసలారగనాఁడు' భాస్కరా

అనిన బాగుగా సమంజసముగా నుండును'– అని సుబ్బకవి దీని నీ విధముగా దిద్దెనట.

ఈయననుగూర్చి—'సుబ్బకవి తిట్టు కంసాలి సుత్తె పెట్టు' అని నానుడి

5

1930 ప్రాంతంలో పరమపదించినకవి గోవర్ధనం వెంకటనరసింహాచార్యులుగారు. ఆయన మిర్యాలగూడెం తా॥ విభురాముపేట వాస్తవ్యుఁడు. బహుగ్రంథ రచయిత – సంస్కృతాంధ్ర పారసీ భాషలయందు కవితానైపుణ్యము కలిగిన వాఁడట— తనను గూర్చి—

'స్వర్ధవధోర్ధ్వరోగ్ర కులిశప్రహరంబు
దొలంగినన్ పయో
వార్ధి తనూజ కేశవుని వక్షము బాసి
తొలంగినన్ తమ
స్వర్ధినభ స[illegible] దరిగి వర్తిలినన్
విభురాముపేట గో
వర్ధన నారసింహ గురువర్యుని
వాక్యము దప్పిపోవునే–'

అని సగంభీరముగా ప్రకటించుకున్నాడు

మన కవులకు కవితావస్తువులలో విలాసము కలిగింపవానిలో నల్లి—నళ్ళములుగూడా పేర్కొనదగినవి.

ఈ నరసింహాచార్యులనుకవి యొకమారు మిర్యాలగూడెం తా॥ కంపసాగరమను గ్రామములో ఒక కరణముగారింట నిదురించెనట – అప్పుడు ఆయన యనుభవించిన నల్లులబాధ యిట్లుండెను

'నరహరి ధాతృవత్సరము
నం దగులొందిన దక్షిణాయనం
బరుదుగ పౌష్యమాసమున

నాదిమ పక్షమునన్ త్రయోదశిన్
సురగురు వాసరంబునను
శుద్ధముహూర్తమునందు సింహసా
గరమున రాత్రివేళను
వికాసమున స్ఫులిజాలవారి మం
దిరమున ఖట్వశయ్యను
మదిని మోదమందుచు నిద్రింపగా
మరిమరి యేమి చెప్పుదును
మత్కుణముల్ చలిచీమ బారులై
పోరిపోరి గుంపులై మరియు
పోకలతో సరియై మహాశరం
పరలయి నిగ్గులై కరవ బాధకు
తాళగలేక వీక ఁం
పరగల రాత్రి బోలె భువి
భాసిలు నా శివరాత్రిబోలె న
బ్బురముగనుండు జాగరణ
బోలె చమత్కృత మత్కుణక్రియల్.'

తరువాత 'ఆకునూరను' గ్రామములోగూడ —

నల్లులు గరచుట పైపై
పెల్లులు రాలుటయు చంటిపిల్లల రోదయున్
బల్లులు పారుట వర్షపు
జల్లులు పత్రశతపురిని స్వాముల యింటన్—

అని పేర్కొన్నాడు.

ఎంతకాలముగనో నావద్దగల చాటుపద్యములలో కొన్నింటినిగూర్చియైనా నేటికి తెల్పగలుగుచున్నందుకుల సంతసించుచున్నాను.



ఆలోచనా స్రవంతి

శ్రీ శివకుమార్

ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని నిర్వచించటం ఎంత కష్టమో కవిత్వాన్ని నిర్వచించటం అంతకన్నా క్లిష్టం. కవిత్వం అతీంద్రియం. అలౌకికం. కవిత్వం పాఠకుని మూర్త ప్రపంచంనుండి అమూర్త ప్రపంచానికి అమూర్తంనుండి అసంవృతికి చేరవేస్తుంది. లోకంలోని వస్తుసముదాయం సుఖమో దుఃఖమో కలిగిస్తుంటే కవిత్వం కేవలం ఆనందాన్ని కలిగిస్తుంది.

మనస్తత్వ శాస్త్రంలోని స్ఫురణ (Intuition) అనేది లౌకికమగు శబ్దాల నాశ్రయించి కవిత్వంగా రూపాంతరీకరణ పొందుతుంది. స్ఫురణకు నిర్వచనం: మనకు తెలిసినంతలో దానికి హేతుభూతమైన మనః ప్రక్రియలేవీ కనిపించకుండా సాధారణంగా కొంచెం ఆవేశంతో మనలో హఠాత్తుగా నేరుగా కలిగే అవగతి లేదా నిర్ణయం. కవిత్వ పరమావధి అందం, ఆనందం. కవిత్వంలో అందం సద్య స్ఫురణోత్పాదితం. కారణం లేకుండా ఉత్పాదితమయ్యే కార్యంలాటిది.

ఒక గీతంలో అర్చి బాల్డ్ మెక్‌లీష్ అంటాడు.

A poem should be wordless
As the flight of birds.

గీతం శబ్ద రహితంగా వుండాలి పక్షులు ఎగురుతున్నట్లు. పద్యగమనాన్ని పక్షులు ఎగరటంతో పోల్చాడు. అనిర్వచనీయతా సూచకం. నిశ్శబ్ద గమనం, లయ అంతర్లీనంగా వున్నాయి. కాలగమనం కూడా నిశ్శబ్దం. సంచలనంలోనే. లయ సంచలనాత్మకం. కవిత్వం స్వతంత్ర సృష్టి. సంకుచిత నియమాలను పటాపంచలు చేస్తుంది. లయాత్మకమైన సౌందర్య సృష్టి కవిత్వమంటాడు ఎడ్గార్ అలెన్ పో. లయరహితమయిన నిశ్శబ్దం, సౌందర్యం నిర్జీవంతో సమానం. లయ అనేది నాట్యభాష. ఉత్తమ కవిత్వంలోని భాషను అభినయంగా చెబుతాడు బ్లాక్‌మూర్. శరీర అవయవాల లయాత్మకమైన కదలికలే భావప్రకటనలు దైవం ఎదుట సంగీత లయతాళ నృత్తవశగతుడైన నటుడు అలౌకికానందాన్ని పొందుతున్నాడు. కవుల స్ఫురణలో లయ అంతర్నిగూఢంగా వుంది.

కవిత్వం మేధాసంబంధికాదు. హృదయసంబంధి. తర్కసంబంధికాదు భావసంబంధి. తర్కం ఎదుటివాడిని చిత్తుచేస్తుందేగాని హృదయాన్ని ఒత్తలేదు. కవిత్వం ప్రియతరవచనాలతో మనస్సును మార్చటమేకాక లోకోత్తరమయిన ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. హృదయాన్ని ఊరిస్తుంది.

కవిత్వం మొదట స్ఫురణరూపంలోవుండి శబ్దసహాయంతో వెలికివచ్చినట్లు కవులు చెప్పిన వాక్కులే ఆధారాలు. పదాలకు ముందుగానే గీతాల స్వరాలు ఉద్భవించేవని రవీంద్రుడు లేఖలలో వుల్లేఖించాడు. స్విన్‌బర్న్‌కవీ అదే అన్నాడు. మేడమ్ బొవరీ నవలారచయిత గస్టావ్ ఫ్లాబర్ట్‌కు కూడా ముందు ధ్వనులరూపంలోవుండి తరువాత మాటలుగా వెలువడేవట. శ్రీ శ్రీ తాను వ్రాసింది తిరిగి చూచుకునే అలవాటు లేదంటాడు. నండూరి సుబ్బారావుగారు తన ప్రతిపాటలోనూ ఏ చరణాలు ముందు వచ్చిందీ ఏవి తరువాత పూర్తి అయిందీ చెబుతూ వుండేవాడట.

వర్డ్స్‌వర్తు శక్తివంతములగు భావాలు

గా పెల్లుబుకుటయే కవిత్వమనుటకు ఆయన అనుభవమే సాక్షి. వాల్మీకికి క్రౌంచపక్షుల వియోగాన్ని చూచి, అప్రయత్నంగా వెలువడిన వాక్యమే శ్లోకమయింది. మధుచ్ఛందుడు అగ్నిని దర్శించి పలికిన పలుకులే గాయత్రిమంత్ర మయినది. ఇంత కన్న ప్రబలనిదర్శన మేం కావాలి?

ఈ స్థితికి చక్కని ఉదాహరణ అమెరికన్ కవి రాబర్ట్ ఫ్రాస్ట్ వ్రాసిన The Span of Life నుండి :

The old dog barks without getting up
I can remember when he was a pup.

ఒక కుక్క జీవితంలోని రెండు భిన్నదశలు. భిన్నకాలాలకు సంబంధించినవి. కుక్క జీవితంలో అసాధ్యమయినా ఫ్రాస్టుపద్యంలో వక్రోక్తిరూపంలో ఒకదానికొకటి ముడివడి ఒక కాలదృశ్యంనుంచి ఇంకొక కాలదృశ్యానికి గంతువేసి ఒప్పించింది. ఇది కవిత్వంలోనే సాధ్యం.

రసోద్రేక పరవశతయే సౌందర్య భావన. సౌందర్యాన్ని దర్శించినపుడు మనకు ఆనందం కలుగుతుంది. ఆ ఆనందంలో ఉపయోగితా దృష్టిలేదు. ఉపయోగితా దృష్టిని కలుగజేయకుండా ఏదైతే ఆనందాన్నే కలుగజేస్తుందో అదే సౌందర్యము అంటాడు రవీంద్రుడు. సౌందర్యం ఎందుకు ఆనందాన్ని కలిగిస్తుందో చెప్పటం అంత తేలికకాదు. భావనాశక్తిగల కవి భావించినపుడు ఏ వస్తువునయినా నీచమైనదిగాని ఉత్కృష్టమైనదిగాని రమ్యమైనదిగాని, అసహ్యమైనదిగాని సుందరరూపంగా అవతరిస్తుంది. ఇలియట్ కవి పెద్దరాళ్ళను (Area Pavements), ఆడెన్ కవి పారిశ్రామిక దృశ్యాలను ఎంతో సౌందర్యమయంగా అభివర్ణిస్తారు. ఒకే గీతంలో విభిన్న దృశ్యాల రూపచిత్రాలు చూపుతూ విషయవైవిధ్యంలో సమైక్యతను సాధించటం ఆధునిక కవుల ప్రత్యేకత. ప్రాచీనులలో ఈ పద్ధతి లేకపోలేదు. ఉపమానాల రూపంలో ఎక్కువగా వుంది. దీన్నే evocative పద్ధతి అన్నారు. టెనిసన్ కవి ఒక గీతంలో ఒడ్డును కొట్టుకొని విరిగిపడే అలలు, చల్లని బూడిదరంగు రాళ్ళు, చెల్లాయితో ఆడుకునే పల్లె పిల్లవాడు, పడవలో పాడుకునే సరంగు చిన్నవాడు నీటిలో నడిచే పెద్ద ఓడలు, హస్తాల అదృశ్య జ్ఞాపకాలు హల్లామ్ మరణంతో కలిగిన దుఃఖం— ఇన్ని దృశ్యాలు చూపిస్తారు. అపహాస్యకవి ఆడెన్ ఒక గీతంలో మేఘాలను తోటలోని సిగరెట్టును Sport Hotel అద్దపు కిటికీని, సంగీతాన్ని, రేడియో పెట్టెను, గర్భంలో పంటగదిని, అందులో ఒకేరకమయిన దుస్తులు ధరించిన జనాన్ని, వైమానికుని, రేడియో సంగీతం వినే కృషీవలుని కన్నులు గట్టినట్టు చిత్రిస్తారు. శ్రీ శ్రీ, తిలక్ కవుల గీతాలలోకూడా ఎన్నెన్నో దృశ్యాల్ని చూపించారు. కళద్వారా విభిన్నదృశ్యాలను సమాహరించటం ఆధునికతయే. మన చక్షురింద్రియాలకు మసకమసకగా కనబడుతున్నట్లున్నాయి ఆ దృశ్యాలు.

కవికి ద్రవణీయదృష్టి వుంటేగాని కావ్యావిర్భూతి జరగదు. సమీక్షకునికి అవసరమే. కవిత్వంలో తర్కానికి తత్వానికి చోటులేదు. కవిత్వం ఆలోచనను రేకెత్తించకూడదు అనుభవాన్ని రేపి ఆనందాన్ని కలిగించాలి. తాత్వికుడు తన భావాలను తర్కరూపంలో మర్చితే, కవి సౌందర్యరూపంలో మలుస్తాడు.

Poetry is an art of language. Philosophy is an art of thought.

శాస్త్రకారులు కవిత్వం వ్రాసి మెప్పించలేరు, ద్రవణీయదృష్టి లేకపోవటంవలననే అనాలి. మహాకవి ఉత్తమతాత్వికుడు కాగలడు తన కావ్యం ద్వారా జీవిత వ్యాఖ్యానం చేస్తాడు.

అందుకే అంటారు : కవితాకన్య పితృస్థానీయుడని శబ్దశాస్త్రవేత్తను చేరదు. సోదరతుల్యుడని తార్కికు నంటదు. (ఛాందసుని) వేదపండితుని చండాలునిగా భావించి సంకోచంతో దూరాన్నుండియే తొలగిపోతుంది. మీమాంసావిశారదుణి నపుంసకుడని

భావించి నిరసించి కావ్యాలంకార విశారదునే ఆదరంతో వరిస్తుందట.

కవిత్వం పఠితకు తన్మయీభావం కలిగించి సంకుచితమైన పరిహద్దుల్ని చెరిపి, భయాన్ని తుడిచి, మనోవికాసాన్ని కల్పించి, దైవత్వంనుంచి దానవత్వం అరకు సానుభూతితో గ్రహింపచేస్తుంది. కవిత్వం వప్పటికప్పుడే ఆనందాన్ని సహృదయునకు అందిస్తుంది.

ఉత్తమ కవిత్వంగాని, నవలగాని చదువు తున్నపుడు బాహ్యప్రపంచాన్నేకాక తన్ను తాను మరచిపోతాడు మనిషి. ఉత్తమకావ్యాన్ని చదివిన పాఠ కుడు వెంటనే ఇంకొకటి స్వీకరించడు. అంత ర్ముఖుడై మధురానుభూతిని పొందుతాడు. ప్రతి వానిలో జ్ఞానరాశి అంతా సుప్తచే తన (Unconsciousness) లో సూక్ష్మరూపంలో, చీక టిలో వున్నట్టుంది, ఉత్తమ కవిత్వం చదివే పఠిత 'నా భావాలనే ఎంత అందంగా చెప్పా'డనుకుంటాడు. ఇట భట్టతౌతుని పలుకు జ్ఞప్తికి వస్తున్నది.

ఆలంకారిక పరిధి అతినవ్యత్వానికి తావీయదు. అతి నవ్యత్వంతోపాటు ఆలంకారిక పరిధికూడా విశా లమూ, విస్తృతమూ కావాల్సిందే. ఆలంకారిక పరిధి చుట్టూ తిరగటం కవియొక్క పనిగాదు కవి స్వేచ్ఛాప్రియుడు. అలంకారశాస్త్రం అడ్డురాదు. వ్యాకరణాలు బంధించవు. ఉత్తమ కవి వెనుక అలం కార శాస్త్రాదులు అనుసరిస్తాయి. కవి లక్ష్యభ్రష్టుడు కారాదు.

ప్రజాకవిత్వమన్న పేరుతో పండిత కవిత్వాన్ని వ్రాసిన కవులు కొల్లలు. వారికి విప్లవం కావాలి. లేకపోతే రచన కాదు వారి దృష్టిలో. నిజమయిన శాంతి, సౌందర్యం, అగ్ని, అమృతం, ఆనందం— యివన్నీ విప్లవాత్మకమయిన పరిణామ ఫలాలే నంటారు ప్రజాకవిత్వ విమర్శకులు. పూర్వం యివన్నీ లేవని వారి భావం. వారితోనే పుట్టినాయని వారి నమ్మకం. ఇట్టి కవిత్వాలు తాత్కాలికోద్రే కాన్ని, వెర్రిమొర్రి ప్రలాపాలను వ్యక్తపరుస్తాయే గాని కాల ప్రవాహాన్ని ఎదురించి నిలవలేవు. చదువ రిని పలకరించి సాగిపోతాయి. కాళిదాసు, వాల్మీకి, డాంటే, షేక్స్పియరు ఈనాటి వరకూ సజీవులుగా వుంటానికి కారణమేమిటో వారు గుర్తించరు. సమగ్ర మయిన జీవిత దృక్పథంగాని, నిర్దిష్ట లక్ష్యంగాని జీవిత పరమార్థంగాని, జీవిత అంతరార్థంగాని వున్నట్టు కనిపించదు. ఇట్టి కవితోద్యమాలను Passing Phases గా అభివర్ణించవచ్చు. జాతి వెన్నెముక విరిగిపోయింది. గతితార్కిక భౌతిక వాదపు పడికట్టురాళ్లతో కావ్యాలను తూచి విలువ కడతారు. అందకపోతే చెత్త అంటారు తేలిగ్గా. సాహిత్యమంతా ఆ మూసలోనే పోయా లంటారు. ఇట్టి సంకుచితదృక్పథాన్ని ఛేదించుటకు విమర్శకులు సాహసించక తప్పదు. అంధవిశ్వాసాలను ఖండించక తప్పదు.

*　*　*

రసానందం బ్రహ్మానందంకన్న గొప్పది. బ్రహ్మానందం వైయక్తికానందాన్ని కలిగిస్తుంటే రసానందం సామూహికానందాన్ని కలిగిస్తుంది. బ్రహ్మానందం లక్ష్యం వ్యక్తిశ్రేయస్సు (ముక్తి), రసానందం లక్ష్యం విశ్వశ్రేయస్సు. కవిత్వంలో భౌతిక, ఆధ్యాత్మిక శూన్యవాదాలు సంలీన మవు తున్నాయి. చిరంతనమయిన సత్యం వున్నంతవరకూ ఏ కవిత్వమైనా ప్రయోజనీయమే. ఆధునిక కవి ఆర్చిబాల్డ్ మెక్‌లీష్ పద్యంతో ముగిస్తాను.

A Poem should be motionless
As the moon climbs
Leaving, as the moon releases
Twig by twig the moon entangled trees
Leaving as the moon behind the winter leaves
Memory by memory the mind
A Poem should be motionless in time
As the moon climbs.

అవతారము

శ్రీ మిరియాల రామకృష్ణ

ఆదిశిశువు మఱ్ఱియాకుపై పవళించి
కనులు విప్పనినాటి కాలమందు
శారద కచ్ఛపీ షడ్జ స్వరాల ర
చించి వేదముల విన్పించుముందు
ఈ యఖిలాండ మూయెల లూగు వయసున
పురశాసనాదుల పురుటిముందు
మదనుని రాచిల్క మధువాస ఫలముల
రుచిపచు లింక నెఱుంగనపుడు

ఒక ప్రజాతంతు విలమీద నూగ నపుడు
ఆకసమునందు సూర్యసుధాకరులును
కనులు నులుముకోనప్పు డొక్కపుడు జగము
ధ్వాంతదంష్ట్రావిమూర్ణితాంతరము జడము !

చుక్కలు లేవు; మేఘములు సూర్యకరాళకళాకలాప స
మ్యక్కరకార్శ్యమానజలహారులు లేవు; సరస్సరస్వతీ
చిక్కణ సుందరాకృతి విశిష్ట వసుంధర కానరాదు; తా
నొక్కటి చిక్కుచీకటి మహోగ్రరవంబున నార్చు నెల్లెడన్.

ప్రణవఘంటికలాగి యురుల జడిపించాడు
ఓంకారశంఖమ్ము నూది వినిపించాడు
తిమిరపర్వతము ఱెక్కల నూడగొట్టాడు
ఏ మహాత్ముడొకాని వెలుతురులు తెచ్చాడు !

ఒక ఘంటాపథమందు వేలుపు లజేయుల్ దివ్యతేజోవిధా
తృక మాతంగము నెక్కివచ్చినటు—ధాత్రీబాలికాపాణి యం

దాక కోటీరము వజ్రదీధితుల నవ్వారించుచున్నట్లు వ
ల్లిక లల్లెన్ విపులాశలందు వెలుగుల్ లీలాజగన్నాట్యముల్ !

నెఱివిరిసి సరులు గలుగని
చుఱుకుందన మెత్తి యురుల చుక్కెదురగుచున్
తెఱగంటి మ్రానిపూవుల
తెఱగున ధరయెల్ల కురిసె తెఱత్తై వెలుగుల్ !

ఇరులల్లుకొన్న వాగురలెల్ల లుంగగా
ఆకొన్న కాలాగ్ని కప్పగించి
కటికచీకటుల గొంగళిపుర్వుదశ నూడ్చి
కలికిరంగుల కీటకముల జేసి
అంటరానితనంపు టంధకారము కంపు
కడిగించి వెన్నెల తొడవు తొడిగి
చీకువాల్భ్రమలచిక్కు రే రహదారి
చలువల నిచ్చు చెంగలువ లల్లి

నాల్గు పఱగడలందున నవ్వుపూలు
పొలసి తివ్వన అచ్చువెన్నెలలు పోయు
మచ్చరములేని యెదవోలె మచ్చులేని
తెలిపులుగులట్లు జగమెల్ల వెలుగు లెగసె !

———

ఉయ్యాలవాడ నారసింహారెడ్డి కథ

డా. తంగిరాల వేంకటసుబ్బారావు

దేశ కవితా ప్రియు లింతవఱకును గుర్తింపని యుత్తమ చారిత్రక వీరగాథలలో 'ఉయ్యాలవాడ నారసింహారెడ్డి కథ' యొకటి. రాయలసీమలో, కడప, కర్నూలు మండలములలో దీనికి గొప్ప ప్రచారమున్నది.

నారసింహారెడ్డి పందొమ్మిదవ శతాబ్ది మధ్య భాగమున రేనాటిసీమనేలిన మహావీరుఁడు. ఇతఁడు 'నొస్సం' కోటను బాలించిన చెంచుమల్ల జయరామి రెడ్డి మనుమఁడును, దత్తపుత్రుఁడునునని తెలియుచున్నది. కడప, కర్నూలు, అనంతపురము, బళ్లారి మండలములలో సఱువది యాఱు గ్రామముల కధిపతి నారసింహారెడ్డి. రూపనగుడి, ఉయ్యాలవాడ, ఉప్పలూరు, గుళ్లదుర్తి, గిద్దలూరు మున్నగు గ్రామములలో నితఁడు నిర్మించిన కోటలు నగరులు నేటికిని గలవు ఉప్పలూరు సంస్థానాధీశులగు 'ప్యారావారు' నారసింహారెడ్డి మూలపురుషులని రేనాటి సీమలోని పెద్దలవలనఁ దెలియుచున్నది. కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకా 'చెలిమళ్ల రుద్రవర' మను గ్రామములో నారసింహారెడ్డి వంశీకులను గొలిచెడి పిచ్చుగుంట్లున్నారు. వీరికడ నాకు లభించిన యొక వంశ వృక్షములోఁగూడ నారసింహారెడ్డి మూలపురుషులు 'ప్యారా'1 వారనియే యున్నది. ('ప్యారా లక్ష్మిరెడ్డి' మూలపురుషుఁడు) కావున నీతని యింటిపేరు ప్యారావారై యుండవలెను. ప్యారా వారిది సగునాల గోత్రము. కాని నారసింహారెడ్డిపై పిచ్చుకుంట్లు పాడుచున్న యొక లఘువీరగాథ (Balladling) లో నితని యింటిపేరు ''మద్దెలవారు' అనియుఁ, దండ్రిపేరు 'పెద్దిరెడ్డి' యనియుఁ, దాత పేరు 'జయరామిరెడ్డి' యనియుఁ గలదు.

'తండ్రిపేరే పెద్దిరెడ్డి—తాత పేర్ జయరామిరెడ్డి
ఇంటి పేరే మద్దెలోళ్లు—తాన పేర్ నరసింహరెడ్డి
వాహువా! నరసింహారెడ్డి! నీ పేరంటే
రాజా నరసింహారెడ్డి!!'2

ఇతఁడు 'రూపనగుడి' గ్రామములోఁ బుట్టెననియు, 'ఉయ్యాలవాడ'లోఁ బెరిగెననియుఁ, బాలు అన్నము తినినది 'గుళ్లదుర్తి' గ్రామమనియు నీ వీర గాథానికలోఁ గలదు. ఉయ్యాలవాడలోఁ బెరిగి పెద్దవాఁడగుటచేఁ గాఁబోలును నితనికి 'ఉయ్యాలవాడ నారసింహారెడ్డి' యని పేరువచ్చినది. ఇతఁడు రెడ్లలో మోటాటి వంశమునకుఁ జెందినవాఁడు. మోటాటిరెడ్లలోఁగూడ వీరిది రాజవంశము. (మామూలు మోటాటిరెడ్లకును వీరికిని సంబంధములేదు.) అందుచే వీరిని 'దొరవారు' అని పిలుతురు. వేఱొక కోలాటపుకోపులో నితఁడు 'దొరవారి నరసింహ్వారెడ్డి!' అని సంబోధింపఁబడినాఁడు. నారసింహారెడ్డి వంశీకులు 'నగరి'(కోట)లో నివసించుటచే వీరిని 'నగరివారు' అనియుఁ బిలుతురు.

---

1. 'ప్యారా' శబ్దములోని 'ప్యా' అనుదానిలో 'పే' 'పా' అనువానికి మధ్యగల ధ్వని వినఁబడుచున్నది. ('ఏ'—'ఆ'లకు మధ్య ధ్వని 'తాటాకు' శబ్దములోని 'టా' వంటిది) ఏ—ఆ లకు మధ్యగల యీ ధ్వనిని భాషా శాస్త్రజ్ఞులు 'æ' అను గుర్తుతో సూచింతురు 'బ్యాంకు' శబ్దములోని 'బ్యా'లో కూడ నిట్టి ధ్వనియే యున్నది.

2. కర్నూలుజిల్లా, నందికొట్కూరుతాలూకా, చెలిమళ్లరుద్రవరములో 21-4-1966 న పిచ్చుకుంట్ల చిన్ననాగన్న పాడినపాట.

ఆఱువదియాఱు గ్రామముల కధిపతులగు వీరిని 'జమేదారులు' అందురు.

నారసింహారెడ్డి తాతయగు జయరామిరెడ్డి కాలములోనే, యనఁగా క్రీ. శ. 1800 లోనే యాంగ్లేయులీ 'నొస్సం' సంస్థానమును లోబఱుచుకొని, యీ రాజవంశమువారికి నెలకుఁ బదునొకండు రూపాయలు 'తవర్జి' (భరణము) నేర్పాటుచేసిరి. (ఆంగ్లేయు లెంతటి దురాశాపరులో తెలిసికొనుట కీ యుదాహరణము చాలును. అఱువదియాఱు గ్రామముల కధిపతులగు జమేదారులకు నెలకుఁ బదునొకండు రూపాయల భరణములు!). క్రీ. శ. 1845 వఱకును నీ తవర్జి ఉయ్యాలవాడలోనున్న నారసింహారెడ్డికి వచ్చుచుండెను. ఆ సంవత్సరము నారసింహారెడ్డి తనకు రావలసిన తవర్జికొఱకై కోవెలకుంట్ల (కోయిలకుంట్ల) తహశీల్దారుకడకుఁ దన భటుని పంపెను. (తన కుమారుఁడగు 'దొరసుబ్బయ్య'ను బంపెనని మఱికొందరు తెల్పుదురు.) తహశీల్దార్ తవర్జి నీయకుండుటయేకాక నారసింహారెడ్డిని దుర్భాషలాడినాఁడు:[3] 'ఆ నరసింహదాసరి[4] క్రింద మఱియొక దాసరియా? ఆ నరసింహదాసరినే రమ్మనుము, పొమ్ము' అని భటునికడ నీసడించెనఁట. ఆ భటుఁడు ఉయ్యాలవాడకుఁ బోయి, నారసింహారెడ్డితో జరిగిన సంగతి చెప్పెను అది విని, నారసింహారెడ్డి దండతాడితభుజంగమైనాఁడు. అట్టి యవమానమును భరించుటకన్నఁ జచ్చుట మేలని నిశ్చయించుకొనినాఁడు. 'రేపుమధ్యాహ్నము పండ్రెండుగంటలకు నరసింహదాసరియే నీ కడకు వచ్చును, కాచుకొనుము!' అని అదే సేవకునిచే తహశీల్దారునకుఁ గబురువెట్టెను.

రెడ్డి మఱునాఁ డయిదువందలమంది బోయసైన్యమును దీసికొని, పట్టపగలు కోవెలకుంట్ల పట్టణముపై దండెత్తెను. తహశీల్దారునిఁబట్టి తలగొట్టి, ధనాగారముకడనున్న బొందెలవాఁడు 'వారసింగు'[5]ను జంపి, దానిని దోచుకొని, కచ్చేరి నంతయు దగ్ధముచేసి తహశీల్దారు శిరస్సును, వారసింగు శిరస్సును దెచ్చి, నొస్సం దగ్గఱనున్న 'నయనాలప్పకొండ'లో గల యొక శివాలయమున గుహలో దాచినాఁడు.

కడపలోనున్న కలెక్టరుకును, పోలీసు సూపరింటెండెంటుకును నీ హత్యావిషయము తెలిసి, యన్వేషణ ప్రారంభించిరి. ఉయ్యాలవాడలోని నారసింహారెడ్డి కడకు వచ్చి, కోవెలకుంట్లలో జరిగిన హత్యనుగురించి యతనినే ప్రశ్నించిరి. (ఒక ప్రాంతమున నొక నేరము జరిగినప్పుడు ఆ ప్రాంతములోని పాళెగాండ్ర సహాయమును దీసికొనుట ఆంగ్లేయుల రాజనీతి.) నారసింహారెడ్డి తన కేమియుఁ దెలియదనియు, బహుశః ఔకురాజా లీ పని జేసియుందురనియుఁ దెల్పెను. అందుచే నాంగ్లేయులు ఔకురాజగు నంద్యాల నారాయణరాజుగారిని, వారి బంధువులను చిట్వేలి తవర్జీదారుఁడునగు నంద్యాల వేంకటరామరాజుగారిని బంధించి కారాగారములో నుంచిరి.

అపరాధపరిశోధకులు పరిశీలన ప్రారంభించి, నయనాలప్పకొండలోఁగల శిరస్సులను గనుగొనిరి. నారసింహారెడ్డి యనుచరులగు గోపాయివెంకన్న, ఒడ్డెఓబన్న యనువారలను బంధించి, సత్యమును

---

3. కోవెలకుంట్ల తహశీల్దారునకు నారసింహారెడ్డి యనిన పడదఁట. రేనాటిసీమలోని వృద్ధులు దీని కొక కారణమును దెల్పుచున్నారు. తహశీల్దారునకు కోవెలకుంట్లలో నొక వేశ్య యున్నదఁట. ఆ వేశ్యకడకే నారసింహారెడ్డికూడ పోవుచుండెనఁట. అందుచేత తహశీల్దారునకు రెడ్డిపై నీర్ష్యాద్వేషములు పెచ్చుపెరిగెను.

4. నారసింహారెడ్డి గొప్ప విష్ణుభక్తుఁడు. నుదుటిపై పెద్దతిరుమణి తీర్చుదిద్దుకొనెడివాఁడు.

5. ఈ బొందెలవానిపేరు 'హరిసింగ్' అని కలవటాల జయరామారావుగారు రచించిన 'రేనాటి వీరుఁడు' నవల (1925) లోఁ గలదు. కాని నాకు లభించిన ఒక వీరగాథానికలో ప్రెంజెరికడనున్న బొందెలవాఁడు 'వారసింగు' అని యున్నది.

గనుగొనిరి. నారసింహారెడ్డిని బంధించుటకుఁ గొందఱు పోలీసులను ఉయ్యాలవాడకుఁ బంపిరి వారు నారసింహారెడ్డిని బట్టుకొనుటకు బదులుగా నతనిచేఁ దన్నులుతిని, శిక్షింపఁబడి, ప్రాణములతో బయట పడిరి. పోలీసువారు నారసింహారెడ్డిని బట్టుకొనుటకు భయపడుచుండిరి, బ్రిటిషువారు 1846 లో నారసింహారెడ్డిపైకి సైన్యమును బంపిరి. నొస్సము దగ్గఱ దాని నాతఁడోడించెను అందుచే 1847లో నాంగ్లేయులు' లెఫ్టినెంట్ వాట్సన్' (Lt. Watson) అను గొప్పసేనానాయకత్వమున నసంఖ్యమైన సేనావాహినితో నారసింహారెడ్డిని నణచుటకు నిశ్చయించిరి. నారసింహారెడ్డియు వేలకొలఁది సైన్యములను సమకూర్చుకొని గిద్దలూరు దగ్గఱ వాట్సన్‌తో ఘోర యుద్ధము చేసెను రెడ్డి సైన్యమంతయు నష్టము కాఁగా, నల్లమల కొండలలోనికిఁ దప్పించుకొని పోయెను. అటనుండి ఎఱ్ఱమలలోనికిఁ బాఱిపోయెను. ఆంగ్లేయు లాతనిని బట్టుట కెన్నియో ప్రయత్నములు చేసిరి. కాని ఫలించ లేదు.

కొంతకాలము గడచెను. నారసింహారెడ్డి 'జగన్నాథపురము కొండ'పై[6] నుండెను. అతనికడ నొక వంట మనిషి[7] యుండెను. బ్రిటిషువారామెకు లంచ మిచ్చి, నారసింహారెడ్డిని బట్టుకొనిరి. ఆ వంట మనిషి నారసింహారెడ్డికి విపరీతముగా సారాయి పట్టించి యాతని తుపాకిలో నీళ్ళు పోసి యుంచిన దఁట. నారసింహారెడ్డిని బంధించి, కోవెలకుంట్లకుఁ దెచ్చి జుఱ్ఱేటియొద్దన నురితీసిరి.

ఇట్లు భారతదేశమున స్వాతంత్ర్యమునకై, మానధనమును గాపాడుకొనుటకై యాంగ్లేయులతోఁ బోరాడిన మొట్టమొదటి వీరుఁడు నారసింహారెడ్డి. ఇతఁడు భారత ప్రథమ స్వాతంత్ర్య సమరముకన్నఁ బది సంవత్సరములు ముందుగనే యాంగ్లేయులను ఢీకొన్న వీరశిఖామణి! ఇతఁడీ యుద్ధమును క్రీ. శ 1846, '47 సంవత్సరములలో జరిపినాఁడని యాంగ్లేయులు వ్రాసికొనిన రాష్ట్రపరిపాలనా చరిత్రలనుబట్టియు, మాండలికచరిత్రలనుబట్టియుఁ దెలియుచున్నది. మద్రాసురాష్ట్రపాలనాచరిత్ర రెండవ సంపుటములో నారసింహారెడ్డి కావించిన విప్లవము క్రీ. శ. 1846 లో జరిగినట్లున్నది.

"In 1846, a descendant of the dispossessed poligars of Nossam, dissatisfied with the pension he received, attempted to excite a general rebellion, and collected on the frontiers two forces of several thousand men. Each was promptly defeated by British detachments, and before the end of the year quiet was completely restored. Since that time no event of historical importance has occured."[8]

బ్రిటిషువారు వ్రాసికొన్న యీ వ్రాతలను బట్టి నారసింహారెడ్డి విప్లవము చిన్నదికాదనియు, వేలకొలఁది సైన్యములను సమకూర్చుకొని, యతఁడు క్రీ. శ. 1846 లోనే రెండు పర్యాయములాంగ్లేయుల నెదిరించెననియు విశదమగుచున్నది. పై గ్రంథములోనే 1846 వ సంవత్సరమునుగూర్చి మఱియొక పుటలో నిట్లున్నది:

"1846—Serious disturbances in the

---

6. కోవెలకుంట్లనుండి బనగానపల్లె పోవు మార్గములో నున్నది.

7. ఈమె వంట మనిషి కాదనియు, నారసింహారెడ్డి యుంపుడుకత్తెయనియు, నీమె స్వగ్రామము 'గొల్లవిండ్లపల్లె' యనియుఁ గొందఱు చెప్పుచున్నారు. నాకు లభించిన వీరగాథలో నీమె యుంపుడుకత్తెగానే యున్నది. పేరు 'జానకమ్మ' యని గలదు. ఈ పేరు యథార్థమైనదో లేక గాథాకారుఁడు కల్పించినదేమో తెలియదు.

8. Manual of the administration of the Madras Presidency, Volume II, P. 75.

Cuddapah district. Troops sent to put them down''9

మద్రాసురాష్ట్రపరిపాలనా చరిత్ర మూఁడవ సంపుటములో నారసింహారెడ్డి విప్లవము క్రీ. శ 1847 లో జరిగినట్లున్నది ఇందు 'ఉయ్యాలవాడ' గ్రామచరిత్రను వ్రాయుచు, నారసింహారెడ్డి విప్లవమును, నతఁడు 'లెఫ్టినెంట్ వాట్సన్'తో గిద్దలూరు కడ చేసిన యుద్ధము, 'పేరుసోమల'యను గ్రామము నొద్దఁ బట్టుబడుట, యురితీయఁబడుట మొదలగునవి మాత్రమేకాక, మఱియొక క్రొత్త విషయము కూడ నిందుఁ జెప్పఁబడినది. ఉరితీయఁబడిన నారసింహారెడ్డి శిరస్సును బ్రిటిషువారు 'నొస్సం' కోటలో నురికంబముపై 1877 వఱకును వ్రేలాడదీసి యుంచిరఁట! భారతీయుల స్వాతంత్ర్యేచ్ఛను బ్రిటిషు వారెంత క్రూరముగా నణఁచివేసిరో దీనిని బట్టి గుర్తింపవచ్చును

'Ooyyalavanda......In 1847, a disturbance was caused by Narasimha Reddy, pensioned poligar of this place and grandson of Jayaram Reddy, the last powerful Zamindar of Nossam. He unsuccessfully attackedCoilcoontla treasury and sheltered himselt in hill forests of Yerramalas and Nullamullays. At Giddalore he gave battle to Leiutement Watson and killed the Tahsildar of Cumbum. He then escaped into the Nullamullays, and was subsequently captured near Peruso nala in Koilkoontla talook and hanged. His head was kept hung in the fort on the gibbet till 1877.'10

నారసింహారెడ్డి శిరస్సును కోట బురుజునకు వ్రేలాఁడగట్టిన విషయము 'దొరవారి నరసింహ్వారెడ్డి! నీ దొరతనము కూలిపోయె రాజా నరసింహ్వారెడ్డి!' అను లఘువీరగాథ—కోలాటపుకోపులోఁ గూడఁ దెలుపఁ బడినది.

'కండ్లకూ గంతాలు గట్టి,
నోటి నిండా బట్లు పెట్టి
నిలువునా నీ తలా గొట్టి,
కోట బురుజాకు గట్టిరి'11

26–11–1850 లో కడపజిల్లా చిట్టివేల్ తాలూకా తవర్జీదారుఁడైన నంద్యాల వేంకట రామరాజుగారు రివిన్యూబోర్డువారికి వ్రాసిన లేఖలో నారసింహారెడ్డి విప్లవము, పరాభవనామ సంవత్సరము క్రీ. శ. 1845 లో జరిగినదని కలదు.12 అనఁగా నారసింహారెడ్డి తిరుగుబాటు క్రీ. శ. 1845, 1846, 1847 - ఈ మూఁడు సంవత్సరముల లోను జరిగినదని నిశ్చయింపవలసి యున్నది. 1845లో నితఁడు కోవెలకుంట్లపై దండెత్తి తహసిల్దారును జంపియుండును. ఆ నేరము ఔకురాజులపై మోపఁగా, బ్రిటిషువారు ఔకురాజులను ఖైదు జేసినదియు నీ సంవత్సరమే. దీనికిఁ బైనఁ దెల్పిన లేఖయందే ప్రమాణమున్నది. 1846 లో నారసింహారెడ్డి వేలకొలఁది సైన్యములను సమీకరించుకొని రెండు పర్యాయము లాంగ్లేయులతోఁ బోరాడెను. మరల 1847 లో గిద్దలూరుదగ్గఱ లెఫ్టినెంట్ వాట్సన్‌తో ఘోరయుద్ధముచేసి, నల్లమల యరణ్యములలోనికిఁ దప్పించుకొనెను. ఆ సంవత్సరమే పట్టుబడి యురి తీయఁబడెను.

ఈ నారసింహారెడ్డినిగూర్చిన చారిత్రక విషయముల నాధారముగాఁ జేసికొని 1925 వ సంవత్సరములో శ్రీ కలవటాల జయరామారావుగారు 'రేనాటివీరుఁడు' అను నవలను రచించి ప్రకటించిరి ఇందు సత్యముతోఁబాటు కొంత కల్పనయు జోడింపఁబడియున్నది.

---

9. Ibid, P. 265. నారసింహారెడ్డి కాలమున నేఁటి కర్నూలుజిల్లాలోని కోవెలకుంట్ల ప్రాంతమంతయు కడపజిల్లాలో నుండెడిది

10 Manual of the administration of the Madras Presidency, Vol III, P. 251.

11. త్రివేణి, పుట 270.

12. రేనాటి వీరుఁడు, పుటలు104–106.

ఉయ్యాలవాడ నారసింహారెడ్డి కడ 'ఓబళాచార్యుఁడు' అను నాస్థానకవి యుండెనని తెలియుచున్నది. ఈ యోబళాచార్యునకును, నా కాలమున కర్నూలుమండలమునఁ బ్రసిద్ధికెక్కిన కృష్ణీపాటి వేంకటకవికిని నశ్యమునిమిత్తమై సంభాషణాత్మకముగా జరిగిన రెండు పద్యములను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమ చాటుపద్యమణిమంజరిలో నిచ్చియున్నారు.[13] అందు వేటూరివారు వేంకటసుబ్బకవినిగూర్చి వ్రాయుచు 'ఈయన కర్నూలు మండలవాసి. ఇప్పటికి డెబ్బదియేండ్లకు పూర్వమున్నవాఁడు' అనిరి. దీనినిబట్టికూడ నారసింహారెడ్డి కాలము నూహింపవచ్చును. ఈ చాటుపద్య మణిమంజరి 'దుందుభి జ్యేష్ఠము'న బ్రకటింపఁబడినది. అనఁగా క్రీ. శ. 1913 ముద్రింపఁబడునాఁటికి రెండు మూఁడేండ్ల క్రిందటనే శాస్త్రిగారీ పద్యములను సంపాదించి పరిష్కరించియుందురు అనఁగా 1920 ప్రాంతమున నీ మాటలను శాస్త్రిగారు వ్రాసియుందురని తలఁపవచ్చును. అప్పటికి డెబ్బదియేండ్ల పూర్వమనఁగా క్రీ. శ. 1850 ప్రాంతమగుచున్నది. ఇది వేంకటసుబ్బకవికాలము. ఇదియే నారసింహారెడ్డి యాస్థానకవియగు నోబళాచార్యుని కాలముగూడ. ఆస్థానకవి 1850 ప్రాంతమువాఁడు కాఁగా, తత్పోషకుఁడు 1847 ప్రాంతమున నుండుటలో విప్రతిపత్తిలేదు. డాక్టర్ తూమాటి దొణప్పగారు తాము సేకరించిన కోలాటపుపాటకు వ్రాసిన లఘువివరణములో నారసింహారెడ్డి సంఘటన క్రీ. శ. 1800–1825 నాఁటిదని తెల్పిరి.[14] ఇది ప్రామాదికము. ఈ నారసింహారెడ్డి విప్లవము క్రీ శ. 1845–47 మధ్యకాలమున జరిగినది. నాఁటి యాంగ్లపాలకులే దీనిని గ్రంథస్థము చేసియున్నారు.

ఈ నారసింహారెడ్డిపైఁ బ్రజలలో రెండు వీరగాథానికలును, నొక వీరగాథయు వ్యాప్తియందున్నవి. 'దొరవారి నరసింహ్వారెడ్డి! నీ దొరతనము కూలిపోయె రాజా నరసింహ్వారెడ్డి' అను కోలాటపు పాటను డాక్టర్ తూమాటి దొణప్పగారు అనంతపురమండలమున సంపాదించిరి. (చూ. త్రివేణి, పుటలు 270, 271). 'వాహువా! నరసింహారెడ్డి! నీ పేరంటే రాజా నరసింహారెడ్డి!' అను పిచ్చుకుంట్ల పాటను నేను 1966 లో కర్నూలు మండలమున సేకరించితిని. ఈ రెండును లఘువీరగాథలు. ఇవి కాక, బొబ్బిలిపాట వరుసలోనున్న పెద్దవీరగాథయు నొకటి కలదు. దీనిని నేను కడపమండలమున ప్రొద్దుటూరు తాలూకా అయ్యవారిపల్లెలో నొక జంగమునుండి సేకరించితిని. (15–3–1966). ఈ వీరగాథలోఁ బైన దెల్పిన చారిత్రక నామములు లేకున్నను గథయంతయు నొకటే రెండు స్వల్ప భేదములతో నట్లే యున్నది. దీని ప్రారంభమిట్లున్నది.

'రామరామ రఘురామ రామయా,
రామయ రఘురామా!
రెడ్డికాదు బంగారపు కడ్డి
నారసింహారెడ్డి–నాయన
పుట్టింది మా గుళ్లదుర్తిలో
నారసింహారెడ్డి —,,
వచ్చిందీ ఆ రూపనగుడికి
నారసింహారెడ్డి— ,,
నరిసిరెడ్డి ఇంటికి నేడూ
దత్తతకొచ్చివాడూ— ,,

నారసింహారెడ్డి రూపనగుడి గ్రామములోనే యుండి, ఉయ్యాలవాడకుఁబోయి వచ్చుచుండెననియు, నుయ్యాలవాడ గ్రామకక్షలలో నొక హత్య జరిగినప్పుడు తహశీల్దారుకును, నారసింహారెడ్డికిని వాగ్వాదము జరగెననియు, నుయ్యాలవాడ గ్రామములోనే తహశీల్దారు రెడ్డి నవమానించెననియు నిందుఁ జెప్పఁబడినది. నారసింహారెడ్డి తవర్జీకొఱకుఁ దన సేవకుని కోవెలకుంట్లకుఁ బంపిన విషయ మీ కథలోలేదు.

---

13. చూ. చాటుపద్య మణిమంజరి, రెండవ భాగము, పుటలు 133, 134.

14. చూ. త్రివేణి, పుట 270.

నారసింహారెడ్డి కోవెలకుంట్లపై దండెత్తినప్పుడు తహశీల్దారును, ధనాగారమును గాపాడుచుండిన 'వారసింగు'ను మాత్రమే చంపినాఁడు—తాలూకా కచ్చేరీని ధ్వంసము చేసినాఁడు. ఇది చారిత్రక సత్యము. కాని యీ వీరగాథలో నారసింహారెడ్డి కోవెలకుంట్ల నంతటిని కొల్లగొట్టినట్లు చెప్పఁబడినది. 'హుసేన్' అను పఠాను వీరునితోఁ గూడ నారసింహారెడ్డి యుద్ధము చేసినట్లు వర్ణింపఁబడినది. తహశీల్దారుని పేరు వీరగాథలో 'జిలేదారుడు' అని యున్నది. 'జిల్లా అధికారి' యని దీని కర్థము కాఁబోలు. నారసింహారెడ్డి తహశీల్దారు శిరస్సును, బొందిలివాఁడైన వారసింగు శిరస్సును నఱికి, రెండు శిరస్సులను 'నయనాలప్పకొండ'లో దాచెనని జనశ్రుతి. నేను సేకరించిన పిచ్చుకుంట్ల పాటలోఁగూడ నీ విషయమున్నది. కాని వీరగాథలో నీ వృత్తాంతము లేదు. తాసిల్దారును జంపినట్లుమాత్రమే కలదు. శిరస్సు దాచినట్లులేదు.

గిద్దలూరుదగ్గఱ లెఫ్టనెంట్ వాట్సన్‌తో నారసింహారెడ్డి యుద్ధముచేసెను. కాని వీరగాథలో నా యుద్ధము జగన్నాథముకొండదగ్గఱ జరిగినట్లు వర్ణింపఁబడినది. ఈ జాతిసైన్యము బళ్లారినుండి వచ్చినదని గాథాకారుఁడు పాడుచున్నాఁడు. ఈ జగన్నాథముకొండకు దిగువన 'గొల్లవిండ్లపల్లె' యను గ్రామ మున్నదనియు, నా గ్రామములో 'జానకమ్మ'యను వనిత కలదనియు, నీమెకును నారసింహారెడ్డికిని సంబంధమున్నదనియు, నాంగ్లేయులీమెకు లంచమిచ్చి నారసింహారెడ్డిని బట్టిరనియు వీరగాథలోఁ గలదు. కాని నారసింహా రెడ్డిదగ్గఱ నొక వంటమనిషి యుండెడిదనియు, నామె మూలకముగనే యాంగ్లేయు లాతనిని బట్టిరనియు జనశ్రుతి. ఆ వంటమనిషి పేరుతెలియదు. ఈమె ఉయ్యాలవాడ గ్రామమునకుఁ జెందినదనియు తెలియుచున్నది. పిచ్చుకుంట్లకడనున్న వంశవృక్షములో నారసింహారెడ్డి భార్యపేరు '(సి)ద్దమ్మ' అనియు, నాతని తల్లి పేరు 'సీతమ్మ' యనియుఁ గలదు. భార్యపేరులో మొదటి యక్షరము సరిగాఁ దెలియుటలేదు. అది 'పెద్దమ్మ' కావచ్చును, లేదా 'సిద్దమ్మ' కావచ్చును. నారసింహారెడ్డికి 'బొజ్జయ్య' అను తమ్ముఁడును, 'దొరసుబ్బయ్య' అను పుత్రుఁడును నుండినట్లు రేనాటి గ్రామవృద్ధులు చెప్పుచున్నారు.

నారసింహారెడ్డిది బోయసైన్యము. దీనిని సుంకేశల, ముక్కమళ్ల, ముదిగోడు, కానాల, సంజామల, కొండకరబాల—యను గ్రామములనుండి సమకూర్చినాఁడట. కఱవుకాటకములు వచ్చినప్పుడు నారసింహారెడ్డి యీ బోయలను మిక్కిలి యాదరించెడివాఁడఁట. ఆ కృతజ్ఞతచే వారందఱును రెడ్డి పిలిచినవెంటనే యాయుధపాణులై యానందముతో వచ్చిరి.

'కరువు వొచ్చినా కాలమొచ్చినా ఆదరించె రెడ్డి
అట్టివక్క మనరెడ్డి మాటలూ చిన్నవెయ్యరాదు
నాలుగు గ్రామాలమందిగా తాము లేచినారు
మూఢునూర్లకూ ముకుందబల్లెం మురవకలేచిందీ
ఆరు నూర్లకూ అలుగు రఃటెలే అదలక లెచినవీ'

ఈ బోయ సైన్యమునకు 'ఎల్లాపుల రాణువ' అని పేరు. ఈ సైన్యమును వెంటఁ బెట్టుకొని నారసింహారెడ్డి కోవెలకుంట్లపైకి దండెత్తఁగాఁ బ్రజలు హడలెత్తి పోయిరి. నతఁడు కోవెలకుంట్లను గొల్లగొట్టుట, యక్కడ నాంగ్ల ప్రభుత్వము వారితో నితఁడు కావించిన యుద్ధము వీరరస స్ఫూర్తితో వర్ణింపబడినది:

'అడిగోవచ్చె ఇడిగోవచ్చె నారసింహరెడ్డి
పళపళ పళపళ కేకలేసెరా నారసింహరెడ్డి
చంద్రాయుధమూ చేత బట్టెనే నారసింహరెడ్డి
కోబలీ రణబలీ యన్నడే నారసింహరెడ్డి
ఆవుల మందలో పులీ దుమికినా చందము దుమికి
నడూా
రెడ్డియెక్కినా గుఱ్ఱము లమిడీ ఏ విధ మొచ్చినదీ?

కుప్పిటి గంతులమీద వచ్చేరా బారా హజ్జారీ
వచ్చిన వక్కా సైన్యము అంతా ముందుకు దుమికినది
వంచినట్టి బల్లెముల పైననూ వాలలాడుతారు
సాన జేసినా కత్తుల మిందా సవకళించినారు
అరవై వొక్కా తుపాకులండీ ఫెళ ఫెళ వాగినవి
విరగ నరుకుతా పోతాడయ్యా నారసింహారెడ్డి
తాటి పుచ్చులా చందము నేడు తలలే పోతావి
....
ఆలగోడ్డురా బాలగోడురా కొయిల్ కుంట్లలోన
ఎక్కడ చూచినా పీనుగు పెంటలు కొయిల్ కుంట్ల లోన'

కోవెలకుంట్ల నీ విధముగాఁ గొల్లకొట్టుచుండఁగా 'హుసేన్' అను పఠానువీరుఁడు రెడ్డి నెదిరించెను, (లఘు వీరగథలో 'వారసింగు' అను బొందిలివాఁడు నారసింహారెడ్డి నెదిరించినట్లున్నది.) మొదటహుసేన్ ప్రేటు నడపినాఁడు.[15] నారసింహారెడ్డి తన శరీరమంతయు డాలువాటునఁబెట్టి యా ప్రేటు నుండి తప్పించుకొనెను. తరువాతఁ దన ప్రేటు నడపుచు —

'పటపటపటపట పండ్లు కొరికెరా నారసింహారెడ్డి
తెల్లనికళ్లకు రకతము దింపెను నారసింహారెడ్డి
కుడీ లొడ్డును తాను గొట్టెరా నారసింహారెడ్డి
మొలకవిూసము గోటదిద్దెరా నారసింహారెడ్డి.'

ఇట్లు నారసింహారెడ్డి విజృంభించి, చేతి చంద్రాయుధమును గిరగిర త్రిప్పి, శక్తికొలఁది గొట్టఁగా, హుస్సేన్ శిరస్సు పుట్టచెండువలె నెగిరి పడినదట! తరువాద నారసింహారెడ్డి జిలేదారుని కడకుఁబోయి, 'అప్పుడన్నమాట లిప్పుడు పలుకుము?' అని బెదిరించి, యాతనిపై నెట్లు పగ దీర్చుకొనెనో చూడుఁడు :

'పళపళపళపళ కేక లేసెనే నారసింహారెడ్డి
రాజారావూ రాజబహద్దరు నారసింహారెడ్డి
కోయిలకుంట్లా జిలేదారునీ రెట్టబట్టినాడు
కుర్చీమిందా జిలేదారునీ రెట్టబట్టియిగ్గి
జిలేదారునీ టోపీ గట్టిగ మూడు దొర్లుదొర్లొ
టవును బయటికీ ఎత్తికొట్టెరా నారసింహారెడ్డి
నక్కనోటి జమదండము బాకు పైకి ఎత్తినాడు
వ్రరువ్ర్రునా బొజ్జను కోసీ పగలజీర్చినాడు
సన్నపేగునూ జంజెమేసెరా నారసింహారెడ్డి
వాని రకతమూ సుక్కబొట్టుగా తాను బెట్టినాడు
పళపళపళపళ కేకలేసిరీ ఎల్లావుల రాజ్య!'

కడపలోని పోలీసువారికి నారసింహారెడ్డిని పట్టుటకు సాధ్యముగాక, బళ్లారినుండి జాతిసైన్యమును దెచ్చిరఁట. ఆ జాతిసైన్యమువచ్చి జగన్నాథుని కొండదగ్గఱ డేరాల వేసిరి :

'ఎండలకూ బల్ ఎత్తిరిదేవా ఎండిపట్టుడేరా
కార్యానికీ ఎత్తిరిదేవా కావిపట్టుడేరా
పొద్దుపొడుపులకు ఎత్తిరిదేవా పగడపట్టుడేరా.'

ఈ జాతి సైన్యమునకును, నారసింహారెడ్డి బోయసైన్యమునకును గొప్ప యుద్ధము జరిగినది. నారసింహారెడ్డి బోయసైన్యముయొక్క యుత్సాహమును గాథాకారుఁ డత్యద్భుతముగా వర్ణించినాఁడు.

'ఈటెలు వేసీ ఈటెలమ్మటే పరవడి గొట్టేది
బాకులువేసీ బాకు లమ్మటే అంటేర్లు గొట్టేది
రెడ్డి సుట్టునా వాళ్లు గనుకనూ గోల్ తిరుగుతారు'

---

15. జానపదులలో 'ఏటునడుపు' అను విచిత్ర ప్రయోగ మొకటి వాడుకలో నున్నది, ఆంగ్లమునఁగల 'attack, Offence' అను మాటలకిది సమానార్థకము. ఒక వీరుఁడుముందు attack చేయును, ఆ విజృంభణమునుండి రెండవ వీరుఁడు తన్ను రక్షించుకొనును దీనిని 'Defence' అందురు. తరువాత రెండవ వీరుఁడు తన 'ఏటు నడుపు'ను. అప్పుడు మొదటి వీరుఁడు దానిని దప్పించుకొనుటకుఁ బ్రయత్నించును దంద్వయుద్ధ మెప్పుడును నిట్లే జరుగును 'ఫుట్‌బాల్'వంటి ఆటలలోఁగూడ నిట్టి పరస్పరవిజృంభణ పరిరక్షణములను దిలకింపవచ్చును.

నారసింహారెడ్డి తన దివ్యాశ్వమునెక్కి యుద్ధ సన్నద్ధుఁడు కాఁగా, నా యశ్వరాజమట్లనును—

'కాలి దుమ్ము కైలాస మేగెరా గజ్జెలు ఘల్లుమను
చారెడేసి కళ్ళయా పలుగురాళ్ళురా పిండిపిండి యగును'

'ఏలబోయి యీ ప్రపంచమును దిరిగి యేలబోమనియు, 'పుట్టబోయి మన ఉల్లి కడుపున వెల్లి పుట్టబో'మనియుఁ బాలెగాఁడు ప్రెంపు చేసికొని యుద్ధమునకేఁగిరి. ఈ యుద్ధమును గథాకారుఁడాంగ్లేయసైన్యమును మహమ్మదీయసైన్యమును వర్ణించినట్లుగా వర్ణించినాఁడు. దీనికొక ముఖ్యకారణ మున్నది. మన ప్రాచీన వీరగాథలలోఁ దురుష్కసైన్య వర్ణనమున్నదికాని, యాంగ్లసైన్య వర్ణన మెచ్చటను లేదు. హిందీ, ఉర్దూపదములు దొరలినట్లుగా గథాకారున కాంగ్లపదములు రావు. అందుచే విదేశీయుల భాషను సూచించుటకు, వారే జాతివారైనను మహమ్మదీయులుగ వర్ణించుటయే పరిపాటియైనది. జాతివారు తమభాషలో నలుమాడఁగా, వారిని నారసింహారెడ్డి సైన్యము విరుగఁ బొడిచినది. నాకుఁ గాథను పాడి వినిపించిన యతఁడు తనకు బాగుగా వచ్చిన దేసింగురాజుకథవంటి ప్రసిద్ధకథలలో వచ్చు తురుష్క సైనికుల యుద్ధ వర్ణనమునుండి కొన్ని మాటలను గ్రహించి, జాతివారితో నారసింహారెడ్డి చేసిన యుద్ధమును వర్ణించినాఁడు.

'మారో మారో మారో అంటరు
జాతులవారిబలము
మారో అన్నా మాదిరచేదా
ఈటెచూడు లవిగ్గా
పకడో పకడో పకడో అంటరు
జాతులవారి బలము
పకడో అన్నా ధకిడీ కొడకా
బాకుచూడు లవిగ్గా
గోవిందా నారాయణంటనూ
విరగ నరుకుతారు
అరెరెరె రెరెరే..................
పొడుస్తవుంటే పడుతున్నావి
పొట్టపేగులండీ
నరుకుతవుంటే పడుతున్నావి
నల్లగుండులోయ్యా
చీరుతవుంటే పడుతున్నావి
చిన్నపేగులోయ్యా
వాళ్ళు తాగినా కల్లూపారయి
వరదలు పోతాది
అప్పుడు తిన్నా పప్పుకూడురా
కుప్పలు నెప్పలురా
ఒకణ్ణిమీదా ఒకణ్ణివేసి
ఈటెల గ్రుద్దేది
అట్లాగాను రణవిధ్వంచేసీ
నారసింహారెడ్డి
కొట్టికొట్టి మా కొల్లలాడెరా
నారసింహారెడ్డి.'

నారసింహారెడ్డి తాకఁ గాఁగలేక, జాతివారి సైన్యము పలాయనమంత్రము పఠించినది. వారు పారిపోవునప్పుడు హాస్యరసము చక్కఁగఁ బోషింపఁ బడినది. తొందరలో టోపీలు, కత్తులు పోగొట్టుకొని, గుఱ్ఱములు చనిపోఁగా దేరాలనెక్కి, యవియే గుఱ్ఱములని భ్రమించి 'రైటో! రైటో!' అని తోలస్తూరంట! మఱికొందఱు గుఱ్ఱముల మూతికి ముందెడు లగమును తోకకు గట్టి, తోకకు నుండెడి దానిని మూతికి గట్టి, గుఱ్ఱములు కట్టఁబడిన గూటములైనను మూడఁబెలుకక పరుగులు పెట్టుచుండిరట! ఆ గూటములు గఱ్ఱముల కాళ్ల కడ్డుపడి, వెనుకనాటున లేచివచ్చి, టోపీలులేనివారి బోడి తలలకుఁ గొట్టుకొనుచుండెనట!

వీరగాథలలోఁ దఱచుగా వచ్చెడి సాధారణ ప్రయోగములు లేక వారానువర్తనములు, (Commonplaces), యుద్ధ వివాదములు, తీవ్ర సంకల్పములు మున్నగునవి యీ కథలో మెండుగా నున్నవి. నారసింహారెడ్డినిగూర్చి చెప్పునపు డీ క్రింది వాక్యములు తఱచుగాఁ బ్రయోగింపఁబడుచుండును.

'అదిగోవచ్చె ఇదిగోవచ్చె నారసింహారెడ్డి
రాజారావు రాజబహదరు నారసింహారెడ్డి
రెడ్డికాదు బంగారపుకడ్డి నారసింహారెడ్డి
ములుకోలకట్టె చేతులోనుంటే
మున్నూటికి మొనగాడు'

బొబ్బిలి యుద్ధములోఁ దళముగావచ్చు 'రామ రామా! అనంతకాలము రాజ్యము ఏలేమ?, యుగములు జగములు గలంతకాలము భూములు ఏలేమ? అను దానిని బోలిన యుద్ధ నినాదము (War cry) నారసింహారెడ్డి కథలోఁగూడ వచ్చును. యుద్ధమున కుఱుకునప్పుడు నారసింహారెడ్డి సైన్యమునఁ యిట్లనును:

'ఈ పొద్దిదియ రేపు తదియు
నరుని ప్రాణమోయి
నీటి బిందను బుగ్గతోటిదీ
నరా శరీరమ్ము
ఏలబోయి ప్రపంచంలో
సురల ఏలబోము
పుట్టబోయి మన తల్లి కడుపునా
మళ్లీ పుట్టేమా?'

ఈ కృతనిశ్చయముతోనే, ఈ ఉంవది తనముతోనే నారసింహారెడ్డియు నతని బోయసైన్యమును నాంగ్ల సేనావాహినిని ఢీకొనిరి.

నారసింహారెడ్డి పరాక్రమము పైనను, బలము పైనను నెన్నియో జనశ్రుతులున్నవి. అవి యన్నియును వీరగాథలోని కెక్కలేదు. 'రేనాటి వీరుఁడు' నవలలోఁగూడ నివి లేవు. అట్టి కథలను గొన్నింటిని నేను సేకరించితిని. నారసింహారెడ్డి తాను చేసిన కొన్ని కుంట్ల హత్యలను ఔకురాజులపైఁ బెట్టెను. దీనినిబట్టి నారసింహారెడ్డికిని ఔకురాజులకును శత్రుత్వమున్నదని తెలియుచున్నది. కాని యా శత్రుత్వ కారణము 'రేనాటివీరుఁడు' నవలలోఁ దెలుపఁబడ లేదు. నారసింహారెడ్డికిని ఔకురాజులకును మధ్య విరోధ మేర్పడుటకుఁగల కారణమును దెల్పు కథ యొకటి నేను సంపాదించితిని. ఇది గ్రామ వృద్ధులు చెప్పు వచన కథ (Folk tale). దీనికి 'సీతఁడు కథ' యని పేరు. నారసింహారెడ్డి దగ్గఱ యుద్ధమునకుఁ బహార్వము 'సీతఁడు' 'కలికి నారి గాఁడు' అను నిరువురు నమ్మిన బంట్లు కలరు. (యుద్ధకాలమున 'గోసాయి వెంకన్న' 'ఒడ్డె ఓబన్న' అనువారు నమ్మినబంట్లు. నాకు లభించిన లఘు వీరగాథలో వీరి ప్రసక్తి యున్నది). వీరిలో సీతఁడు మహావీరుఁడు. నారసింహారెడ్డికి నుద్దియనఁదగిన వాఁడు. ఈ సీతఁ డెల్లప్పుడును ఉయ్యాలవాడలో నారసింహారెడ్డి కడనే యుండెడివాఁడు. కలికి నారిగాఁడు మాత్రము హనుమదుగుండమను గ్రామములో నుండెడివాఁడు. నారసింహారెడ్డి యెచ్చటికిఁ బోయినను సీతఁడాతని ప్రక్కనే యుండువాఁడు. ఔకు రాజులు ప్రతిసంవత్సరమును వేసవికాలమున నొక గొప్పవిందు చేసెడివారు. ఔకు గ్రామమున నొక గొప్ప చెఱువున్నది. వేసవిలో నీ చెఱువులోని నీరు ఇంకిపోవును గావున నందలి చేపలనుబట్టి, సాటి జమీందారులకు విందు చేసెడివారు. ఆ విందునకుఁ బ్రతిసంవత్సరము నారసింహారెడ్డినిగూడ నాహ్వానించెడివారు ఒకసారి, రెడ్డి యా విందునకుఁ బోవుచు సీతనిగూడ బ్రయాణము కమ్మనెను. సీతఁడు వీర వేషమును ధరించి, బల్లెము చేతఁబట్టి రెడ్డి ననుసరించెను నారసింహారెడ్డి గుఱ్ఱముపై దౌడుతీయుచుండఁగా, సీతఁడాతని ప్రక్కనే కాలి పరుగుపెట్టుచు రెడ్డి గుఱ్ఱముకన్న పదిబారలు ముందుగనే యుండెనఁట! ఔకు పట్టణము సమీపించుచుండెను. వీర వేషమును ధరించిన సీతఁడు నడుము దట్టిని నేలకు జీరాడునట్లుగాఁ గట్టుకొనినాఁడు. రాజులుమాత్రమే యట్లు కట్టుకొనవలెను. తక్కినవారట్లు కట్టుకొనినచోఁ దమ్మవమానము చేసినట్లును, ద్వంద్వ యుద్ధమున కాహ్వానించినట్లును రాజులు భావింతురు అది నాఁటి వీరాచారము. సీతని వేషమును గమనించిన నారసింహారెడ్డి, ఔకురాజులతో వృథా కలహము వచ్చునని యోచించి 'ఒరే! సీతా! నీనడుము దట్టిని కొంచె మెగఁగట్టుము' అనెను. ఆ మాటలు

విని సీతఁడు గ్రుడ్డై 'దొరా! నీవు దొరవుకావు!' అని యధిక్షేపించెను. నారసింహారెడ్డి వాని పౌరుషమునకు మెచ్చుకోలుగా నొక్క చిఱునవ్వు నవ్వెను. సీతఁడు నడుము దట్టి నేల జీరాడుచుండఁగా నౌకు పట్టణమును బ్రవేశించెను. విందులో నౌకు రాజులు సీతని నడుము దట్టినిజూచి కోపించిరి. నారసింహారెడ్డికి ఫిర్యాదు చేసిరి. నారసింహారెడ్డి సీతని వారింపఁ జూచెను. కాని యా వీరుఁడు వినలేదు. ఆ విందులోఁ బాల్గొనిన యెవరితోనైనను సరియే తా నొంటి పోరునకు సిద్ధముగా నున్నానని సీతఁడు దండోరా వేయించెను. వాని శౌర్యము నెఱిఁగిన వారగుటచే నౌకురాజులుకాని, బనగానపల్లె నవాబులు కాని మాఱుమాటాడలేదు. అప్పుడు సీతఁడు హేళనగా 'ఈ ఔకు దాసరులు, పల్లెఫకీర్లు నాతో నొంటి పోరునకు రాఁగలవారా!' అనెనఁట. వారికది మఱింత క్రోధకారణమయ్యెను. తరువాతఁ గొన్ని దినములకు ఔకురాజులు హనుమదుగుండము గ్రామపు పొలిమేర దాఁటిని దిరిగి వచ్చెదమనియుఁ, జేతనైనచోఁ దమ్మెదుర్కొన వచ్చుననియు, కలికి నారిగానికిఁ గబురు పెట్టిరి. అతఁడు భయపడి, వెంటనే ఉయ్యాలవాడకుఁ బరుగెత్తుకొనివచ్చి సీతని కీ విషయమును దెలియఁజెప్పెను. సీతని కెక్కడలేని యుత్సాహమును వచ్చెను. ఔకురాజులతోఁ బోరాట మతనికి సంబరముగా నుండెను. నారసింహారెడ్డికిఁ జెప్పినచోఁ బోనీయఁడని, సీతడు రహస్యముగాఁ దన బల్లెము తీసికొని, కోట బయటకువచ్చి, యుద్ధోద్ధియై పోవుచున్నాఁడు కావునఁ జేతనున్న సురఁటిని గంటను గోటలోనికి విసరివైచి, కలికి నారిగానితోఁ గలసి హనుమదుగుండమునకుఁ బ్రయాణమయ్యెను. కలికినారిగాఁడు వివాహితుఁడు. సీతఁడు బ్రహ్మచారి. భార్యాపుత్రులను దలఁచుకొనుచు కలికి నారిగాఁడు కొంచెము వెనుకడుగు వేయుచుండెను. సీతఁ డది గ్రహించి, తానొక్కడే ఔకురాజుల నెదిరింతుననిచెప్పి, కలికి నారిగాని నింటికిఁ బొమ్మనెను. పొలిమేర దాఁటి దగ్గఱి గుట్టములపైనున్న పండ్రెండుగురు ఔకు వీరులను సీతఁడొక్కఁడే తన బల్లెముతోఁ గ్రుమ్మిచంపెను. సీతని శౌర్యమునకు ఔకు రాజులు భయపడిరి. అతనిని చంపనిచో నెప్పటికైనను బ్రమాదమని గ్రహించి, యందఱు నొక్కుమ్మడిగా సీతనిపైఁబడి, పద్మవ్యూహమున నభిమన్యుఁ గూల్చినట్లుగా నధర్మ యుద్ధమున సీతని పడవైచిరి: సీతని కింకను బ్రాణమున్నది. ఔకు గ్రామమునకుఁ గొనిపోయి రాజు సముఖమున నుంచిరి. ఔకురాజు సీతనిఁజూచి 'ఇప్పటికైనను నీ తప్పు నంగీకరించినచోఁ బ్రాణములతో నిన్ను విడుతుము!' అనెను. ప్రాణములు పోవుచున్నను సీతనికిఁ బౌరుషము తగ్గలేదు. 'నేను బ్రతికినచో మీకు మిండడనుగదా!' అని యఱచినాఁడు. దీనితో ఔకురాజు మండిపడినాఁడు. 'ఈ పొగరుబోతును గొంతు నులిమి చంపివేయుఁడు!' అని యాజ్ఞాపించినాఁడు. సీతని కొలఁది ప్రాణముగూఁడ హరింపఁబడినది. ఔకురాజులు సీతని శవమును బల్లకిలోనుంచి ఉయ్యాలవాడకుఁ బంపిరి. ఇది నారసింహారెడ్డికిఁ గోపకారణమయ్యెను నాఁటితో ఔకు రాజులతో నతనికిఁగల స్నేహము భగ్నమయ్యెను. ఉయ్యాలవాడఁ గ్రామమునకుఁ దూర్పు దిశలో నేఁటికిని సీతని గోరీ యున్నది.16

నారసింహారెడ్డి మహాబలవంతుఁడనియు, నతఁడు వెట్టుక్రిందఁబండుకొని, నోటిలో గుప్పెరాళ్లు పోసికొని, 'ఉఫ్' అని పైకి నూదినచోఁ జెట్టుపైనున్న పిట్టలు చచ్చి క్రిందపడెడినని రేనాటి జనపదు లిట్లఁ జెప్పుకొందురు. (ఇట్టి సంఘటన యొకప్పుడు కోవెలకుంట్ల—అళ్లగడ్డ మార్గములో నున్న 'కంపమళ్ల' యను గ్రామములో జరిగినదని కోవెలకుంట్ల సెంట్రల్ ఎక్సయిజ్ ఇన్‌స్పెక్టరు

16 శ్రీ సీతఁడు—కలికి నారిగాఁడు కథ'ను కర్నూలుజిల్లా, కోవెలకుంట్లతాలూకా ఉయ్యాలవాడ గ్రామములో 'దస్తగిరి' యను డెబ్బది సంవత్సరముల వృద్ధుఁడు 17–4–1966 న నాకుఁ జెప్పినాఁడు.

గారి నాయనమ్మ — తొంబది యేండ్ల వృద్ధురాలు చెప్పినది). రూపనగుడి సమీపమున నితఁడు కట్టించిన కోట శిథిలములను 'నారసింహారెడ్డి గోడలు' అని నేటికిని వ్యవహరించుచున్నారు ఇతఁడు గొప్ప శక్త్యారాధకుఁడనియుఁ దెలియుచున్నది. ఇతని కోట శిథిలములలో దుర్గగుడి యున్నది జగన్నాథుని కొండమీఁద ఆదిశక్తి దేవాలయమున్నదనియు, నామె తోడ్పాటుచే నారసింహారెడ్డి యయిదువందల శత్రుసైనికులను నఱికినాఁడనియు నాకు లభించిన వీరగాథావికలో నున్నది.

నారసింహారెడ్డి కేవలము యుద్ధవీరుఁడే కాదు; గొప్ప సాహిత్య పోషకుఁడు కూడ. ఈతనికడ 'ఓబళాచార్యులు' అను నాస్థానకవి యుండెడివాఁడు. ఇతఁడు రచించిన కావ్యము లేవియు నేడు తెలియరాకున్నను, నొక పద్యము మాత్రము వేటూరి ప్రభాకరశాస్త్రి గారి చాటుపద్యమణిమంజరిలోఁ గానవచ్చుచున్నది. ఇతనికిని కృష్ణపాటి వేంకటసుబ్బకవికిని సఖ్యమును గూర్చి జరిగిన సంభాషణ రూపమున నీ పద్యమున్నది. ఒకప్పుడు వేంకటసుబ్బకవి ఉయ్యాలవాడ నారసింహారెడ్డి యాస్థానమునకు వచ్చెను. నారసింహారెడ్డి యా కవిని సత్కరించి, కావ్యగాన మొనర్ప వలసినదిగా ప్రార్థించెను. అప్పుడు సుబ్బకవి యాశువుగా నిట్లనెను.

ఉ॥ 'సఖ్యము లేదుగా పవన
నందన దివ్యకటాక్ష వీక్షణా
వశ్య వరప్రభావ విభ
వానుభవాద్భుత భూమిభృద్ఘనః
కైశ్య ఘుమంఘుమంఘుమిత
గాంగఝరీవిలసత్తరంగ సా
దృశ్య కవిత్వ తత్త్వ ముఖ
రీకృత వేంకటసుబ్బమౌళికిన్!'

దీనికి సమాధానముగా నారసింహారెడ్డి యాస్థానకవియగు నోబళాచార్యుండును నిట్లాశువు చెప్పెను.

శా. 'కోకో! సఖ్య మసఖ్య మీశ్వర జటా
కోటీ తటద్వ్యధుని
ప్రాంచత్కీర్తి సకాశపేశల సుశబ్ద
ప్రక్రియాసుప్రమా
వేద గ్రంథ నిబంధ వార్జిత సము
న్నిద్ర ప్రభావ ప్రథా
సాంద్ర ప్రకర కృష్ణపాటికుల సిం
ధు వ్యాప్త చంద్రోదయా!''

ఈ పద్యమునుబట్టి యోబళాచార్యుండు గొప్ప వ్యుత్పత్తిగల ప్రౌఢకవియని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును. ఇతఁడు నారసింహారెడ్డి జీవితముపైఁ గావ్యము వ్రాసియుండినచో నది దిట్టకవి నారాయణకవి రంగరాయచరిత్రమువలె భాసిల్లియుండెడిది! ఓబళాచార్యుఁడు కావ్యమును వ్రాయలేదో, లేక వ్రాసియుండెను అది కాలగర్భమునఁ గలిసి పోయినదో నిశ్చయముగాఁ జెప్పలేకున్నాము.

నారసింహారెడ్డి ప్రజోపయోగకరములైన పనుల నెన్నింటినో చేసినాఁడు. గిద్దలూరునుండి దొనకొండవఱకును నొక పెద్ద కాలిరస్తా వేయించినాఁడు. దొనకొండ దగ్గఱనున్న గంగాదేవిపల్లెలో నితని వంశీకులుండెడి వారఁట. గుళ్ళదుర్తి, రూపనగుడి, ఉయ్యాలవాడలలో నితని వంశీకులను నేటికిని చూడవచ్చును

అనుబంధము 1:

నారసింహారెడ్డి పూర్వచరిత్ర:

క్రీ. శ. 1329 లో కాకతీయ సామ్రాజ్యము తురుష్కుల హస్తగతమైనది. ప్రతాపరుద్రుఁడును ఖైదీయై మరణించినాఁడు. అతని భాండాగారాధ్యక్షులగు హరిహరరాయలు బుక్కరాయలు కూడ ఖైదీలుగ ఢిల్లీకిఁ గొనిపోబడినారు. తరువాత ఢిల్లీసుల్తాను వీరియందు గరుణించి కర్నాట రాజ్యమునఁ గొంత భాగమిచ్చి పంపెను ఈ రాయల సోదరులు శ్రీ విద్యారణ్యస్వాములవారి ప్రోత్సాహమున క్రీ. శ. 1336 లో (ధాత సంవత్సర వైశాఖ శుక్ల

పంచమినాఁడు) 'విద్యానగర' మను పట్టణమును నిర్మించి రాజ్యమును విస్తరింపఁజేసిరి. గండికోట నుండి కంభమువఱకునుగల ప్రదేశముల నన్నింటిని జయించి, సామంతులను నియమించి, వారిచేఁ గప్పములను గొనుచుండిరి. అప్పుడు 'ముళ్లపాడు—గిద్దలూరు—నొస్సం' ప్రాంతములను 'చెంచుమల్లె'యను రెడ్లవంశము వారి కిచ్చిరి.

క్రీ. శ. 1565 లో జరిగిన తళ్లికోట యుద్ధమున విజయనగర సామ్రాజ్యము విచ్ఛిన్నమయ్యెను. తరువాత ముళ్లపాడు—గిద్దలూరు—నొస్సము ప్రాంతములు హైదరాబాదు నవాబగు కుతుబ్‌షాహీకి లోఁబడెను. క్రీ. శ. 1709 లో గిద్దలూరును బాలించుచున్న 'గోపాలరెడ్డి, కృష్ణారెడ్డి' యను సోదరు లీ నవాబునకు సామంతులై, ప్రతిసంవత్సరమును 12,229 పెగోడాలను గప్పముగాఁ జెల్లించుచుండిరి.

గోపాలరెడ్డియుఁ, గృష్ణారెడ్డియు నపుత్రకులుగనే గతించిరి. క్రీ శ. 1749 లో వీరి వంశమునకు సంబంధించిన 'రంగారెడ్డి' యను నతఁడు వచ్చి ముళ్లపాడు గిద్దలూరు సమీపమున నొక కోటను గట్టి, దానికి 'క్రొత్తకోట' యని పేరుపెట్టి పాలింపఁదొడఁగెను. ఇతని తరువాత నితని పుత్రుఁడు 'రామారెడ్డి' క్రీ. శ. 1763 లో రాజ్యమునకు వచ్చెను. ఇతని దివాను 'కేశవరెడ్డి'. ఈ కేశవరెడ్డి కడప నవాబునకుఁ జెందిన కొన్ని గ్రామములను బట్టుకొనెను. అందుచే కడప నవాబైన 'హాలీఖాన్' కోపించి, కేశవరెడ్డిని ఖైదుచేసి సిద్ధవటమున బంధించెను. రామారెడ్డిని జమిందారు పదవి నుండి తొలగించి, ఒక్కనొస్సముతాలూకామాత్రము రామారెడ్డి కుమారుఁడైన 'రంగారెడ్డి' కిచ్చెను.

పిమ్మట క్రీ. శ. 1779 లో రంగారెడ్డి అన్న కుమారుఁడైన జయరామిరెడ్డి ముళ్లపాడు గిద్దలూరులయొద్ద నొక ఠాణా నేర్పఱచుకొనెను. ఆ కాలమున నీ ప్రాంతమంతయు మైసూరురాజ్యము నేలుచుండిన 'హైదరాలీ'కి లోబడియుండెను. జయరామిరెడ్డి గిద్దలూరుకడ ఠాణా నేర్పఱచుకొనిన సంగతి హైదరాలీకిఁ దెలిసి, గుత్తిలోనున్న తన సర్దారు 'నెతడ్‌ఖాను'ను బంపెను. జయరామిరెడ్డి నెతడ్‌ఖాన్‌తో యుద్ధముచేసి పాఱిపోయెను.

క్రీ. శ. 1782 డిసెంబరునెలలో హైదరాలీ చనిపోయెను. కంభం మొదలగు ప్రదేశము లాంగ్లేయుల స్వాధీనమయ్యెను. అప్పుడు జయరామిరెడ్డి వంశమువారు క్రొత్తకోటను జేరి యది తమదని ప్రకటించుకొనిరి. కాని హైదరాలీ కొడుకైన టిప్పుసుల్తాను తన సేనాధిపతియగు 'ఉమరుద్దీన్ ఖాన్'ను క్రొత్తకోటపైకి పంపెను. ఉమరుద్దీన్‌ఖాన్ వచ్చి క్రొత్తకోటను స్వాధీనపఱచుకొనివెళ్లెను.

క్రీ. శ. 1792 లో నాంగ్లేయులకును, టిప్పుసుల్తానుకును సంధి జరిగెను. అప్పుడు 'చలిచలమల చిదంబర'మను నతఁడు వచ్చి క్రొత్తకోట ప్రాంతములను వశపఱచుకొనెను. ఈ చిదంబరము తరువాత 'జయరామిరెడ్డి'యు, నతని పుత్రుఁడు 'నరసింహారెడ్డి'యు క్రొత్తకోట నొస్సములకు జమిందారులుగా నుండిరి కాని నరసింహారెడ్డి ఆంగ్లేయులకుఁ గప్పము సరిగా చెల్లింపనందున క్రీ. శ. 1800 లో 'క్యాంబెల్' (Cambell) అను నాంగ్లసేనానివచ్చి, యీ కోటలను స్వాధీనము చేసికొని, నరసింహారెడ్డిని గుత్తికి ఖైదీగాఁ దీసికొనిపోయెను. అప్పటినుండియు నీ వంశమువారికి నెలకు బదునొకండు రూపాయలవంతున తవర్జి నిచ్చుచుండిరి. ఈ తవర్జి క్రీ. శ. 1847 వఱకును ఉయ్యాలవాడలోనున్న జయరామిరెడ్డి మనుమఁడగు నారసింహారెడ్డి కిచ్చుచుండిరి.

అనుబంధము : 2.

నారసింహారెడ్డి వంశవృక్షము

(21-4-1966 న కర్నూలుజిల్లా, నందికొట్కూరు తాలూకా, చెలిమళ్ళ రుద్రవరమను (గామమం)లోని పిచ్చుకుంట్లకడ సంపాదించితిని)

ఉప్పలూరు సంస్థానాధిపతులు
మూల పురుషుడు
ప్యారా లక్ష్మిరెడ్డి

- వీర నరసింహారెడ్డి
  - ఓబులరెడ్డి
    - వెంకట రెడ్డి
      - విశ్వపతి రెడ్డి
        - పెద్ద ఓబుల రెడ్డి
          - చిన్న విశ్వపతి రెడ్డి
            - ఓబుల రెడ్డి
  - లక్ష్మిరెడ్డి
    - వెంకట రెడ్డి
      - ఓబులరెడ్డి
        - బుచ్చిరెడ్డి
          - జయరామిరెడ్డి
            - నారసింహారెడ్డి (కథానాయకుడు) (ఈయన తల్లి సీతమ్మ) (నారసింహారెడ్డి భార్య (సి)ద్దమ్మ)
          - నారాయణ రెడ్డి
          - పెరుమాళ్లరెడి
      - లక్ష్మిరెడ్డి
        - రంగారెడ్డి
          - వెంకటరమణారెడ్డి
        - చలపతిరెడ్డి
          - రెడ్డయ్య
      - మల్లారెడ్డి
        - బుచ్చి పెరుమాళ్లరెడ్డి
      - తులసిపతి రెడ్డి
        - చలపతయ్య
          - పెద్దనారసింహారెడ్డి
          - చిన్న నారసింహారెడ్డి
            - రంగారెడ్డి
    - విస్నుతు నారసింహారెడ్డి
      - పెద్ద మల్లారెడ్డి
        - నారసింహారెడ్డి
        - సీతాపతి రెడ్డి
      - చిన్నమల్లారెడ్డి
        - గోపాల రెడ్డి
        - పెరుమాళ్లరెడ్డి

అనుబంధము : 3

నంద్యాల వేంకట్రామరాజుగారి లేఖ.—

'మహారాజశ్రీ రివిన్యూ బోర్డువారి
సముఖానకు —

కడపజిల్లా చిట్వేలో తాలూకా తవర్జీదారు నంద్యాల వేంకట్రామరాజువారు సలాములుచేసి వ్రాసుకొన్న మనవి అర్జీ యేమనగా —

కుంపినీ లాగాయతునుంచి సదరు తాలూకాతో నెల ఒకటికి పదమూడు రూపాయల తవర్జీ అనుభవిస్తు సదరు తాలూకున్ను మజిరా ములక్కాయల పల్లెలోను కాపురస్థుల మైయుండి పరాభవ సంవ

త్సరం అనగా 1845 వ సంవత్సరములో కోవెల కుంట్ల తాలూకా ఔకు అనే గ్రామంలో మా తమ్ములు వుండగా వారి భార్య కాయిలాతో నున్నందున ఆ వర్తమానము మాకు తెలిసి వారిని చూచే కొరకు మేము ఔక్కుపోయివుండగా, ఆ సమయంలో ఉయ్యాలవాడ, నరసింహారెడ్డి అనేవాడు సర్కారుకు యతిరాజ్జె దిద్దునడుపుతూ వుండే సమయంలో ఔకు నారాయణరాజు వారిమీద కలెక్టరు వారికి అనుమానం కలిగి వారిని కైదుకు చేర్చిన సమయములో నేనును అక్కడనే వున్నందున నన్ను కైదుకుచేర్చి కడపకు వంపించినంతట కోర్టు దొరవారి విచారణవల్ల తప్పితం సాబూతుకానందున మూడు సంవత్సరములు జామీను నిష్కర్ష చేయడంలో నారాయణరాజుగారితోపాటు మాకు కులాసా చేసినారు. ఆ లాగాయితి నాకు నడుస్తూవున్న తవర్జి అనామత్తు చేసినందున జామీను మూడు వత్సరములు వెళ్లించి కలెక్టరు కాకరేన్ దొరవారి తావుకువచ్చి మన్వి చేయగా బోర్డు వారికి మీా సంగతి తెలుపుకోవలసినదని హుకుం యిస్తామని సెలవు యిచ్చినందున సముఖానకు అర్జి వ్రాసుకున్నాను. కలెక్టరు కాకరేన్ దొరవారి దావా వల్ల యింతదూరము అయినదేకాని లేకపోతే నిరపరాధిని చుట్టము పొగిగా చూడబోయినందుకు కర్మవశాత్తు సంభవించినది మరొక వృత్తిగా జీవనము చేయవలసిన వారముకాము. నేను నా భార్యలు యిద్దరు, నా కుమారుడు, కోడలు, యిద్దరు కుమార్తెలు, నా తమ్ముని భార్య, ఆమె కుమార్తె, యిక్కడ నన్ను నమ్మి చూపెట్టుకొన్న జనము, ఈ యావజ్జనము ంా జీవనముతో బతుకవలసినది. గనుక ధర్మప్రభువులు పేదవాడనైన నామీాద అంతఃకరణయుంచి నా జీవనము నాకు దయచేసి నన్ను సంరక్షణ చేయవలెనని కోరుతూ యున్నాను.

చిట్టివేల్, 26–11–1850. } ఇట్లు నంద్యాల వేంకట్రామరాజుగారు.

ఈ లేఖకు కలెక్టరు కాకరేన్‌దొర వ్రాసిన 'రిమార్కు' ఈ క్రింది విధముగా నున్నది :

"Entered, No. 2484 of 1850.

From Nandyal Venkata Rama Raju Garu Targedar of Chittivel in the Jilla of Cuddapah·

(True copy) 28 December 1850.
(By order)

Praying for the continues of an allowence of Rs. 13 per mensom, which was stopped from his having been falsely implicated in the out break of Narasimha Reddi of Uyyalavada.

(True copy)

దీనికిం ప్రభుత్వమువారిచ్చిన యుత్తర్వు :—

"Under the order of government dated 20 th December 1847, the allowence of pention having been resumed; the Board cannot camply with his prayer.

The Revenue Board office
Fort St, George,
7 th, February, 1851."

ఈ లేఖలనుబట్టి ఉయ్యాలవాడ నారసింహారెడ్డి విప్లవము క్రీ. శ. 1845 లోం ప్రారంభమైనదనియు, నది 1847 వఱకును కొనసాగినదనియు, నీ విప్లవము కారణముగా కుంఫిణీవారు 20–12–1847 లో జమీాందారుల కిచ్చెడి భరణముల నన్నింటిని నిలిపివేసిరనియుం దెలియుచున్నది. సంస్థానముల నన్నిటిని తమ సామ్రాజ్యమునం గలుపుకొనుటయేకాక, నిరుపేదలైన జమీాందారులయెడ నాంగ్లేయు లెంత కాఠిన్యమును వహించిరో కూడ దీనినిబట్టి విశదమగుచున్నది. ఔకు రాజులను 1845 లో నిర్బంధించి, 1847 వఱకును జైలులోనుంచి, మూడేండ్ల జామీనుపై విడుదల చేసిరనియు, నీ మధ్యకాలమున వారికి వచ్చుచున్న తవర్జీని నిలిపివేసిరనియు, జామీాను కాలము పూర్తియైన తరువాతంగూడ (అనంగా 1850 లోం గూడ) వారికి తవర్జీనీయలేదనియుం దెలియుచున్నది.

ఆనుబంధము — 4 :

మోటాటిరెడ్లు — అవాంతర భేదములు:—

రెడ్లలో 'పోకనాటి — పాకనాటి — మోటాటి — పెడకంటి — కొడిదె — పంట — దేశూరు — వెలనాటి' మున్నగు శాఖాభేదము లెన్నియో కలవు. ఇందు నారసింహారెడ్డి మోటాటి కులమునకుఁ జెందినవాఁడు. అందునను రాజవంశీయుఁడు. సాధారణులగు మోటాటిరెడ్లకును నీ రాజవంశపు మోటాటిరెడ్లకును భేదమున్నది. ఈ భేదమును సూచించుటకే వీరికి 'నగరువారు' 'దొరవారు' అను విశేషణములను జేర్చుచుందురు. ఈ రాజవంశపు మోటాటి రెడ్లకును సాధారణులగు మోటాటి రెడ్లకును వివాహాది సంబంధము లుండవు.

ఈ రాజవంశపు మోటాటి రెడ్లలోఁగూడ రెండుశాఖ లున్నవి. ఇందొకశాఖకు 'నారసింహారెడ్డి గుంపు' అనియు, మఱియొకశాఖకు 'కృష్ణారెడ్డి గుంపు' అనియుఁ బేర్లు. ఇందు 'నారసింహారెడ్డి గుంపు' అను పేరులోని నారసింహారెడ్డి ప్రస్తుత కథానాయకుఁడైన ఉయ్యాలవాడ నారసింహారెడ్డి కాదు ఈతని పూర్వీకుఁడైన 'వీరనరసింహారెడ్డి' (చూ. అనుబంధము : 2). ఈ వీరనరసింహారెడ్డి కాలముననే యీ రెండు గుంపులును నేర్పడినవి. ఈ వీరనరసింహారెడ్డికి కృష్ణారెడ్డి యను సోదరుఁడుండెనఁట ఈ సోదరు లిరువురును నొక వివాహమునకుఁ బోయిరఁట. అక్కడ కృష్ణారెడ్డి భోజన సమయమున 'పట్టికోకలు' (=భోజన సమయమునఁ గూర్చొనుటకై పఱచెడి సన్నని పొడవైన బట్టలు) పఱువగనే యనాహూతుఁడై పోయి కూర్చుండెనఁట. ఇది యన్నకుఁ గోపకారణమైనది. తమ్ముఁడు తమ రాజవంశపు మర్యాదను మంటగలిపెనని కోపించి, యాతనితో నాటినుండియుఁ దెగ తెంపులు చేసికొనెనఁట. అప్పటి నుండియు వీరనరసింహుని వంశమువారికిని, కృష్ణారెడ్డి వంశమువారికిని గంచముపొత్తులుకాని మంచముపొత్తులుకాని లేవు. (నేఁడు కంచముపొత్తులు మాత్రమున్నవి.) కాని ఉయ్యాలవాడ నారసింహారెడ్డి పుత్రుఁడగు దొరసుబ్బయ్య తన పుత్రికయగు 'అక్కయ్య'ను కృష్ణారెడ్డి గుంపులోని యువకుని కిచ్చి పెండ్లిచేసెనఁట.

మోటాటి రాజకులములోని 'నారసింహారెడ్డి గుంపు'లో మొదట మూఁడు వంశములుండెడివి : 'పేరా (ప్యారా) — కసాని — కర్నాటి.' ఇందు పేరావారును, కసానివారును గోత్రదాయాదులు. (సగునాలగోత్రము). కర్నాటివారు వీరికి వియ్యపువారు. అనఁగా పేరావారును, కసానివారును కర్నాటివంశములోని యాఁడబిడ్డలను వివాహమాడుచుండెడివారు. కర్నాటివారిది మారుట్ల గోత్రము. కాలక్రమమున నీ వంశములలో ననేక గృహనామము లుద్భవించినవి. గోత్రదాయాదు లిరువదియేడు వంశములుగాను, వియ్యపువారు పదునాఱు వంశములుగాను చీలిపోయిరి : 'పేరా — కసాని — కసిరెడ్డి — నందిరెడ్డి — పెద్దిరెడ్డి — కాతా — సేగు — దాసి — గోవిందయ్య — ఆరుకట్ల — దండేల — కడియపు — హనుమంతుడు — పోలిమేర — కూనాల — సంగారు — పల్లె — లక్ష్మి — బసిరెడ్డి — పరదేశి — భూమిరెడ్డి — చిన్నకసాని — మద్దెల — ముసాని — చీరెడ్డి — వేములపాటి — దాసన' అనునవి సగునాల గోత్రదాయాది మోటాటిరాజవంశములు. 'కర్నాటి — కానాల — అక్కల — కత్తి — వెత్తి — నాగు — మశాన — చెన్నూరి — తిప్పగారి — తరిగోపుల — సందవరపు — కానాలబోరెడ్డి — దాసరి — కుక్కలరెడ్డి — దేవకమ్మ — లక్కనాల' అనునవి మారుట్ల గోత్రదాయాది వంశములు. మొదటి యిరువదియేడు వంశములవారును, దఱువాతి పదునాఱువంశముల వారితో మాత్రమే వియ్యమందుదురు.

ఇట్లు సగునాల గోత్రమునకుఁ జెందిన యిరువదియేడు వంశములును, మారుట్ల గోత్రమునకుఁ జెందిన పదునాఱువంశములును గలిసి మోటాటి రాజవంశమున 'నారసింహారెడ్డి గుంపు'నకుఁ జెందును. ఇట్లే కృష్ణారెడ్డి గుంపులోఁ గూడ ననేక గృహనామము లున్నవి. కృష్ణారెడ్డి గుంపులోఁ బ్రధానమైనది చెరుకోళ్ల గోత్రము

క్రీ. శ. 1845–47 సంవత్సరములలో రేనాటి సీమలో నాంగ్లేయులకు వ్యతిరేకముగా మహావిప్లవమును లేవదీసిన ఉయ్యాలవాడ నారసింహారెడ్డి మోటాటిరాజవంశమున 'నారసింహారెడ్డి గుంపు' నకుఁ జెందినవాఁడు. రేనాటి దానకర్ణుఁడని ప్రసిద్ధికెక్కిన బుడ్డా వేంగళరెడ్డిగారు (ఉయ్యాలవాడ, క్రీ. శ. 1820–1900) 'కృష్ణారెడ్డి గుంపు' నకుఁ జెందినవారు'. నారసింహారెడ్డి గుంపువారు నొస్సముకోటను, కృష్ణారెడ్డి గుంపువారు హనుమదు గుండమును బాలించిరి. కాలక్రమమున నీ రెండు గుంపులకును నాచారవ్యవహారములందుఁగూడ భేదము లెన్నియో కలిగినవి. అందుఁ గొన్నింటిని జూపెదను :

నారసింహారెడ్డి గుంపు	కృష్ణారెడ్డి గుంపు
1. 'తిరుమణిధారులు' (వైష్ణవులు)	'మోడీలు' (శైవులు?)
2. స్త్రీలు ఎడమపైటను వేసికొందురు.	కుడిపైటను వేసికొందురు.
3. విధవస్త్రీలు రవికను ధరింపరు.	విధవస్త్రీలు సహితము రవికను ధరింతురు.
4. స్త్రీలకు 'చెవిపుల్ల' (చెవికిపైన) యుండును.	చెవిపుల్లలేదు. 'ఉంగరమాల' (పోగు) యుండును.
5. పెండ్లిలో పువ్వులు, గంధతాంబూలములు' నీళ్లకుండ నుపయోగింతురు.	'ఎదుర్కొంబలి', 'మసిబోనము' నుండును.
6. చనిపోయినప్పుడు, శవమును మోసెడివారు, పీనుగ నచ్చటనుంచి, కోడిని కోసికొని తిని, గోవిందకొట్టుచు శవమును తీసికొనిపోవుదురు.	ఇట్టి పద్ధతిలేదు.
7. శవమును దీసికొనిపోవుటకు 'పాడె' కట్టరు. చేతులపైననే మోసికొనిపోవుదురు.	కఱ్ఱలతో 'పాడె'కట్టి తీసికొనిపోవుదురు.

అనుబంధము : 5.

'నయనాలప్పకొండ' :

దీనికి 'నయనాలతిప్ప' యనియుఁ బేరు. ఇది నొస్సమునుండి కోవెలకుంట్ల పోవు మార్గములో నున్నది. నొస్సమునకు సమీపమున (ఒక మైలు) నున్నది. దీనిపై శివాలయమున్నది. ఆ శివాలయము గర్భగుడిలో నొక బిలమున్నది. ఈ బిలములోనే నారసింహారెడ్డి తాను సంహరించిన తహశిల్దారు, బోందిలివాని శిరస్సుల నుప్పుకుండలలో దాచెనని చెప్పుదురు. ఈ నయనాలప్పకొండనుగూర్చి యొక కథ యున్నది.

పూర్వకాలమున నొక గ్రామములో నొక గృహస్థు యుండెను. అతఁడు గాజుల వ్యాపారము చేయుచుండెడివాఁడు అతని భార్య గర్భిణిగా నున్నప్పుడతఁడు దేశాంతరగతుఁడయ్యెను. తరువాత పదునైదు సంవత్సరములకుఁ దిరిగి యింటికి వచ్చెను. అతఁడింటికి వచ్చుసరికి భార్య యెచ్చటికో పోయెను. ఇంటఁ బదునైదు సంవత్సరముల కన్య యున్నది. ఆ కంసాలి యా కన్య సౌందర్యమును జూచి మోహపరవశుఁడై యామెను బలాత్కరించి మానభంగము కావించెను. తరువాత కొంతసేపటికి భార్య వచ్చినది. ఆమె భర్తను గుర్తించి, యా కన్య తమ కూతురని తెల్పినది. అతని దుఃఖమునకు మేరలేదు. తాను చేసిన మహాపాపమునకుఁ గారణము తన కన్నులేయని నిశ్చయించుకొని వానిని బెరికికొని, సమీపముననున్న కొండకుఁబోయి యట తపస్సు చేసికొనెను. నయనములు పోయినవాఁడు తపస్సుచేసిన కొండయగుటచే దానికి 'నయనాలప్పకొండ'యని పేరు వచ్చెను.

అనుబంధము : 6.

ఇతర విషయములు :

నారసింహారెడ్డిని గూర్చియు, నాతని వంశీకులను గూర్చియు రేనాటి సీమలోని గ్రామవృద్ధులు చెప్పిన మఱికొన్ని విషయముల నీక్రింద పొందుపఱచు చున్నాను :—

(1) నారసింహారెడ్డి తాతయగు చెంచుమల్ల జయరామిరెడ్డిగారి యొద్ద నొక బంటు కలడంట. అతఁడు గజ్జివాడు. మహా బలశాలి ఇనుప రోఁకలి యొకటి చేతఁబట్టుకొని రెడ్డి వెంటఁ బోయెడి వాఁడట. ఒకప్పుడు జయరామిరెడ్డి బవగానపల్లెకుఁబోయి కొలనులో స్నానము చేయుచుండెనట. అప్పుడు నవాబు యేనుగ యొకటి వచ్చి రెడ్డిమీద పడెను. వెంటనే యా గజ్జివాడు తన రోకలితో దానిని జావమోది తఱిమివైచెను.

(2) నారసింహారెడ్డి యొద్దకూడ నొక మహాబలాఢ్యుడగు ముస్లిము అంగరక్షకుఁడుగా నుండెడివాఁడట. అతని పేరు 'ఖాసింసాహెబ్' ఇతనిది ఆళ్లగడ్డ తాలూకాలోని రుద్రవరము. ఈతఁడు చిట్టచివరి వఱకును నారసింహారెడ్డి నంటిపెట్టుకొనియే యుండెను. జగన్నాథము కొండలోఁగూడ రెడ్డితో నుండెడివాఁడు ఆంగ్లేయులు రెడ్డిని బంధించి, కోవెలకుంట్లకుఁ దీసికొనిపోయి, యురితీయఁగా, నితఁడు 'రెడ్డిలేని జన్మ నాకేల?' యని యాత్మహత్య చేసికొనెను.

(3) యుద్ధసమయమున నారసింహారెడ్డి కడ గోసాయి వెంకన్న, ఒడ్డె ఓబన్న అను నమ్మిన బంట్లుండెడివారు. వీరిలో గోసాయి వెంకన్న గొప్ప మాహాత్మ్యము గలవాఁడు. ఇతఁడు చేతిలో నొక యాకు పసరు పోసికొని రాబోవు సంఘటనలను జెప్పెడి వాఁడట. ఆంగ్లేయ సైన్యము లే దిశలో వచ్చుచున్నవో నారసింహారెడ్డి యీ గోసాయి వెంకన్న సహాయముతోఁ దెలిసికొనెడి వాఁడట.

(4) గిద్దలూరు దగ్గఱనున్న క్రొత్తకోటలో నారసింహారెడ్డి ప్రయోగించిన ఫిరంగి యొకటి నేటికిని గలదు ఇక్కడ రెడ్డి, వాట్సన్‌తో యుద్ధము చేయుచున్నప్పుడు, ఫిరంగి నొక దిశలోఁ గాల్పించి, యచటి సైనికులచే 'నారసింహారెడ్డి చనిపోయెను!' అని యఱపించినాఁడట. ఆంగ్లేయు లందఱును నా దిశకుఁ బరువెత్తిరి. ఇంతలో నారసింహారెడ్డి యశ్వముపై వేఱొక దిశలోఁ బాఱిపోయెనట!

(5) నారసింహారెడ్డి దగ్గఱ నొక యపూర్వమగు ఖడ్గ ముండెడిదట. దానిని జేతిలోఁబట్టి విదలించినచోఁ బొడవుగా ముందుకుసాగి శత్రువుల కుత్తుకల నుత్తరించెడిదఁట. వీరపాండ్యకట్టబ్రహ్మన సోదరునికడఁగూడ నిట్టి ఖడ్గముండెడి దని చెప్పుదురు.

(6) రూపనగుడి గ్రామమునకు సమీపమున 'నారసింహారెడ్డి గోడలు' అను ప్రదేశమున్నది ఇచట పూర్వము 'బావనపల్లె' యను గ్రామ ముండెడిదట. ఇందు బ్రాహ్మణులు విశ్వబ్రాహ్మణులు నివసించెడివారు. అహోబిలక్షేత్రములోని గుడిని నిర్మించినదీ విశ్వబ్రాహ్మణులేనని చెప్పుదురు. నారసింహారెడ్డి గోడలదగ్గఱ వీరు నిర్మించిన దుర్గమ్మ దేవాలయము నేటికిని గలదు. ఇది గొప్ప మాహాత్మ్యముగల శక్తి. ఈ గుడి పైకప్పుపై రెండుపాతర్ల ధన ముండెడిదఁట దానిని బగులఁగొట్టి యెవరో యెత్తుకొనిపోయిరి. విగ్రహము క్రింద కూడ పాతర యున్నదని చెప్పుదురు.

(7) నారసింహారెడ్డి వంశీకు లరువది యాఱు గ్రామముల కధికారులు కావున నా యరువదియాఱు గ్రామములలోను వారు 'బీటు' తిరుగవలెను. అమావాస్యముందఱ నెనిమిదిరోజులు, నమావాస్య తరువాత నెనిమిదిరోజులు నీ 'బీటు' తిరుగుట యుండెడిదఁట.

(8) నారసింహారెడ్డికిని, అతని పూర్వీకులకును సంబంధించిన శిలాశాసనములు నొస్సము ఉప్పలూరు గ్రామములలో నున్నవి. నారసింహారెడ్డికి సంబంధించిన తామ్రశాసన మొకటి సంజామల గ్రామములోని కరణముదగ్గఱ నున్నదని తెలియుచున్నది.

నారసింహారెడ్డిపై ఉయ్యాలవాడలోనున్న కవివతంసులు, శతావధానులు శ్రీ పాణ్యం నరసరామయ్యగారు చెప్పిన పద్యముతో నా యీ వ్యాసమును ముగింతును :

మ. 'అమిత ప్రాభవ సర్వసైన్య సముపే
తాంగ్లేయ సామ్రాజ్య సిం
హము మీసల్ నులివెట్టి లాగుచు
నుదగ్రాటోప వీరోచితో
ద్యమ సంరంభ మొనర్చినట్టి
'నరసింహారెడ్డి' కాస్థాన రం
గముగా భూరి యశంబు గాంచినది
యీ గ్రామంబు పూర్వంబునన్.

నాటిక :

తప్పెవరిది?

శ్రీ డి. ప్రభాకర్

★

ఇందులో వచ్చు పాత్రలు

★

* రేణుక......
* రంగారావు......
* వేణు......
* వామనమూర్తి......

తెరలేస్తుంది...గది అలంకరణ ఇంట్లో డబ్బు మూలుగుతుం దనిపిస్తుంది. గది మధ్య సోఫాలో రేణుక ఏదో పత్రిక తిరగేస్తూ ఉంటుంది. రేణుక వయస్సు ఇరవై దాటొచ్చు

బయటనుండి 'రేణూ' 'రేణూ' అన్నపిలుపు వినిపిస్తుంది. రేణుక తలఎత్తి వాకిటివైపు చూస్తుంది. నిర్లక్ష్యంగా మళ్ళీ పత్రికపేజీలు తిరగేస్తుంది.

ప్రవేశం—రంగారావు— ఖరీదైనపంచె దానికి సరితూగే లాల్చీ వేసుకొని ఉంటాడు—నాలుగున్నర దశాబ్దాల పూర్వం పుట్టినవాడు.

*　　*　　*

రంగారావు : రేణూ! రేణూ! అరె...ఎక్కడేవున్నావ్! పిలిస్తే పలకలేదేం ?

రేణుక : పలకవలసిన అవసరం కన్పించలేదు.

రంగా : ఏం! ఎందుకని ?

రేణుక : ఇంటి యజమాని ఇంట్లోకిరాకపోరుగా — ఇంట్లోకొచ్చేక నేను కనపడక పోనుగా! ఆ మాత్రానికే నేను డియర్ వస్తున్నానండీ అని అరవటం—అదే మీ భాషలో కోయిల్లా పలకటం, తలుపుతీసి 'అదేమిటేటండి యింత ఆలస్యంగా వచ్చారు...ఇప్పటిదాకా ఎంత బోరుకొట్టిందో తెలుసా'...అని అబద్ధం ఆడటం—దానికి మీరు బంగారుపళ్లు బయటపడేలా నవ్వటం— ఎందుకీ నాటకం !

రంగా : (భళ్ళున నవ్వుతాడు) నేనింకా ఏమో అనుకున్నాను. నీవు కవిత్వంకూడా చెప్పగలవు రేణూ !

రేణుక : కవిత్వంలేదు పైత్యంలేదు గాని మీరు దయచేసి నా పేరును అలా సాగదీయటం మానెయ్యండి.

రంగా : అలా సాగదీయటం అంటే ఎలా దీయటం...

రేణుక : (తీక్ష్ణణంగా చూస్తూ) అదే! 'రేణూ' అని.

రంగా : అయితే 'రేణు' అననా...?

రేణుక : ఏం అవసరంలేదు. మా అమ్మ నాన్నా పిలిచే పేరుందిగా 'రేణుకా' అని, ఆపేరుతోనే పిలువండి...

రంగా : ఏమిటి! నేను నీ భర్తనైయుండి......... నిన్ను...మీ అమ్మా నాన్నా పిలిచే పేరుతో పిలవాలా?

రేణు : ఏం తప్పా!?

రంగా : (అనునయంగా) అహా తప్పనికాదు...కాని... నిన్నా పేరుతో పిలుచుకోవటం నా కెంతో యిష్టం! నీకు...

రేణు : యిష్టంలేదు...పైగా కష్టం కూడాను!

రంగా : అదేమిటి రేణూ (రేణు కోపంగా చూస్తుంది)......కా! నిన్ను మీ బావా వాళ్ళంతా రేణూ అని పిలుస్తుండేవారుగా.

రేణు : పన్నీరు చల్లవలసినచోట చల్లినప్పుడే రావల సిన సుగంధం వస్తుంది. మురికిగుంటలో చల్లినపుడు రాదండీ!

రంగా : (అర్థంచేసుకోని బాధపడతాడు) సరే...... నీ యిష్టం......నీ యిష్టం వచ్చినట్లు పిలుస్తాను రేణూ! నీ యిష్టం వచ్చినట్లే పిలుస్తాను...

(సార్...అంటూ వామనమూర్తి ప్రవేశం ముప్పైఏడుసంవత్సరాల వయ సుంటుంది. చేతిలో ఫైలుంటుంది...రంగారావు వామనమూర్తి ఆకస్మిక ఆగమనానికి బిత్తరపోతాడు.)

రంగా : అరె! వామనమూర్తి! రావోయ్! అలా నిల బడే వున్నావేం...వచ్చికూచో...(వామనమూర్తి కూచుంటాడు. రేణుక సర్దుకొని చిరునవ్వు నవ్వుతుంది.)

రంగా : ఈయన నీకు గుర్తున్నారా? పెళ్ళిలో మనకి పాలసీ చదివించేరు.ఆయనే ఈయన... వామనమూర్తని, మన కంపెనీలోనే...పని. (పైకి చూసి ఏవో లెక్కలువేసి) ఈయన నీకు వరసకు అన్నయ్య అవుతాడు.

వామనమూర్తి : నమస్కారమండీ! పాపం పోయి ఏ లోకాన ఉన్నారో...తులసమ్మగారు...ఎవరు? రంగారావుగారి ప్రథమ కళత్రం...పాపం వారాలుచేసుకొనే కుర్రాడిలా ప్రతిమంగళ వారం మా యింటికొస్తుండేవారు......మా ఆవిడ...తులసమ్మగార్ని అక్కా...అక్కా... అంటూ అసలు వదిలేదికాదండీ! మొన్న టికి మొన్న యిక్కడికివచ్చి వెళ్ళేనా...

రంగా : (ఆదుర్దాగా) మొన్న వచ్చావా! మా యింటికి! ఎందుకు...?

వామన : ఏదో పనిమీద వచ్చేనండీ! వచ్చాక తెలి సింది మీరు దంపతీ సమేతంగా సినిమాకు వెళ్ళారని!

రంగా : (హమ్మయ్య అనుకుంటాడు) ఊహూ! ఊ!!

వామన : ఆ! మొన్నటికిమొన్న దగ్గర ఆపాను కదండీ! మొన్నటికిమొన్న ఇక్కడికి వచ్చి ఇంటికెళ్ళేనా — వెళ్ళగానే అడిగింది మా ఆవిడ. 'మీ మరదలు గారెలా' ఉంటారండీ అని! నేను ఆశ్చర్యపోయి అడిగేను మరదలుగా రెవరే అని! అదేనండీ మాచెల్లి రేణుకమ్మ గారూ...ఎలా ఉంటారో చెప్పరూ అని ఒకటే గొడవ!

రంగ : అవేం వరసలోయ్! తప్పుడు వరసలు! ఎటు నుంచి చూసినా, 'రేణుక' నీకు మరదలు కాదు—నీ ఆవిడకు కావచ్చు...!

వామన : అమ్మమ్మమ్మ! అలా అనకండి! వరసలు కలపటంలో ఆడవారు చూపేదారే సరైన దారి! ఆదారివెంట పోతే పుష్కర సమయంలో గోదావర్లో మునిగినంత పుణ్యంకదండీ!

రేణుక : కాస్త పెద్దదైనా మంచి మాటే చెప్పారు. (నవ్వుతుంది)

రంగా : (కోపంగా వామనమూర్తినిచూచి మళ్ళీ రేణుకనుచూచి నవ్వలేక నవ్వి) ఔనౌను... అసలు నా పెళ్ళినాడు......

రేణు : ఎన్నో పెళ్ళినాడు...(వామనమూర్తి నవ్వు తాడు)

రంగా : (విసుగ్గా) అదంతా ఎందుగ్గానీ...నువ్వొచ్చిన పనేమిటో చెప్పటోయ్...వామనా!

వామన: అదాండీ! ఫైల్! సంతకం! ఫైలుమీద! కాదు కాదు ఫైల్లో సంతకాలు పెట్టాలండీ!

రంగా: ఫైల్లో సంతకాలికి, ఫైలుమీద సంతకాలకి, ఇదటయ్యా చటు! క్లబ్బుకు రావాలని తెలియదూ?

వామన: అదేమిటండీ: మొన్న మొన్నటివరకూ ఇంట్లోనే చేస్తుండేవారు!!

రంగా: మొన్న మొన్నటికి ఇవాళ్టి ఇప్పటికీ తేడా లేదటోయ్ వామనా! మొన్న మొన్నటి ప్రతిపక్ష నాయకుడు మినిస్ట్రీ ఇస్తానంటే ఇవాళ అధికారపక్షంలో చేరిపోతున్నాడా...? మొన్న మొన్నటికి వంటరివాడిని ఇవాళ జంటగా వున్నానా...? మొన్న మొన్నటికి...ఇవాళ్టి యిప్పటికి...

రేణుక: బోల్డు తేడావుంది...మొన్న మొన్నటిదాకా తలంటిపోసుకుంటే వెండితీగెల్లా తళుక్కుమన్న ఆయన తలవెంట్రుకలు ఇవాళ కంటికాటుకలా నిగనిగలాడుతున్నాయిగదా! మొన్న మొన్నటికి...ఇవాళ్టి ఇప్పటికి...

రంగా : (కొంచెం దగ్గరగా జరిగి) చాలా తేడావుంది కానీ...రేణుకా! కాస్త నా పరువు నిలుపుదూ!

వామన : (అదేం విననట్లు రేణుకతో) ఆపేశారేం! చెప్పండి!

రంగా : చెప్పేందుకు ఏముందోయ్! మొన్నటివరకు ఇంట్లోచేసే పనులు ఇవాళ క్లబ్బులో చేస్తున్నాను. కనుక ఈ ఫైళ్లు భుజాన వేసుకొని క్లబ్బుకురా...!

వామన : అలాగే సార్ (లేచి రెండడుగులు వేస్తాడు.)

రేణుక : చూడండి మూర్తిగారూ (లేచి పోరుగుతీసి రెండు రూపాయలనోటు తీస్తుంది). మీరు నాకోపని చేసిపెట్టాలి.

వామన : మహాప్రసాదం.

రేణుక : అయితే మీరు వీలుచూచుకొని నాలుగు బ్లాకలర్ దారపు యిచ్చెలు తెచ్చిపెట్టండి.

వామన : ఏవీ...యాంఖర్ మార్కువేనా...?

రేణుక : అరే! మీకు దారాలసంగతి బాగా తెలుసల్లే వుందే!

రంగా : ఒక్కదారాల సంగతేమిటి, బూరల సంగతి కూడా బాగా తెలుసు – వామనుడికి (కసిగా అంటాడు.)

వామన : మరి నే వస్తానండి–బ్లాకలర్ దారాలేగా! తెచ్చిపెట్టాలెండి......

రేణుక : ఇంద – ఈ రెండు రూపాయలూ తీసు తీసుకువెళ్లండ మరి...

వామన : డబ్బులా...హి...హిహి......ఎం కులేండి, నే తెస్తాగా......హి...హి...హి...

రేణుక : ఫరవాలేదు ఉంచండి...(నవ్వి) అందులోనూ నెలాఖరురోజు లనుకుంటాను......

వామన : అదేమిటండీ! రెండు రూపాయలకే బీదవాడినైపోతానా!

రేణుక : ఈ రెండు రూపాయలకే భాగ్యవంతులైపోరుగాని ఉంచండి. (రెండు రూపాయలనోటు వామనమూర్తి చేతిలో కుక్కుతుంది)

వామన : సరే! వస్తానండీ!!

(వామనమూర్తి నిష్క్రమణ)

రంగా: (నిట్టూరుస్తాడు) రేణు! కాస్త కాపీ తెచ్చిపెట్టగలవా? ఆజ్ఞాపిస్తే ఫలహారం కూడా తెచ్చిపెడ్తాను

రేణుక: అవసరం లేదు...కాఫీ చాలు! (రేణుక కాఫీ తెచ్చిస్తుంది)

రంగా: (కాఫీ సిప్ చేస్తూ) రేణుకా! నీ కోమాట చెప్తాను కోపం రాదుకదా!

రేణుక :హుః...నా కోపం!...ఎలుక కోపం!...ఒనుక్షణం ప్రాణ సంకటం తెచ్చిపెట్టే పిల్లిని...ఏమీ చెయ్యలేనికోపం!

రంగా: రేణుకా! నీకు నామీద ఓపలేని కోపముందని తెలుసు! నేనంటే నీకు రవంత యిష్టమైనా లేదని తెలుసు! కాని నేనే నా యిష్టాన్ని చంపుకోలేక, నువ్వంటే పడిచస్తున్నాను... ఆ కారణంగానే నువ్వెంత తూలనాడినా...తలవంచుకు పోతున్నాను...దాన్ని ఆసరగా తీసు

కొని నన్ను పరాయి వాళ్ల ఎదట పలచన చేస్తున్నావు...!

రేణుక : మిమ్మల్ని...నేను...పలచన చేయటమా? ఇదెక్కడి చోద్యం...?

రంగా: చోద్యంకాదు రేణుకా నిజం! నువు మాట్లాడే ప్రతిమాట నన్ను కించపరచాలన్న ఉద్దేశ్యంతో మాట్లాడుతున్నదే! నన్ను కించపరచాలన్న ఉద్దేశ్యంతో కాకపోతే మరేం ఉద్దేశ్యంతో ఆ వామనమూర్తిగాడికి దారాలు తెచ్చేపని పురమాయించావ్...? ఏం! నేను పెళ్లాం ముచ్చటతీర్చలేని వెధవనని...హాడనుకోవాలా? ఊరందరికీ చెప్పాలా?...

రేణుక: ఏమో నేను చెప్పినపని వెనుక మీరు చెప్పిన ఇంత పెద్ద ఉపన్యాసం ఉందని తెలీదు—తెలిస్తే నేనే వెళ్లి తెచ్చుకొనే దాన్ని...

రంగా: ఇప్పుడు నిన్నెవడూ బజార్న పడమన్లే! ఆ చెప్పేదేదో నాకు చెప్తే తెచ్చిపెట్టే వాడిని కదా...అంటున్నానంతే!...

రేణుక: తెచ్చిపెట్టే వాడ్ని...తెచ్చిపెట్టే వాడ్నంటు న్నారు-తెచ్చిపెట్టగల సామర్థ్యం ఉండద్దా స్తోమతు ఉండగానే సరా?

రంగా: ఏం...ఆ మాత్రం సామర్థ్యం నాకు లేదా?

రేణుక: (వ్యంగ్యంగా) ఎందుకు లేదూ...!ఉంది, మనదేశమంత ఉంది...మహాసముద్రమంత వుంది - అంత సామర్థ్యం ఉండి, తెచ్చారుగా మిషన్‌దారం తెచ్చిపెట్టమన్నపుడు పొట్లాల దారం...!

రంగా: సరే! ఈ పనులు చేయటానికి అసమర్థుడినని ఒప్పుకుంటాను...వెధవది వారపత్రిక తెచ్చి పెట్టే సామర్థ్యంకూడా లేదా!...నాకు

రేణుక : ఆ మాట నేనేం అన్లేదు...అంతచిన్నపని తమబోటి పెద్దలకు చెప్పే యిష్టంలేక చెప్పలేదు...

రంగా : నిజమే రేణుకా...! నువ్వు నిజం చెప్పావు—పెద్దపనులు చేసేందుకు అసమర్థుడిని, చిన్న పనులు చేసేందుకు అనర్హుడిని-ఏంచేస్తాం!

(తలుపుతట్టి లోనికి తోసుకొస్తాడు— వేణు. అతను తాగేడని అతని ప్రవర్తనే చెపుతూంటుంది... అతని శరీరం పాతికేళ్లుగా పెరుగుతూంది)

వేణు : నమస్కారం సార్! లోపలికి రావచ్చా!

రంగా : లోపలికల్లా వచ్చి...రావచ్చా అనడగుతున్నావా! ఎవరివోయ్ నువ్వు...?

వేణు : నేనా! (నవ్వి) తాగకముందు మానవుడిని... ఉష్!! తాగేను కనుక దేవుడ్ని!!

రంగా : (స్వగతం) బురదలోపడ్డ కుక్క వరహావతార మెత్తానంటుందట...

వేణు : అంటుందిరా ఫూల్! ఎందుకనదూ! అన్యాయంగా డబ్బు సంపాదించిన సీబోటివాళ్లంతా కాషాయగుడ్డలకూ, పెరిగినతలలకు, బోడి గుళ్ల పాదాలకు లక్షలలక్షలు సమర్పించు కుంటుంటే...కుక్కేవిటి...కాకిగూడా దేవుడి అవతారమేనంటుంది...

రంగా : హ్హాబ్బే! నేను మిమ్మల్నేం అనలేదండి! ఏదో తమరు దేవుడినంటున్నారుకదా...ఇది దేవాలయం కాదే...ఇలా వచ్చారేమిటా అని...

వేణు : (ఫక్కున నవ్వుతాడు) ఇపుడు దేవుడు దేవాలయాల్లో ఉండటంలేదు తెలీదా? ఆయన ఎక్కడుంటాడో తర్వాత చెప్తాగాని...ఇలా రండి...రహస్యం మరి (రంగారావు రాడు, వేణే రంగారావుదగ్గరకు వెళతాడు ముందు రంగారావువెవిదగ్గర చిటికెవేస్తాడు...మైక్ ముందువేసినట్లు. తర్వాత ఉఫ్—ఉఫ్ అని వూదుతాడు)

రంగా : ఏయ్! ఒళ్లు తెలీనిస్థితిలో ఉన్నావని ఏదో వూరుకుంటుంటే ఏమిటా పిచ్చివేషాలు—

వేణు : పిచ్చివేషాలు కావోయ్ భజగోవిందం చిట్కా పరీక్షలు—ఈ మధ్య లంచం తినే ఉద్యోగస్తులకూ, ప్రజల సొమ్ము మూట కట్టుకుంటున్న రాజకీయనాయకులకూ, వెలుగులో దొరకని సరుకులను చీకట్లో అందించి డబ్బు కూడబెడుతున్న వ్యాపారస్తులకు, చెవులు పనిచెయ్యటంలేదుగా, లేకపోతే జనం బండబూతులు తిడుతున్నా లెక్కచెయ్యకుండా

అన్యాయంగా సామాన్యుడిని దోచుకుంటున్నారంటే...చెవులుండా...మీరు చెప్పండి... ...(రేణుకవైపు తిరిగి)

రేణుక: కాదు...

వేణు: కరెక్ట్! అలాగే ఈ యిల్లు చూస్తుంటే ఈ యింటియజమాని...నే చెప్పినపై జాతుల్లో ఏదో ఒక జాతికి చెందిఉంటాడని అనుమానం వచ్చింది...అందుకే చెవులు పరీక్ష చేసాను అన్నట్లు (రంగారావువైపు తిరిగి) నీకు చిటికెలు వినిపించాయా...!!

రంగా: ఏమిటా పిచ్చివాగుడు! నువు బయటకు వెళ్తావా లేదా?

వేణు: వచ్చేటప్పుడు నిన్నడిగి వచ్చేనా, నువ్వెళ్లమనంగానే వెళ్లేందుకు...?

రంగా: ఇదెక్కడ పీడ.

వేణు: పీడ విరగడ కావాలంటే కరుణామయులు, సాంఘికసేవకులు, కళాపోషకులు, స్త్రీ జనోద్ధరణ సంఘాధ్యక్షులు అయిన శ్రీశ్రీశ్రీ ఇనప్పెట్టెల రంగారావుగా రెక్కడుంటారో చెప్పు...అంతే...సింపుల్...

రేణుక: ఆయనే...ఈ...

రంగా: (రేణుకతో) నువ్వుండు! (వేణుతో) ఏం బాబూ ఆయన నీకేం అవుతారు?

వేణు: నేను మా అమ్మకు కొడుకు నవుతానా... ఆయన మా అమ్మకు తమ్ముడవుతాడు...

రంగా: (ఆశ్చర్యంగా) నువ్వు...నువ్వు...వేణావా...?

రేణుక: ఏమిటి! మీరు మీ మేనల్లుడా!

వేణు: రంగారావుగారిల్లు తెలుసాంటే......అలా మూతలు తీసిన డబ్బాల్లో నోళ్లు తెరుస్తారేం...?

రేణుక: ఆ రంగారావుగారు వీరేనండీ!

వేణు: ఊం......చూడగానే అనుకున్నాను — కానీ పదిహేనేళ్ల క్రిందట చూచిన మనిషి అవునో కాదో అని అనుమానంవచ్చింది...కోపగించుకోకు మామయ్యా...

రంగా: నీవు నిజంగా...వేణూవేనా...?

వేణు: చిన్నప్పుడు నా వీపుమీద నువు బ్లేడుపెట్టి కోశావుట......మా అమ్మ చెప్తుండేది...ఆ మచ్చ చూపించనా మామయ్య...!

రంగా: ఒద్దు...నువ్...వేణూవే...ఇదేమిటి...ఇలా...

వేణు: ఆ మధ్య ఎప్పుడో నువ్వు స్త్రీ జనోద్ధరణ సంఘానికి అధ్యక్షుడైనట్లు పేపర్లో చదివి, ఈయన మీ మేనమామ అయివుంటాడ్రా అన్నాడు మా నాన్న...అది నిజమో కాదో తెల్చుకుందామని యిలా వచ్చాను...

రంగా: మీ నాన్న...?

వేణు: ఆయనకు బదిలీఅయింది.

రంగా: ఎక్కడికి...?

వేణు: పై లోకానికి...!

రంగా: శివ...శివా...పాపం!!...ఏమిట్రా జబ్బు...?

వేణు: డబ్బు...జబ్బు...

రంగా: అదేమిట్రోయ్...

వేణు: అదే మామయ్యా! బీదరికం! నేను వద్దంటున్నా వినకుండా నాన్న ఒళ్లు గుల్లచేసికొని, ఉన్న ఇల్లు కుదువబెట్టి నన్ను ఎం.ఏ కి పంపాడు...మొదట్లో నేను ఇల్లు కుదువబెట్టవద్దని ఏంతో బ్రతిమలాడాను... ఉన్న బి. ఏ. చాలు మన పొట్టలు నింపుకునేందుకాని, నచ్చజెప్పిచూశానుకానీ ఆయన వినిలేదు...బోడి నూటయాభై రూపాయల జీతంతో నా ఋణం తీర్చుకోవాలనుకుంటున్నావా వేణూ! అదేం కుదరదు. నువ్ ఎం. ఏ కావాలి, అయిదొందలరూపాయల జీతగాడివి కావాలి, గొప్పగొప్పవాళ్లు నీ చుట్టూ తిరగాలి. నువ్ ఆనందంతో నా చుట్టూ తిరగాలి సుఖసంతోషాలు మనింటి చుట్టూ తిరగాలి,...అని ఏవేవో ఆశలు పెట్టుకొని,... ఆకాశాన్నంటే అప్పులు పెంచుకొని నన్ను ఎం. ఏ కు పంపాడు.

రంగా: పాసయ్యావా...?

వేణు: అయ్యాను మామయ్య...ఫస్టున పాస్ అయ్యాను, కానీ ఉద్యోగమే రాలేదు.

రంగా: అసలు ఉద్యోగంకోసం తిరిగేవా! తాగి ఏ మూలన్నా పండుకున్నావా?

వేణు: అప్పటికి తాగుడు అలవాటు కాలేదు మామయ్యా—డిగ్రీ రాగానే ఉద్యోగాన్వేషణలో పడ్డాను—చెప్పులో తిరిగితే రోజుకో జత అరిగిపోతాయని ఒట్టి కాళ్లతోనే ఊరూరా తిరిగాను...గడపలు ఎక్కాను,గడపలు దిగాను—కడుపు చేత్తో పట్టుకొని కనిపించిన వాడి నల్లా కన్నీళ్లతో అర్థించాను—ఏమని...? ఆకలిగావుంది అన్నం పెట్టించండి...అని కాదు...అన్నానికి తగ్గింది అయిదు పైస లివ్వండి...అని కాదు...జేబు కొట్టేశారు బస్ చార్జీకి ఒక రూపాయి ఇప్పించండి...అనికాదు...

రంగా :మరేమని...?

వేణు: ఏమనా...? నా చదువుచూచి ఉద్యోగం ఇప్పించండి అని! నా సేవలు వినియోగించు కొని నా కింత ప్రతిఫలం ముట్టచెప్పండి...అని.

రేణుక: అయినా ఉద్యోగం ఇవలేదా...?

రంగా : నీ కెందుకు నువ్ లోపలికి...పో!

వేణు : ఉండనీయ్ మామయ్యా...జీవితం గురించి తెలుసుకుంటుంది.

(రేణుక కిచన్‌లోకి వెళ్తుంది)

రంగా : ఇంటిపట్టునుండేవాళ్ళకి బయటి విషయా లెందుకుగాని...నువ్ కానియ్.

వేణు : తడవతడవకు పెద్దలనబడేవారికి నైవేద్యాలు పెట్టాల్సిరావటంతో అప్పు మరి కొస్త పెరిగింది. వాళ్ల మనసులుమాత్రం కరగలేదు...

రంగా : అదేమన్న వెన్నట్టా కరగటానికి...

వేణు : కాదు కనకనే కరగలేదు. ఒక పెద్దమనిషి దగ్గరకు ఉద్యోగంకోసం వెళ్తే...నువ్ మా కులంవాడివికావు నీ కివ్వన్ పో!...అన్నాడు... మరో పెద్దమనిషి...బాబూ!...వేణూ... ఈ ఉద్యోగంకోసం ముగ్గురు మినిష్టర్లు పోటీపడుతున్నారు. బి. ఏ. నాలుగోసారి పాసై ఇంట్లో కూచున్నవాళ్ల పిల్లల్నికాదని ఎం. ఏ., పాసైన నీకు ఉద్యోగం ఎలా ఇస్తారనుకున్నావ్...పిచ్చివాడా పో! అన్నాడు... ఇంకో పెద్దమనిషి నాలుగువేలిస్తే ఉద్యోగ మిప్పిస్తానన్నాడు...

రంగా : ఇచ్చావా...?

వేణు : ఉంటేగా ఇచ్చేందుకు...! ఉన్నా ఇవ్వనని చెప్పాననుకో !...

రంగా : మంచిపని చేసావ్.

వేణు : ఇలా ఉద్యోగంలేని కుంటిబ్రతుకు ఈడ్చుకుంటూ వస్తూవున్నాను...ఒకరోజు అప్పుల వాళ్లు మా ఇంటిమీద డిక్రీ తెచ్చారు. తాతలనాటి ఇంటిమీద డిక్రీమాట వినగానే నాన్న కుప్పకూలిపోయాడు...జ్యోతులు వేసుకొని నా బంగారు భవిష్యత్తుకోసం ఎదురు చూచిన కళ్లు...ఆ కళ్లు శాశ్వతంగా మూత పడినై—తల్లీ తండ్రీ తనేఅయి పెంచిన నాన్న పోయాక నాకంతా శూన్యమనిపించింది—చదువుకున్నవాడ్ని ఉపయోగించుకోలేని...ఈ దేశంలో బ్రతకలేననిపించింది...ఆత్మహత్య చేసుకోబోయాను. కానీ, చేసుకోలేకపోయాను.. గుండెల్లో బాధ, లోకంమీద కసి చంపుకో లేకపోయాను......వాటిని మరచిపోయేందుకు తాగుడుకు అలవాటుపడ్డాను......ఇపుడు నా పనేమిటో తెల్సా...మామయ్యా...కూలినాలీ చేసుకొని ఒకటో, రెండో సంపాదించటం—సాయంత్రం ఒక పెగ్ బిగించటం—ఏ సత్రం అరుగుమీదనో స్వర్గం – కలలు కనటం... బాగుందిగదు మామయ్యా...

రంగా : బావుంది...చాలా బావుంది...ఇదంతా నిజమే నంటావా...?

వేణు : నా కథంతా చెప్పింది నీకు జాలి కలిగించి డబ్బు పుట్టించాలనికాదు మామయ్యా... ఊరూరా తిరుగుతూ...ఈ ఊరు వచ్చాను... రాగానే పేపరూ...నీ పేరూ...జ్ఞాపకంవచ్చి... డబ్బుకోసం తగాదాపడి...ఇల్లు వదలి వెళ్లి పోయిన మా.. మామయ్య...ఎలా ఉన్నాడో

చూచిపోదామని వచ్చానుగానీ...నీ సహాయం అర్థించిరాలేదు. వస్తాను—

(వేణు బయలుదేరిపోతుండగా రేణుక కాఫీ కప్పుతో ప్రవేశిస్తుంది)

రేణుక: అదేమిటి...ఇంటికొచ్చిన అతిథిని అలా పంపించేస్తున్నారు...(వేణుతో) కాఫీ తీసుకోండి...

రంగా: కాఫీకాదుగాని, కొంచెం మజ్జిగ తెచ్చివ్వు...

వేణు: అవును—కాసిని మజ్జిగ ఇవ్వండి. (రేణుక లోపలికి వెడుతుంది). నీకు మందుకిమందు బాగా తెలుసు మామయ్యా...!

(రేణుక మజ్జిగ తెస్తుంది. వేణు మజ్జిగ తాగుతాడు.)

వేణు: ఇక వస్తానండీ... సెలవ్.

రేణుక: అదేమిటి...అప్పుడే బయల్దేరుతున్నారు...?

వేణు: వెళ్ళాలండీ కొద్దిగా పనుంది......

రేణుక: పట్టుమని పదినిముషాలుముందు—నాకు పని యిచ్చేనాథుడు లేడని వాపోయారు—అంతలోనే పని, ఎక్కడ సంపాదించారండీ...!

వేణు: (నవ్వుతూ) ఈ పని కూటికి గుడ్డకు రాని పన్లెండి...

రేణుక: అటువంటి పని ఎందుకుగానీ, మీ మామయ్యగార్ని పట్టుకోండి...మీ చదువుకు తగ్గ ఉద్యోగం ఇప్పించగలరు...

రంగా: ఆఁ.. ఆ...అది నా వల్లేమవుతుంది...

రేణుక: ఆయన అలాగే అంటార్లెండి...నాకు తెలిసినంతలో ఈ వీధిలో నలుగురికి ఉద్యోగాలిప్పించారు...

రంగా: అదికాదు...రేణుకా...!

రేణుక: ఏది కాదండీ! స్వంత మేనల్లుడికి, అందులో అన్నీ అర్హతలున్నవాడికి ఉద్యోగ మిప్పించడానికి అలా ఇబ్బంది పడ్తారేం...!

రంగా: ఉద్యోగమిప్పించడానికి కాదు...కానీ...వీడు తాగి...

వేణు: మామయ్యా...!

(రేణుక మీరుండండి, నే చెప్తానన్నట్లు సైగ చేస్తుంది.)

రేణుక: ఆయన నిరుద్యోగిగా బాధలుపడలేక తాగుడు అలవాటు చేసుకున్నారు. మీరు...ఉద్యోగ మిప్పిస్తే ఆ బాధలూ ఉండవు...ఇక తాగవలసిన అవసరమూ వుండదు...

రంగా: ఏమంటావురా! వేణూ...?

రేణుక: ఆయ నిక అనేదేముంది...ఆయ నిక తాగరు... ఆయన తరుపున నేను ఒట్టేస్తున్నా...

రంగా: వాడి తరుపున నీవు ఒట్టువేయటమేమిటి...? నాన్సెన్స్...

రేణుక: పోనిద్దురూ...! మరీ మొహమాట పడిపోతున్నారు...పాపం...!

రంగా: సరే! నీకు ఉద్యోగమిప్పిస్తారా...వేణూ! ఆఁ...అవును...యింతకీ నువ్వెక్కడఉండటం—

వేణు: నేను...

రేణుక: ఇన్నాళ్ళూ ఎక్కడవున్నా ఇవాల్టినుండి ఇక్కడే వుంటారు...

వేణు: క్షమించండి...అభిమానంతో ఉద్యోగ మిప్పిస్తున్నారు...అంతే చాలు మీరు...మరీ శ్రమ తీసుకోకండి...

రేణుక: యిందులో శ్రమేముందండీ !......కలిసొచ్చే వాళ్ళని, కావలసిన వాళ్ళని వేరే ఉండనిస్తామా...(రంగారావుతో) ఏమండీ...!

రంగా: (అయిష్టముగా) ఆ...ఔనవును......వేరే వుండనిస్తామా !...

రేణుక: ఊరంత యిల్లుగలవాళ్ళం పూసంత మనిషికి స్థానం కల్పించలే మనుకున్నారా... (రంగారావుతో)...ఏమండీ...!

రంగా: ఔనా...కల్పించలేమనుకున్నావా...?

వేణు: అదేం కాదు...మామయ్యా...

రేణుక: అదేం కుదరదు...మీ రిక్కడే ఉండండి... ఫలానా రంగారావుగారి మేనల్లుడు అద్దె కొంపలో ఉంటున్నాడంటే ఎంత అప్రతిష్ఠ... ఏమండీ !

రంగా: అవునవును...ఎంత అప్రతిష్ఠ...ఒరె వేణూ! నువ్విక్కడే వుండిపోవాలిరా...కానీ...రేణుకా... వీడు మరీ బిడియస్తుడు...అన్నం తింటున్నప్పుడు వాళ్ళ అమ్మా నాన్న అటు ఇటు

తిరుగుతుంటేనే...వూ...ఇబ్బందిపడి అన్నం తినేవాడుకాదు—ఇక మనింట్లో కొత్తచేసి అసలు అన్నం తినడేమో!

రేణుక : మీరు మరీను...ఆయన మరీ చిన్నపిల్లవాడేమిటండీ...? కొత్తచేసేందుకు అంతగా కొత్తచేస్తే ఆయన పూర్తిగా భోజనం చేసేంతవరకు డైనింగ్ హాల్లోకి ఎవ్వరం వెళ్లకుండా వుంటేసరి...

రంగా : ఆఁ...అంతే...అంతే...అయితే వేణూ...నీకు జోల పాడితేనేగాని నిద్రపోయే అలవాటుంది గదూ!

వేణు: (ఆశ్చర్యంగా) జోలపాడితేగాని నిద్రపట్టని అలవాటు నాకు...లేదు మామయ్యా...

రంగా :(ఖంగుతిన్నట్లు) నీకు లేదూ!...ఓహో...ఈ అలవాటు నీకాదురా కాంతం కొడుక్కుంది కదూ...

రేణుక :రక్షించారు. ఆ అలవాటు ఉందంటే బజారుకు వెళ్లి జోలపాట రికార్డు కొనుక్కోరావాల్సొచ్చేది...

రంగా: (పెద్దగా నవ్వుతాడు) నిజమేనోయ్, మీ అక్కయ్య తలుచుకుంటే అంతపనీ చేస్తుంది. నిన్నిక్కడ ఉంచదలుచుకున్నా నువ్వెడతానన్నా నిన్ను తాళ్లతో కట్టించి మరీ...అపుతుంది. కదూ...రేణుకా...!

వేణు: అది సరేకాని మామయ్యా...ఈవిడగారు నాకు అక్కయ్య అవుతుందంటున్నావ్...ఈవిడే...మిసెస్...

రంగా: మిసెస్ రంగారావేనోయ్...! కానీ మీ అమ్మ వుంది చూశావ్...ఎవరు?

వేణు : మా అమ్మ...!

రంగా : ఆ! మీ అమ్మ...మొదటిసారిగా ఆడపిల్లను ప్రసవించి...నాతో...నీకు పెళ్లాం పుట్టిందిరా అంది...పుట్టిన పిల్ల పెరుగుతూ నా పెళ్లాం కావలసిన తరుణంలో మశూచితో మరణించింది...

రేణుక: అదృష్టవంతురాలు...

రంగా: పెద్దవాళ్ల బలవంతంమీద నేను తులసిని పెండ్లాడేను...

రేణుక: పాపం!

రంగా: తులసిమీద మీ అమ్మకు వల్లమాలిన అభిమానం...మీ అమ్మ తులసి తల ఒళ్లో పెట్టుకొని, ఇది తులసికాదురా...రంగా...నా శాంత...నా మొదటి కూతురు శాంతరా'... అంటూ కన్నీరు తుడుచుకునేది.

వేణు: అప్పుడు నేను చాలా చిన్నవాణ్ణనుకుంటాను.

రంగా: ఊఁ! నీ తల్లి స్వంత కూతురిలా చూచుకొన్న ఆ తులసి స్థానంలో వచ్చింది ఈ... ఈ రేణుక...అటువంటప్పుడు...ఈవిడ నీకు అక్కయ్యగాక...మరేమవుతుంది...?

రేణుక: ఇప్పుడావరసలపురాణ మొందుకుగానీ, మీరు స్నానానికి లేవండి. నీళ్లు పెడతాను...

వేణు : అబ్బే, ఎందుకండీ! శ్రమ...ఇప్పుడే స్నానం చేసొస్తున్నాను...

రేణుక: మొహమాటాన్ని ముద్దుగా చెప్పారుకానీ, మొహమంతా జిడ్డుకారుతోంది. స్నానానికి లేద్దురూ...?

వేణు: మరీ బలవంతపెడుతున్నారు...(లేచి రేణుక దారి చూపిస్తుండగా లోపలికి వెడతాడు)

(రంగారావు గుర్రుగా చూస్తాడు...లోపల్నించి రేణుక, వేణుల నవ్వులు వినిపిస్తాయి... రంగారావు హడావిడిగా లోపలికి పరుగెత్తుతాడు... కాస్సేపాగి వేణు, రంగారావు స్టేజీమీద కొస్తారు. దుస్తుల్లో మార్పుంటుంది...భోజనంచేసి వస్తున్న సూచన)

రేణుక: (వక్కపొడి అందిస్తూ) మీరు మొహమాటపడి సరిగా భోజనం చెయ్యరనుకుని భయపడ్డాను...

వేణు : మీకా భయం అవసరం లేదు. తిండిదగ్గర దేవుడొచ్చినా మనం మొహమాటపడం...

రేణుక: అదేమిటి! మీ మామయ్యగారు మీరు మరీ మొహమాటస్థులని చెప్పారు—?

వేణు : మామయ్య నా గురించి చెప్పబోయి కాంతం కొడుకు గురించి చెప్పుంటాడు......కదు మామయ్యా...!

రంగా : అవున్నా......అవును......అదిసరేగాని నువ్వు

పైకివెళ్ళి రెస్టు తీసుకో ఫో. కాసేపాగి ఇద్దరం బైటకి వెడదాం.

వేణు : అలాగే మామయ్యా. (లోనికి వెళ్తాడు)

(రేణుక మౌనంగా లోనికి వెళ్ళబోతుంది)

రంగా : ఈ వెళ్ళటం వెళ్ళటం మళ్ళా వేణు క్రిందకు దిగినపుడేనా రావడం...?

రేణుక : లేదు ఈ మధ్యలో గూడా వస్తాను. మీరు ఏదైనా పని పురమాయించినపుడూ–రమ్మని ఆజ్ఞాపించినపుడూ...

రంగా : హుం! ఆజ్ఞ! మినిష్టర్లనుకూడా ఆజ్ఞాపించగల నా శక్తి నీదగ్గరకొచ్చేసరికి సన్నగా సన్నగిల్లి, చప్పగా చల్లారి నిన్ను అర్థించమని ప్రేరేపిస్తుంది...రేణుకా...! అందుకే 'ఆ పనిచెయ్యి...ఈ పనిచెయ్యి......నాకు పాదపూజచెయ్యి' అని ఆజ్ఞాపించగల శక్తి ఉండీ ఆజ్ఞాపించలేక నన్ను ఒక మనిషిగా, భార్య ప్రేమ పొందాలని ఆరాటపడే భర్తగా చూడమని......అర్థించటంకూడాగాదు......ప్రార్థిస్తున్నాను...

రేణుక : మీ అర్థింపులకు, గద్దింపులకు లొంగి ప్రేమను పంచియిచ్చే శక్తి నాకు లేదు...... అయినా...అయినా అర్థించేందుకు, ఆజ్ఞాపించేందుకు తగిన అర్హత లుండొద్దూ!

రంగా : ఏమిటి నాకు లేని ఆ అర్హతలు...

రేణుక : ఏమిటా! మనసులేని ఆడదాన్ని పెండ్లాడటం! కూతురు వయసులో ఉన్న కన్నె మీద కన్నువేయటం...

రంగా : రేణుకా!!

రేణుక : ఏలాగూ ప్రేమించలేకపోతున్నాను...కట్టుకున్న నేరానికి కనీసం జాలిఅయినా చూపుదామంటే...ఆ ప్రయత్నాలకు కూడా మీరే అంతరాయం కలిగిస్తున్నారు...

రంగా : నేనా!!

రేణు : అవును మీరే! మీరు...నేనుచేసే ప్రతి పనిని అనుమానంతో చూస్తున్నారు. నాతో మాట్లాడే ప్రతిపురుషుణ్ని నాకు అన్నగానో తమ్ముడిగానో పరిచయం చేస్తున్నారు, ఇంత హీనంగా, నీచాతినీచంగా చూసే మీమీద... ప్రేమ, సద్భావం, సదభిప్రాయం...కనీసం సానుభూతి ఎలా కలుగుతుం దనుకున్నారు...?

రంగా : నన్ను పొరపాటుగ అర్థం చేసుకున్నావ్... రేణుకా! నీమీద అనుమానం కొద్దీ అలా ప్రవర్తించడం లేదు!...వాళ్ళున్నారే...నీతో మాట్లాడే మగపురుగులు...వాళ్ళు నేను లేని సమయంలో...పువ్వులావున్న నిన్నుచూచి... ఏ అఘాయిత్యానికి పాల్పడతారోనన్న భయం కొద్దీ అలా అంటున్నానే కానీ...నిన్ను అనుమానించి బాధపెట్టాలనిగాదు...–

రేణుక: ఆహాహా...ఎవరో దారినపోయే దానయ్య నాకు హాని, ద్రోహం ఇంకా ఏవో తలపెడతాడని...వాడికీ నాకు...అన్నా చెల్లెలు సంబంధం అంటగడతారా...! అయినా నాకు తెలియక అడుగుతాను...లోకంలో ఆడదానికి ఒక మొగడు తప్పించి మిగతా మగజాతి అంతా...అటు అన్నగానో...ఇటు తమ్ముడిగానో మారిపోవాలంటారా...?

రంగా : లోకంసంగతి నా కనవసరం—నాకు నీ సంగతే అవసరం...

రేణుక: పోనీ, మీ కవసరమైన సంగతేఅడుగుతాను... నాతోమాట్లాడే ప్రతివాడు నా ప్రాతివ్రత్యాన్ని పాతిపెట్టాలని ఎందుకనుకుంటాడో శెలవిస్తారా...?

రంగా : ఎందుకంటే...ఎందుకంటే...

రేణుక: నేను జగదేకసుందరినా? లేకపోతే, లోకంలో నేనుతప్ప ఆడవాళ్ళు లేరా...?

రంగా : ఆ రెండూ నా కనవసరం...! ధనవంతుడి భార్యవయ్యావు అంతే చాలు.

రేణుక: చిన్న సవరణ! ధనవంతుడి భార్యనుకాదు... ముసలి ధనవంతుడి పడుచుభార్య నయ్యాను కనుక—అవునా...!

రంగా : (మాట్లాడడు)

రేణుక: అదే నిజమయితే...మీరెన్ని వరసలు కల్పించినా...జరగవలసిన హాని జరిగే తీరుతుంది... వరసలకంటే, వయసులు...వయసులకంటే మనసులు–మనసులు పెంచే కోర్కెలు బలమైనవని గ్రహిస్తే మంచిది.

(రేణుక లోపలికి వెళ్ళిపోతుంది—రంగారావు క్రోధంగా చూస్తాడు వేణు నీట్‌గా తయారై క్రిందకు దిగుతూ)

వేణు: నే నెళ్తా మామయ్యా...

రంగా: (తేరుకుని) ఆ...ఆ...వెళ్ళొచ్చు...(లోపలికి చూచి) రేణ కాస్త తలుపేసుకో...

(రేణుక కొద్దిసేపయ్యాక తలుపు వేయటానికి వస్తుంది...వామనమూర్తి ప్రవేశం—దిక్కులు చూస్తుంటాడు.)

రేణుక : అరె! వామనమూర్తిగారా! రండి...... రండి...

వామన: (అనుమానంగా) అయ్యగారు...లేరా...?

రేణుక : లేరు...బయటికివెళ్ళారు...!

వామన: (నిబ్బరుగా నిలబడి) ఆఁ! బయటికివెళ్ళారా! అయినా, ఆయనేం మనిషండీ? ఎప్పుడూ పెళ్ళాన్ని...పిల్లలు లేరుగాబట్టి ఇంటిని వదిలి బజార్లవెంట తిరుగుతూంటారు...?

రేణుక : ఆయన అదోరకం మనిషిగానీ...మీరేమిటి.. పెళ్ళాం బిడ్డల్ని వదిలి ఇలా వచ్చేరు...?

వామన: అమ్మమ్మ ...కొట్టేరే!...దెబ్బకొట్టేరే...!

రేణుక : ఊరికే అన్నానుగానీ...కాఫీ (వామనమూర్తి ఆశగా చూస్తాడు) తాగొచ్చినట్లున్నారు...

వామన : చిత్తం...

రేణుక : మొహమ్మాటంగాని...పడటంలేదుగదా...?

వామన : చిత్తం...చిత్తం...

రేణుక: దేనికండీ చిత్తం.....పడుతున్నారనటానికా, లేదనటానికా...?

వామన: చిత్తం...నేను రెండు చిత్తాలన్నానుకదండీ... చెరోటి పడేయండి.

రేణుక : అయితే కాఫీ వద్దంటారు...?

వామన: నాకొద్దుకానీ, మీరు తాగుతూ కూచోండి... నాకు చూడముచ్చటగా వుంటుంది...

రేణుక : భలేవారే...మీరు (లోపలికివెళ్ళి కాఫీలు తెస్తుంది.వొకటి వామనమూర్తికి యిస్తుంది. రెండవది తను తీసుకుంటుంది.)

(వామనమూర్తి కాఫీ బ్రురుమని జుర్రుతాడు - రేణుక దడుసుకొని కాఫీ కప్పు క్రింద పడేస్తుంది.)

వామన : ఏమైందండీ ! !

రేణుక : ఏమీలేదు......ఎక్కడో గేదె అరుస్తున్నట్లుంటేను...

వామన : గేదెలా...! ఎక్కడ...! మీ దగ్గర రివాల్వరుందా? నాదగ్గర లైసెన్సుంది...ఇవ్వండి... కాల్చేద్దాం.

రేణుక : (రేణుక పెద్దగా నవ్వుతుంది) గేదెలి తోలేందుకు రివాల్వరు అక్కర్లేదుగానీ... కాఫీ త్రాగండి...

వామన : (కాఫీ త్రాగి) అయ్యగారు సంతకాలకి క్లబ్బుకు రమ్మన్నారా...మరి మీరేమో దారాలు తెచ్చిపెట్టమన్నారు...నేను క్లబ్బుకు వెడితే మీకు దారాలు తెచ్చిపెట్టే అవకాశం వుండదు చూడండీ...అందుకని...

రేణుక: అందుకని...?

వామన :మీ యిద్దరి మాటలూ చెరో కాగితం మీద వ్రాసి వెల్‌కంధర్మవాటాలో తూకం వేయించాను...నేను అనుకున్నట్లుగానే అయ్యగారి మాట గాలిలో పేలపిండిలా ఒకటే తేలిపోవటం (పకపకా నవ్వుతాడు)

రేణుక: అలాగా...!

వామన: ఊఁ! అయ్యగారి మాటని కొయ్యకి కట్టేసి-మీ దారాలకోసం—అట్నుంచి యిటు... యిట్నుంచి అటు...ఆ షాపునుంచి ఈ షాపుకి ఈ షాపునుంచి ఆ షాపుకు...

రేణుక: చెడ తిరిగేరు...అంతేనా...?

వామన: కాలికి పెన్సిల్ కట్టుకొని-చచ్చేట్టు మరీ తిరిగాను...

రేణుక: అమ్మో పాపం...!

వామన:ఆ తిరగటం మానకుండా ఎంతో సేపు ఎంతో దూరం తిరిగేను...అదంతాచెబితే మీరు అమ్మో పాపం...అని ఒక్కసారి అనరు... అమ్మయ్య పాపం అని వెయ్యిసార్లంటారు...

రేణుక: అరె...అలాగా...

వామన:(తలవూపి) కానీ...ఏం లాభం...? బ్లాక్ దారాలు దొరకలేదు...

రేణుక:ఏమిటీ...? ఈ ఊరు మొత్తంలో బ్లాక్ దారాలే దొరకలేదా...?

వామన: ఇది ఊరా! ఇది ఊరటండీ ఊరకుక్కల విడిదైతేనూ...!

రేణుక: అయితే బజ్జా దారాలు దొరకనట్లేనా...?

వామన: అమ్మమ్మ— మీరలా నిరుత్సాహపడితే లాభం లేదు - మీరు ఆజ్ఞాపించాలేగాని, అంతరిక్షానవెళ్లే 'అపోలో'ను జుట్టట్టుకు లాక్కొచ్చి మీ చుట్టూ తిప్పగలవాణ్ణి... మీవాణ్ణి...నన్నుంచుకొని మీరలా నిరుత్సాహపడితే ఎలా...?

రేణుక: మరేం చెయ్యమంటారు...?

వామన: ఆనందంగా...ఆనందంగా...ఏది నవ్వండి... దారాలు పట్టుకొచ్చేను...

రేణుక: అరె! ఎలా సంపాదించారు...?

వామన: ఊరంతా తిరిగి వేసారి...ఇంకిటివెళ్లేసరికి మా ఆవిడ—అటు పాతిక డబ్బాలు, ఇటు పాతిక డబ్బాలు పెట్టుకొని మధ్యలో కూర్చుని ఏదో కుట్టుకుంటోంది. నే వెళ్లి ఓ డబ్బా తెరిచి చూసేసరికి దాన్నిండా బజ్జా దారాలే! వాటి నన్నింటిని తీసుకొని మీ కిద్దామని బయల్దేరేసరికి మా ఆవిడ అడ్డుపడి ఆదారాల్తో నా చీరెమీద డిజైన్లు కుట్టుకుందామనుకున్నాను...అని ఏడ్పు మొహం పెట్టింది...నీ బోడి దారాలు తీసుకొని రేణుకమ్మగారు ఊరికే వుండర్లే — డిజైన్లు కుట్టేసిన ఓ అరడజను చీరెలు నీ మొహాన్న వేస్తారు...అనిచెప్పి యిలా వచ్చాను...

రేణుక: ఎందుకండీ తొందర పడ్డారు...?నే నిపుడే కుట్టానా! పెట్టానా! దారాలు ఆవిడకిస్తే కుట్టుకునేవారు పాపం...

వామన: ఆఁ...కుదుర్తుంది...ఏం కుదుర్తుంది...? దాని మొహం...కసపడ్డగుడ్డమీదల్లా ప్లస్సులూ, ఇంటూ గుర్తులు తప్పితే మరొటి మరొటి కుట్టటం దాని కసలు చేతనైతేగా...మొన్నటికి మొన్న......నా షర్టుమీద పిట్టను కుడతానని...పిల్లిని కుట్టింది...

రేణుక: ఆవిడ పిట్టని కుడతానని పిల్లిని కుట్టింది...నేకుడితే గబ్బిలమయ్యేది...

వామన: పిల్లి కంటే గబ్బిలం అందమైంది కదండీ! కలంలో పోసే గాని సిరా కాదన్నట్లు — మీ చేత్తో కుడితేనే ఎంబ్రాయిడరీకి పేరూ ప్రఖ్యాతులూనూ...?

రేణుక: ఏమిటో...మునగచెట్టెక్కిస్తున్నారు...!

వామన: అమ్మగారు...అలా అనకండి...నేనెప్పుడూ... మీ ముందు దేముడిమీద ప్రమాణం చేసి— ఉన్నదిఉన్నట్లే మాట్లాడతాను—అబద్ధం మాట్లాడను.

రేణుక: మీరు బాగా నవ్విస్తారు...

వామన: నవ్వంటే ఏమిటనుకున్నారు...? సంతోష చిహ్నం! సంతోషం సగంబలం...మీరు ఎల్లవేళలా నవ్వుతూ, నిండుగా, బలంగా వుండాలని...నా ఆశ...అయినా ఒక విచారకరమైన విషయం చెప్పక తప్పదు...

రేణుక: ఏమిటది ! ?

వామన: అదీ...రహస్యం !...నేను...అక్కడ...... కూచో...

రేణుక : కూచోవచ్చు...రండి (రేణుక ప్రక్కకు... జరిగి సోఫాలో చోటిస్తుంది.)

వామన : (కులుకుతూ) హి...హి...హి...ఈ చిరెక్కడ కొన్నారండి......? నాకు హస సాముద్రికంలో సమస్త శాఖలూ కుణ్ణంగా వచ్చండీ...! ఆఁ...!

రేణుక: అలాగా అయితే నా చేయి చూడండి...

వామన : మహాప్రసాదం (చేయి పట్టుకొని మురిసి పోతాడు.)

రేణుక : ఎలా వుందండీ...?

వామన : హి...హి... మెత్తగా వుందండీ !

రేణుక: ఏమిటండీ...నా అదృష్టమా...?

వామన : కాదండి...చెయ్యి...అదృష్టంగురించి కాఫీ తాగేక చెప్పకూడదని గురువాజ్ఞ...ఆ తరువాత తమరి చిత్తం...

రేణుక : గురువాజ్ఞ అయితే చెప్పద్దుగానీ,......ఆ రహస్య మేమిటో చెప్పండి...

వామన : అదా...రంగారావుగారు వచ్చేదురామ్మర్నాలండీ .. తాగుబోతు...తిరుగుబోతూ గూడనూ...?

రేణుక : (కాస్త కోపంగ) వామనమూర్తిగారూ ! ఇటువంటి విషయాలు నాతో చెప్పకండి— అంతగా చెప్పాలనుకున్న సరదావుంటే, రంగా రావుగారి జీవిత చరిత్ర అని పత్రికలకు వ్రాసుకోండి...

వామన : అమ్మమ్మ......(ముక్కుమీద వేలేసు కుంటాడు)

రేణుక : నాకు.....తలనొప్పిగావుంది...వెళ్ళి పడు కుంటాను...

(రేణుక వెళ్ళిపోతుంది)

(వామనమూర్తి గూడా పెదవి విరిచి వెళ్ళిపోతాడు)

(సశేషం)



గ్రంథ విమర్శలు

ఘటికాచల మాహాత్మ్యము

(సంపాదకులు : డా॥ కేతవరపు వేంకటరామకోటి శాస్త్రిగారు. ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవనము, సైఫాబాదు హైదరాబాదు–4. మూల్యము : 4-00)

తంజావూరు సరస్వతి మహలులోనున్న తాళపత్ర మాతృకలతో సరిచూచి ఘటికాచల మాహాత్మ్యమును, శ్రీ రామకోటి శాస్త్రిగారు పరిష్కరించినారు. అకాడమీవారి ధర్మమా అని రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యమేకాక యీ ఘటికాచల మాహాత్మ్యమును, ఉపలబ్ధ పాఠములతో చక్కగా ముద్రింపబడుట ముదావహము. 'కృతికర్త హృదయమెరిగి అవతారిక రచించు కవి కాలాంతరమున తన కృతి కబ్బుట రామకృష్ణుని పూర్వ పుణ్య విశేషము' అగునో కాదోగాని, సరియైన పరిష్కర్తలు దొరకుట మాత్రము పూర్వపుణ్య విశేషమే యగును. తాళపత్ర మాతృకలు తప్పుల తిప్పలు వాని నాధారముగా చేసికొని కవి ప్రయుక్త పాఠములను నిర్ణయించుట పరిష్కర్తల ధర్మము. ఈ పరిష్కర్తలలో రెండు తెగలకు చెందినవారు కనబడుదురు. మొదటి తెగవారు, ఉపలబ్ధ పాఠములను అనావశ్యకముగ సవరింతురు. కొన్నిచోట్ల, ఇచ్చవచ్చినరీతిని సవరింతురు. వీరి మూలమున కవి పాఠములు కొన్ని అడుగుపడును. రెండవ తెగవారు వ్రాయసకాండ్ర తప్పులన్నియు కవి పాఠములందురు. ఎట్టి అలాక్షణిక భాష వాడరాదని కవి ఉద్ఘోషించునో, అట్టి అలాక్షణికభాషనే ఆ కవి విచ్చలవిడిగా వాడినాడనుటకును సంకోచింపరు. ఆ కవి భాష యెట్లు లక్షణవంతమో తెలిసికొనలేని తమ అపరిజ్ఞానమునకు ఆ కావ్యమునేమి? గ్రాంథిక భాషనే భ్రష్టు పట్టించుటకు పూనుకొందురు. వీరికి సత్యము బోధపడదు: పడినను అపమార్గమున .కలవాటుపడిన వీరి మనస్సులో సత్యమునకెంతో సేపు తావుండదు. ఇటి పరిష్కర్త బారిని పడకపోవుట యీ గ్రంథకర్త యదృష్టమే యనవలెను.

ఉపలబ్ధ పాఠములనుబట్టి సాధు పాఠములను నిర్ణయించుట క్లేశముతో కూడుకొనిన పని. అన్ని సాధు పాఠములు, ఒక్కరికే తట్టవలెనని లేదు. ఎవరును సర్వజ్ఞులు కారు. కావున, పాఠ నిర్ణయ విషయమున నా అభిప్రాయముల నిట తెలుపుకొనుచున్నాను. (1) జటిపాళికి–అని, ప్రధాన పాఠముగా ముద్రితము. 'జేటి పటరికమున్' తాళపత్ర మాతృకా పాఠము దీనినిబట్టి, జటిపట, లికి' కవి పాఠమని తోచును (2) 'గండ్లు చెంగల్వ నవ్వాలుగండ్లు' అను తాళపత్రమాతృకా పాఠమునుబట్టి, (2–136) 'కీలుగంట్లు చెలంగ నవ్వాలుగంట్లు' కవి పాఠమనిపించును. (3) 1-1 పద్యమున 'వారాణిక' తాళ. పాఠముగా చూపబడెను. కావున 'తపస్విశ్రేణి వారాణిక' అను, గసడదవాదేశరూపమే కవి సమ్మతము కావచ్చును. (4) అల దక్షిణ మధురాస్థలమున భక్తపాలకుడైన కూడల వకియనామ్ము, (1–51) అని ముద్రితము. ఇట, అళఘియ తాళపత్రమాతృకా పాఠము. మధురలోనున్న విష్ణువునకు, కూడల వకియ నామము లేదు. 'కూడలలఘియ వైకుంఠితాఖ...మధురాభిధానపురము' అని కాళహస్తి మాహాత్మ్యము 'అలఘియ చొక్కనాథ శివుండల్లుండు' అను చోటను కాళహస్తి మాహాత్మ్యమున 'అలఘియ' శబ్దము కనబడును. దీనిని గూర్చి శ్రీ తిమ్మావఝల కోదండరామయ్యగారు ఇట్లు తెలిపియున్నారు. 'తమిళములో అళగు అనగా అందము. అళఘియ – అనగా, అందముగల అని యర్థము' (23–8–1965 లేఖ) తమిళమున, పరుషములే కాని సరళములు లేవు. పరుషములు వ్రాసి సరళములుగా నుచ్చరించుటమాత్రమిప్పుడు కలదు. సరళములకు లిపి నేటికిని లేదు. కావున, అళగు— అన్నది నిజమునకు, అళకు–అన్నమాట. దీనినిబట్టి,

'పాలకుఁడైన కూడల లకియనాము' అన్నది కవి పాఠమని నిర్ణయింపవచ్చును. (కూడల్=మధుర) (5) 'బాహువా పైతాణి శాలువుఁ దొంగిగించి' (1—91) అని ముద్రింపబడెను. శాలదూలగజేసి—తాళపత్రమాతృకా పాఠమనియు, సాలుఁదూలఁగఁజేసి—అనియు సవరింపవచ్చుననియు, ఫుట్‌నోటు. తాళపత్ర లేఖకులు వ్రాయు తప్పులలో నిదియొక రకమయినది. సేలుఁదూలఁగఁజేసి - అని వ్రాయుటకు వ్రాయసకాడు 'శాలుదూలగజేసి' అని వ్రాసియుండును 'సే' అను దానిని 'శా' అని వ్రాయుట వ్రాయసకాండ్రకు పరిపాటి. ఈ లేఖనసంప్రదాయమును గుర్తింపక పరిష్కర్తలు చేసిన అన్యాయములకు మితిలేదు. 'సేమంతికాప్రసగంధిత' (భాగ 10—796) అనుదానిని లేఖకులు శామంతికా—అని వ్రాసినారు భాగ. పరిష్కర్తలు చామంతి=శామంతి, అను గ్రామ్యరూపము సమాస ఘటితముగ నిట కూర్చబడెననుటకు సాహసించినారు. 'సెరణంబులు నీ పదాబ్జ సేవానిరతుల్' భాగ (11—15). అను దానిని లేఖకులు తమ అలవాటు చొప్పున, 'శరణంబులు నీ పదాబ్జ శావానిరతుల్' అని వ్రాసినారు. ఇట 'శావా' అన్న గ్రామ్యరూపమును సమాసములో వాడినట్లు భాగ. పరిష్కర్తలు వక్కాణించినారు. ఒక శబ్దమునకు రెండు తద్భవము లుండరాదట!! అందుచే 'సరణము' అనియేకాని 'సెరణము' ఉండదట!! ఆదిపర్వములో 'వృథ సేయఁగాఁ జనదు' అను దానిని లేఖకులు, 'వృథశాయగా జనదు' అని వ్రాసినారు. ఇట చేయు=శాయు, అన్నదే నన్నయ ప్రయుక్తమనుట యెట్టిదో యిదియు నట్టిదే. శాయగా—అన్నది యతిలో లేదు గనుక సవరింపవచ్చునందురేమో! యతిప్రాసలలోలేని వానిని సంస్కరించుట 'లిటరరీ ఫోర్జరీ' అగునట. ఈ అప్రకతవకలను విమర్శించుటకిట స్థలము చాలదు. సేలు అనునదే యిట కవి పాఠము. సాలునకు సేలు రూపాంతరము. (6) 2—112 పద్యములో 'కాలి సోకుల ను యంగమి' అనునది లపపాఠముగా కనబడుచున్నది. సరియగు పాఠమన్వేషణీయము. 'కాలిసో, కులనిడ, నవ్వ' అను రీతి నేదో పాఠమయియుండును. పొన్న—అను ప్రధాన పాఠము సరిపడుటలేదు. గున్న—అను పూ ము. పాఠమే మేలుగానున్నది. (7) 2–113 పద్యములో 'మోమునె, త్తరమునఁ జంపకంబుమియుఁ దా నురపొన్నయుఁ బూచె' అని కలదు. చంపకంబు, నగఁదా సురపొన్నయు—అను పాఠాంతరమే సరియైనదిగా కనబడును. 'నమేరుర్హసితేనచ' అను వృక్షశాస్త్ర వచనమునుబట్టి సురపొన్నకు నవ్వు దోహదక్రియ. (8) 'అంటె ధారుణినని తను నఖిలజనము, తూలనాడెడు నిందకుఁ జాల కపర, వారిధినిబడె నను గ్రుంకె వనజహితుఁడు' (2–141) అని ముద్రితము. ఇట ధారుణి—అపపాఠము. వారుణి-అను తాళపత్ర మాతృకాపాఠమే గ్రాహ్యము. వారుణి=(1) పడమటిదిక్కు (2) మద్యము అంటె వారుణిన్ అనఁగా మద్యపానముచేసెనని నింద. వారుణీసక్తినిఁ వివాఁటకున్న' (నరస 5–160) అని ప్రయోగాంతరమును గలదు. (9) 'గంగ కన్నను గడు వృద్ధగంగయనెడు, వహిని వహియించు నా పుణ్యవాహినిఁగని' (2-168) అనుచో 'వాహినివహించు' అనునది తాళపత్రమాతృకా పాఠముగను, పూ. ము. పాఠముగను 'ఫుట్‌నోటు'లో కలదు వాహిని—'కీర్తి, ప్రశస్తి—అని యర్థము. ఈ యర్థము వాడుకలో ఉన్నదిగాని నిఘంటువులలో లేదు' అని భాగవత పాఠ పరిశీలన గ్రంథములో చెప్పబడియున్నది. పాండు 1-40 పద్యమునను 'వాహిని' అనునది యిట్టి యర్థముననే వాడఁబడినది, కాన 'వాహిని వహించు' అన్నదే కవిపాఠము. సరియేకాని ఇట ఒక మాట చెప్పవలసియున్నది. వాహిని అనగా కీర్తి, ప్రశస్తి అని నిఘంటువులలో లేదు. వాడుకలో ఉన్నదని యీ భాగ. పరిశీలన గ్రంథకర్తగారనుచున్నారు. అనుమానాది శబ్దము లెన్నో అర్థవిపరిణామములలో తిక్కనాదులచే వాడబడి ఉన్నవి. ఉత్తుడు, పాది మొదలయిన శబ్దములను తిక్కన, యేవో అర్థాలలో వాడినాడని వీరే చెప్పినారు' అవి స్వతః ప్రమాణములని ఘోషించినారు. ఇట్టివీరే, రేయెండ=బాలాతపము — అను నర్థములో నన్నెచోడుడు వాడుటచే లతడలాక్షణికుడయి పోయినాడని నిరసించినారు. ఇది శ. ర లో లేదట. సూ. ని. చూడలేదు కాబోలు!! ఇట్లే మేఘడంబరములు=గొడుగులు; ప్రభాలి=కాంతి—ఇత్యాదులు తప్పులని, వ్యాక

రణ సమ్మతములు కావని వీరు వ్రాయ సాహసించి నారు. నిఘంటువులన్నైనను పరిశీలింపకుండ ఇచ్చ వచ్చినట్లు వ్రాయుట వీరికే చెల్లినది. చెప్పమరచి నాము. జీని=జీవము అను అర్థములో నన్నెచోడుడు వాడగా దీనిని నన్నయాదు లెవ్వరును వాడలేదని, వ్యాకరణ సమ్మతముకాదని, అందువల్లనే శ. ర. గ్రహింప లేదని, 108 పుటలో వక్కాణించినారు 180 పుటలో తిక్కన శ్రీనాథులే వాడినారని సెలవిచ్చినారు. ఇది పూర్వాపర విరుద్ధము. వాహినీ శబ్దమును కీర్తి యను నర్థములో నన్నయాదులు వాడలేదు. నిఘంటువులు గ్రహింపలేదు కావున, రామకృష్ణ మహాకవి భాష, కవులచేనూ, నిఘంటువులచేనూ నిరాకృతమయినదనియు, అందుచే సలక్షణమయినది కాదనియు, భాగ. పరిశీలన గ్రంథకర్తల ధోరణిలో నెవరైన అందురేమో! కాని అట్లనుట సరికాదు. దీని తత్త్వమును వివరించుటకు ప్రత్యేక గ్రంథమే ఆవశ్యకమనిపించు చున్నది. వాహినీ శబ్దమును కీర్తి యను నర్థమున వాడుటచే రామకృష్ణ మహాకవి యప్రామాణికుడయ్యెనని భ్రమపడుట. నిఘంటు కర్తలు, వాహిని-కీర్తి, ప్రశస్తి-అని యుద్ఘాటింప్పి యీ రామకృష్ణ మహాకవి ప్రయోగములను చూపుట కర్తవ్యమని మనవి.

ఘటికాచల మాహాత్మ్యమున కొన్ని ఛందోభంగ పాఠములు కనబడుచున్నవి. ఈ ఛందోభంగములు కవి చేసినవే యనియు, మహాకవులకును ప్రమాదము లుండు ననియు, అవి అట్లుండవలసినవేయనియు, శ్రీ రామకోటి శాస్త్రిగారు వాదింపరని అనుకొందును. సరియగు పాఠములు దొరకునేమో అన్వేషించుట ధర్మము. లేదా, ఉపలబ్ధ పాఠములను బట్టి సరియగు పాఠమును గుర్తించు ప్రయత్నము చేయవలెను. కనీసము, సరియగు పాఠములు లభింపలేదయ్యెన చెప్పుట, శ్రేయస్కరము. ఉపలబ్ధపాఠములనుబట్టి సాధుపాఠములను నిర్దేశించుట ప్రస్తుత కర్తవ్యము. (1) 'అలరుందివెల గెలుచు చేతులును కుంద, నంపు గిండ్లను గదుము పాలిండ్లు మింటి' (2-82) అని ముద్రితము. యతితప్పినదని ఫుట్‌నోటు. 'అలరుందివెల గెలుచు చేతులుం బసిండి, గిండ్ల సొంపును గదుము పాలిండ్లు' అను రీతిని, కవిపాఠముండును (2) పచ్చిలుకాని చిలుక సాప్రమాణికాక (2-87). ఇట. సాంబ్రాణి గాక - అని గ్రహించినచో యతి సరిపడును. (3) సం, స్తన సామ్యాత్మక సంగ దూరతర సర్వ ప్రాణి సంరక్షణా. (2-183) ఇట యతిభంగము కలిగినది. ధక్షప్రాణ - సాధుపాఠ మననగును. (4) 'వే, వెఱగొఱుల్ వెంవెల్లనై యనిమిషుల్ నిర్వి ణ్ణులై చూడఁగన్' (2-204) వె, న్వెఱ—అను, పూ. ము. పాఠమున యతిభంగములేదు. (5) 'హరి వనతుండు సుప్రసిద్ధుఁడు అగుచు' (3-43) ఇట, సరియగుపాఠ మన్వేషణీయము. 'హరివనతులం ప్రసిద్ధుఁడు అగుచు నెప్పుడు' అను రీతిని గ్రహింప నగును. (6) 'అసమాక్ష ముఖ్యులు నీ యాజ్ఞ దాటంగలేరు' (3-48) అనుచో గణభంగము ముద్రి. ము. ముఖ్యులు—అ; పూ ము.— పాఠము. కావున, 'అసమాక్షముఖులు నీ యాజ్ఞ దాటఁగలేరు' అని గ్రహింపవలెను. ముఖులు - అసాధువుకాదు. 'గరుడోరగముఖుల కోరికకు విఘ్నంబుల్' పారిజా. 5-24 (7) 'అని మునీంద్రులు గొనియాడఁగా నృసింహు' (3-49) ఇట యతి తప్పినది. 'అని మునీంద్రముఖులు కొనియాడఁగను నృసింహు' అన్నచో సరిపోవును (8) మఱికొన్ని ఛందోభంగములు కలవు గాని అవి ముద్రణస్ఖాలిత్యములు కావచ్చును. 1-58, 64; 2-66, 114, 122, 157, 174, 193, 252, 253, 3-15, 21, 24, 30, 37, 55 స్థలములు చూడనగును.

పూర్వముద్రణమునందలి కొన్ని గ్రంథపాతాదులు శ్రీ రామకోటిశాస్త్రిగారి పరిశోధనమూలమున పూరింపబడినవి. 2-29, 97, 114, 121, 122, 132 పద్యము లరయవచ్చును. నరసింహునకు లోచనత్రయము చెప్పుట వింతయని ఉపోద్ఘాతములో కలదు (72 పు) ధ్యానశ్లోకము ననే కాక నరసింహునకు మూఁడు కన్నులు మంత్ర శాస్త్ర ప్రసిద్ధము. ఇంతేకాక, 'త్రిలోచన త్రయ దీప్తి దీటుకొనంగ ......రాజరిల్లె శ్రీ నరసింహ

దేవ మూర్తి' అని నృసింహపురాణము. (నృసింహ. 5 – 109). 'ఘటికాచల మాహాత్మ్యమునందలిది కేవలము రగణములతోనైన దండకము' అని ఉపోద్ఘాతమున చెప్పబడెను (54 పు). కాని, 'సప్తప్రహదంబుల్ ముదంబొప్పఁ గావించి' అను స్థలమునుండి (104 పు) దండకము తగణములతో కూర్పబడినట్లు కనబడును.

తాళపత్రమాతృకలతో సరిచూచి పాఠభేదములను సేకరించి పరిష్కరణ కార్యమును నిర్వహించిన శ్రీ రామకోటిశాస్త్రిగారును, సాధుపాఠ విషయగ్రహణమున తమ స్వానుభవమును మార్గదర్శకముగా చేసిన డా॥ బి రామరాజుగారును, అభినందనీయులు. కార్యవర్గమువారి ముందు పెట్టి అకాడమియే యీ గ్రంథమును ప్రకటించునట్లు నిర్ణయించిన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికిని కార్యవర్గమునకును, భాషాభిమానుల తరపున కృతజ్ఞత తెలుపుచు ఈ సమీక్షను ముగించుచున్నాను. స్వస్తి.

కా వ్య ల క్ష ణ ము

(గ్రంథకర్త: కీ. శే శ్రీమాన్ కిళాంబి వేంకట వేదాంతాచార్యులుగారు. (విద్వాన్) ప్రతులకు: శ్రీమాన్ కిళాంబి వీరరాఘవాచార్యులగారు పోస్టల్ డిపార్ట్మెంటు, నిడదవోలు. మూల్యము : 3 – 00. 1/8 డెమ్మి 130 పుటలు.)

'శబ్దార్థదోషములు, గుణములు, వృత్తులు, రీతులు, పాకములు, అలంకారములు, ఛందస్సు ననునవి యొక్కచోటనుండక పలుగ్రంథములలో నున్నవి.' కావున ఈ విషయము లన్నింటిని ఒకచోట చేర్చి వ్రాయుట విద్యార్థుల కుపకారకమను అభిప్రాయముతో రచింపబడిన గ్రంథమిది. అప్పకవీయము, నరసభూపాలీయము, కావ్యాలంకార సూత్రవృత్తి, రసమంజరి, మొదలగు గ్రంథములనుండి లక్ష్యలక్షణములు చూపబడినవి. కాళిదాసత్రయము, శాకుంతలము, విశ్వగుణాదర్శము, మనుచరిత్ర, ప్రబంధరాజవేంకటేశ్వర విజయవిలాసము, మున్నగువానినుండి లక్ష్యములు గ్రహించిరి. స్వంతలక్ష్యములుగూడ కొన్ని కలవు.

శ్రీ ఆచార్యులుగారు ట్రెజరీ ఆఫీసులో ఉద్యోగులుగ నుండిరట. సాహిత్యేతరరంగములోనుండియు, ఇట్టి గ్రంథరచనకు పూనుకొన్నందుకు గ్రంథకర్త అభినందనీయులు. గ్రంథములో అచ్చుతప్పులు కోకొల్లలుగా ఉన్నవి. కారణము గ్రంథకర్తల పరోక్షమున ముద్రణము జరుగుటయే కావలెను. ఇట్టి గ్రంథములలో దోసగులు దొరలుట సహజము. అట్టి వానినిగూడ సరిచేయుట ఆవశ్యకమగును. కావున కొన్నింటి నిట చూపుచున్నాను. (1) గద్యకావ్యములలో కథాపూర్ణోదయమును, పద్యకావ్యములలో మనుచరిత్రను చేర్చినారు. ఇది కేవలము పొరపాటు. (2 పు) (2) 'అష్టాదశవర్ణనలు కల్గి సర్గబద్ధముగలది కావ్యమందురు' అన్నారు. ఇది మహాకావ్యమగును. (3) 'ఉపమ చాలకున్న న్యూనోపమంబు— హైమవసనుండైన హరి మేఘ నిభుండన' అను లక్షణము నుదాహరించి 'శ్రీహరిని మేఘునితోఁ బోల్చుట నీచోపమ, అనఁగా హీనోపమ' అని వివరించినారు న్యూనోపమను, నీచోపమ మనియు, హీనోపమ మనియు ననుట సరికాదు. శ్రీహరిని మేఘునితో పోల్చుటలో నీచత్వమును లేదు హైమవసనుడైన హరి – ఉపమేయము. మేఘము — ఉపమానము ఉపమేయమునందలి హైమవసనుఁడు అను ధర్మమునకు ప్రతిబింబమగు ధర్మ ముపమానమున న్యూనమయినది కాన న్యూనోపమమని చెప్పవలెను. (34 పు.) (4) పతత్ప్రకర్షమున కిచ్చిన నరసభూపాలీయ లక్ష్యములో పతత్ప్రకర్షము లేదని గమనింపక, సాధారణధర్మమునే వర్ణించుట పతత్ప్రకర్షమని పొరపాటుగ వ్యాఖ్యానింపబడెను. (35 పు.) (5) ప్రస్తారము తప్పుగా వివరింపబడినది. వృత్తసంఖ్యకు చెప్పవలసిన వివరణము ప్రస్తారమునకు పట్టించినారు. (105 పు) (6) సంయుక్తాక్షరయతి, వికల్పసంధియతి అనునవి ఉభయపక్షములలో చేరునని వ్రాసినారు. ఇది ప్రామాదికము. (7) యరలవలు పరస్పరము యతిమైత్రినందున్నారు. ఇదియు సరికాదు (122).

నరసభూపాలీయమున ఓజోగుణమునకు 'మందార బిసకుంద కుందాది విధి బృంద బృందార

కాప్త శోభిత యశుండు' అను పద్యము లక్ష్యముగ నీయబడినది ఇందు గాఢబంధము లేదు గనుక ఇది సరియగు లక్ష్యముకాదు. దీనినిచూపి 'గాఢబంధత్వము వర్ణ ప్రౌఢియుఁ గలదు' అనుట పొరపాటు. (9 పు) ఐలబిల దుశ్చ్యవన శబ్దము లప్రయుక్తములని నరస భూపాలీయము ననుసరించి చెప్పినారు. ఐలబిల శబ్దము మాఘ శ్రీనాథాదులు ప్రయోగించినదే. దుశ్చ్యవన శబ్దమును తిక్కన ప్రయోగించి యున్నాడు. కావున ఇవి యప్రయుక్తములు కావనుట యుక్తము. 'కోమలి చన్నులు కన్నులు' అను పాఠముతో గ్రామ్యమున కుదాహరణ మీయబడినది. చండ్లును గుండ్లును — తాళపత్ర మాతృకా పాఠమని యందురు. 'అరిగె, న్నపరగిరి కినుఁ డనంగా' అనునది విసంధికి లక్ష్యముగ నరసభూపాలీయమున ఈయబడినది. ద్రుతద్విత్వమును విసంధి దోషమనుట అపరిశీలన మూలకము కావున దీనిని గ్రహించుట సరికాదు.

శ్రీ ఆచార్యులుగారు విప్రనారాయణ చరిత్రను, ఆంధ్ర నిఘంటువును రచించినారట వానిని గూడ త్వరలో ప్రకటించి వారి రచనలను వెలుగులోనికి తీసికొని రావలసిన భారము పుత్రులపై కలదు

—వంతరాం రామకృష్ణారావు.

ప్రతాపసింహము

నవల. రచయిత - శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి. పుటలు—134. వెల రూ. 2-00. ప్రాప్తిస్థానం—భాషాపోషక గ్రంథమండలి, వేంకటేశ్వర నగర్, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా.

పత్రికా ప్రచురణము

రచయిత - శ్రీ జోశ్యుల నారాయణమూర్తి. పుటలు—152. వెల 3-00. ప్రాప్తిస్థానం— శ్రీ జోశ్యుల నారాయణమూర్తి, హిందు విలేఖరి, ద్వారకానగరం, కాకినాడ—3

అభిజ్ఞాన శాకుంతలం

తెలుగు అనువాదం - శ్రీ విష్ణుల సీతారామశాస్త్రి. పుటలు—154. వెల రూ. 2-00. ప్రాప్తిస్థానం—శ్రీ విష్ణుల సీతారామశాస్త్రి, సీనియర్ తెలుగు పండిట్, ఎస్. ఎం. వి. స్కూలు, బొబ్బిలి, శ్రీకాకుళంజిల్లా.

సిద్ధచక్ర

జైన విషయక నాటిక, రచయిత - శ్రీ చల్లా రామగణపతిప్రసాదశాస్త్రి. పుటలు – 36. వెల 0-15. ప్రాప్తిస్థానం—జైన్ ఆధ్యాత్మిక కేంద్రం, గుండువారివీధి, రాజమండ్రి—1.

గీతాపఠన ప్రయోజనములు

హిందీ మూలం: శ్రీ జయదయాల్ గోయందకా, అనువాదం—శ్రీ మల్లంపాటి వెంకటసుబ్బారావు, ఎలప్రరు పుటలు—40. వెల—0-75 ప్రాప్తిస్థానం - శ్రీ ఎం. వి. ఎస్. రావ్, ఎలప్రరుపోస్టు, వయా తురుమెళ్ల, తెనాలి తాలూకా.

శ్రీ దేవీస్తుతి కదంబము

పద్యకావ్యం: రచయిత్రి - శ్రీమతి కొత్తపల్లి కామేశ్వరమ్మ. పుటలు –150. వెల—3-00 ప్రాప్తిస్థానం - శ్రీ విశ్వేశ్వర గ్రంథమాల, బాహుబలేంద్రునిగూడెం, వయా గన్నవరం, కృష్ణాజిల్లా.

శరత్ బాబు

జీవిత సాహిత్య పరిచయం. రచయిత—శ్రీ కె. వి. రమణారెడ్డి. పుటలు—92. వెల—సాధ్రతి:

1-50. మేలు ప్రతి: 2-50. ప్రాప్తిస్థానం— విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ-2.

దక్షిణేశ్వర భాగవతము

శ్రీరామకృష్ణ పరమహంస జీవితం ఇతివృత్తమైన ద్విపద కావ్యం. రచయిత—శ్రీ తలమర్ల కళానిధి పుటలు-76. వెల-1-00. శ్రీ తలమర్ల కళానిధి, 8-170, అరవింద సాగర్, అనంతపురం (ఏ. పి.)

శ్రీ ముద్రారామాయణము సంక్షేప శతకము

రచయిత - శ్రీ వాడ్రేవు చలమయ్య, పుటలు-30. వెల—1—00. ప్రాప్తిస్థానం: శ్రీవాడ్రేవు చలమయ్య, టౌన్‌హాల్ వీధి, విశాఖపట్నం-1.

మడివాలు మాచయ్య చరిత్రము

శివభక్తుని చరిత్ర. రచయిత - శ్రీ బండారు తమ్మయ్య. పుటలు-92. వెల 1-50 ప్రతులకు — శ్రీ నిర్మల శైవసాహితీ గ్రంథమాలిక, 8-11-9, నండూరివారివీధి, కాకినాడ.

ఆంధ్ర మేఘదూతము

పద్యానువాదం—శ్రీ సోమంచి సూర్యనారాయణ శర్మ. పుటలు-34. వెల 1-50. ప్రాప్తిస్థానం— శ్రీ ఎస్. ఎ. పద్మనాభశాస్త్రి, సూర్యారావుపేట, కాకినాడ-1.

గాంధీజీ కనిన కలలు

రచయిత శ్రీ సురవరాళి. పుటలు-56. వెల 1-00. ప్రాప్తిస్థానం-కుమారశ్రీ ప్రచురణలు, చిక్కడపల్లి, హైదరాబాద్.

మోహన్ గాంధి

బాలల నాటిక. రచయిత - శ్రీ చిత్రకవి ఆత్రేయ. పుటలు-43. వెల 1-00 ప్రాప్తిస్థానం - సంస్కరణ ప్రచురణలు, బాపట్ల, గుంటూరుజిల్లా.

భారత సంస్కృతి వివక్ష

పరిశోధన గ్రంథం రచయిత శ్రీ నవరుద్ర. పుటలు-72 వెల 2 00 ప్రాప్తిస్థానం - శ్రీ సి. హెచ్. జినేంద్రదాసు, నున్న, విజయవాడ.

చిన్నారి కథలు

పిల్లల కథల సంకలనం. సంకలనకర్త—శ్రీ కవుల ఆంజనేయశర్మ. పుటలు-24. వెల-0-70. ప్రాప్తిస్థానం రామాబాలానంద సంఘం పబ్లికేషన్స్, శాంవీధి, అనకాపల్లి (విశాఖజిల్లా)

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by Radhakrishna at the Andhra Patrika Press, 6 & 7, Thambu chetty Street, Madras-1.
Editor : S. Sambhu Prasad.